వాసిరెడ్డి సీతాదేవి నవల

కోతి-కొబ్బరికాయ

"డేంజర్ లెవల్ దాటిందట."

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను.

ఎదురు బెర్త్‌మీద రిటైర్డ్ చీఫ్ ఇంజనీరు కూర్చుని పక్కనున్న మాజీ మంత్రితో మాట్లాడుతున్నాడు.

"వచ్చే ఇరవైనాలుగ్గంటల్లో వరద ఉధృతం ఇలాగే ఉంటే మరో రెండడుగులు పెరగొచ్చు?"

"అయితే రాజమండ్రి...?" మాజీమంత్రి నోరు తెరిచి అలాగే ఉంచేశాడు.

కంపార్టుమెంట్‌లో అంతవరకూ దివ్యంగా వెలుగుతున్న లైట్లు గుడ్డిదీపాలయినాయి. ఆ మసక వెలుగులో మాజీ చీఫ్ ఇంజనీరు ముఖంలోకి ఆతృతగా చూశాను.

"పందొమ్మిది వందల ఏభై మూడులో-అంటే ముఫ్పై

రెండేళ్ళనాడు—అప్పుడు నేను ఎక్జిక్యూటివ్ ఇంజనీరుగా ధవళేశ్వరం సర్కిల్లో—"

రైలాగింది! ఆయన ఆగి కిటికీరెక్క పైకెత్తి చూశాడు. మా.మ.గారు కూడ లేచి రెండో కిటికీలో తల దూర్చాడు.

వాళ్ళిద్దర్నీ తోసేసుకుని ఈదురుగాలి రయ్యిన లోపల కొస్తూంది. అయినా నాకు ఊపిరి సలపటం లేదు. చమటలు పట్టిపోతున్నాయి.

రాజమండ్రి ఏమౌతుంది? ఇరవైనాలుగ్గంటల్లో? ఒక్క ఊపుతో లేచి నిలబడ్డాను. కాళ్ళకు పట్టు దొరకడంలేదు. వాళ్ళవెనక నిలబడి బయిటికి చూడటానికి ప్రయత్నించాను.

"ఏమైందీ?" పెద్దగా అరిచాను. నా అరుపుకు పై బెర్త్ మీద వళ్ళుతెలియకుండా నిద్రపోతున్న ఐ.ఎ.యస్. అర్భకుడు ఏజెన్సీ సబ్ కలెక్టరు ఎగిరి కిందకు దూకాడు.

"వాట్ హేపెన్డ్ మేడమ్? వాట్—" మాజీమంత్రిగార్ని తోసుకొని కిటికీ దగ్గర తలపెట్టాడు.

"ఏమైంది బాబూ?" గట్టిగా అరిచాను. మాజీ చీఫ్ ఇంజనీరు మెల్లగా తిరిగి నావైపు చూశాడు.

"మీరు-మీరూ" మహా తాపిగా అడుగుతున్నాడు. అసలు విషయం వదిలేశాడు. వీళ్ళింత స్థబ్దులు కాబట్టే కట్టిన ఆన కట్టలు కొట్టుకుపోతున్నాయి. వంతెనలు కూలిపోతూన్నాయి. నా ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

"మీరు - మీరు వాసిరెడ్డి-"

"అవును నేను వాసిరెడ్డి సీతాదేవినే-ఇంతకీ ఏమైంది?" వచ్చే చిరాకును అణుచుకొంటూ అన్నాను.

"నేను రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ని. నా పేరు-"

"తెలుసు. రాత్రి మీరు మాట్లాడుకుంటుంటే విన్నాను" విసుగ్గా అన్నాను.

"రామారావు జి.వో - అదే ఏభై ఐదేళ్ళకు వయసు తగ్గిస్తూ జారిచేసిన జీ.వో. వుంది చూశారా—దాని ప్రకారం ఫిబ్రవరి 83లో రిటైరయ్యాను."

"రీ ఇన్‌డక్షను ఇస్తారట్లేండి. ఇప్పుడేమయిందో చెప్పండి. ఇంకా ఇరవైనాలుగ్గంటల్లో రాజమండ్రి—" విసురుగా అడిగాను.

"రీ ఇన్‌డక్షనా? చీఫ్‌మినిస్టర్ ఇస్తానన్నా ఆ చుట్టూ ఉన్న గ్రహాలు ఊరుకుంటారటమ్మా సీతాదేవీ?" ఎన్నో ఏళ్ళ పరిచయం ఉన్నట్లు మాట్లేదేస్తున్నాడు, మహాను భావుడు. చెయ్యెత్తి దండంపెట్టొచ్చు.

"కాకపోతే ఇంట్లో కూర్చొపెట్టి జీతం ఇస్తార్లేండి. మీకు పోయిందేమిటి?" అయనగార్ని చూస్తుంటే కసికసిగా ఉంది.

"అదీ లేదంటున్నాడు గదమ్మా—అర్ధజీతం ముష్టిగా వేస్తాడట!"

"అయ్యా ఇంజినీరుగారూ. లక్షలూ కోట్లూ సంపాదించు కొన్న ఇంజనీర్లకు అది ముష్టిగా కన్పించవచ్చు. కాని-"

"సీతాదేవిగారూ. మీరు చాలా పొరపాటు పడుతున్నారు. మీరూ గవర్నమెంటు ఉద్యోగంలో ఉన్నారు. పైగా రచయిత్రి. మీకు ఇలాటి అభిప్రాయాలున్నాయంటే—" ఆయన కంఠం వణికిపోతూంది. ఉద్రేకపడిపోతున్నాడు.

"సారి—క్షమించండి. నా ఉద్దేశ్యం—" బాగా తగ్గిపోయి గుటకలు మింగాను.

"మేజర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీరు చేసిన నాకు ఉంటానికి కొంపకూడా లేదంటే మీరు నమ్ముతారా?"

నాకు గుండెలు కదబడ్డాయి. ఇంత అ(హా)నేష్టా? అబ్‌సర్డ్. అసంభవం. ఆయన పేరన లేకపోవచ్చు. అల్లుళ్ళ పేరనో, కూతుళ్ళపేరనో కోట్ల ఆస్తి-ఆరు తరాలు దంతాలు అరిగేట్టు తిన్నా తరగని ఆస్తి...మాజీమంత్రి నా ముందుకు వచ్చి నిలబడ్డాడు. నా ఆలోచనకు బ్రేక్ పడింది.

"సీతాదేవిగారూ, అల్లుళ్ళ పేర్నా, కొడుకుల పేర్నా, కూతుళ్ళ పేర్నా, కోడళ్ళ పేర్నా మరిపోతే మనవళ్ళ పేర్నా సంపాదించిన కోట్లాది ఆస్తి దాఖలుపరిచి నేను సన్యాసిని నా దగ్గరేముంది బూడిద అంటూ—" మాజీ మంత్రివర్యులు ఉపన్యాసం లంకించుకొన్నాడు. ఈయనగారు చేప్పేదంతా లోగడ ఎన్నోసార్లు ఎసెంబ్లీలోనూ బయటా పేపర్లలో విన్నదే మరి.

"అది పోనీయండి. ఇంతకీ నేనడుగుతున్నదీ—"

"అహా. చూశారా ఇంజనీరుగారూ. ఈవిడగారి అభి మానం! ఆ సంగతెత్తేసరికి అది పోనీయండి ఇది పోనీ యండి అని దులపరించేస్తున్నారు."

నాకు నోటమాట పెగల్లేదు. తెల్లముహంవేసి ఇంజనీర్‌ను చూశాను. అవతల ఉన్న ఐ.ఎ.యస్ ప్రొబేషనర్‌కు తెలుగు రాదు. అస్సాంనుంచి వచ్చినవాడు.

"ఉంటుందండీ బాబూ ఉంటుంది. ఎంత రచయిత్రి అయినా ఆ మాత్రం అభిమానాలు ఉండవంటారా? ఆ మాట కొస్తే మీకూ నాకూ లేవూ? అసలంతవరకూ వస్తే కులాభి మానం లేనివాళ్ళెవరో చెప్పండి నాకు?" జీవిత సత్యాల్ని వెళ్ళడిస్తున్న వేదాంతిలా చెప్పుకుపోతున్నాడు ఇంజనీరు.

నాకు వళ్ళు మండిపోతూన్నది ఈ కులంపిచ్చగాళ్ళను కిందున్న గోదారిలో తోసేయాలన్నంత కసిగా ఉంది. గోదారి గుర్తురాగా గుండెల్లోని గుబులు తలెత్తింది మళ్ళీ.

"ఇరవైనాలుగ్గంటల్లో రాజమండ్రి—"

"తెలుగు. తెలుగు. రాజమహేంద్రవరం—రాజరాజ నరేంద్రుడు పరిపాలించిన తెలుగు సంస్కృతి వెల్లివిరిసిన ..." ఇక ఆ పైన రాక ఆగిపోయిన ఆ మాజీమంత్రి ముఖం ఇప్పటికి నాకు బాగా గుర్తున్నది. వత్తివత్తి పలికి తన మాటల్లోని వ్యంగానికి తనే మురిసిపోతున్న ఆ మాజీ మంత్రి ముఖం చూస్తుంటే నాకు అసహ్యం వేసింది.

వీళ్ళేం మనషులు? సమయం సందర్భం లేకుండా యీ వాగుడేమిటి? ఈ వరదేమిటి? గోదారేమిటి? ఇరవైనాలుగ్గంటల్లో రాజమండ్రి మునగడమేమిటి? ఇప్పుడీ బండి ఇక్కడ ఎందుకు ఆగినట్టూ?

ఆ మాజీల నిద్దర్శి తప్పుకొని "వాటీజ్ ద మాటెర్ మిస్టర్ సంగ్మా!" కిటికి దగ్గర కొచ్చాను.

"ఆ కుర్రాడికేం తెలుసమ్మా? నన్నడగండి నే చెప్తా!" అన్నాడు ఇంజనీరు.

"తమర్నేగద ఇంతవరకూ అడిగింది?"

"చెప్తూనే ఉన్నా గదమ్మా! మీరే తొందరపడి పోతున్నారు." నన్ను తప్పుపట్టుతూ నింపాదిగా శలవిచ్చాడు ఇంజనీరు. ఈ తరహా మనుషులతో లాభంలేదు. నోరు మూసుకుని వాళ్ళు చెప్పే సోదంతా వినక అన్న నిర్ణయాని కొచ్చి మేస్టారిముందు స్టూడెంటులా నిలబడి చూశాను.

"ఇంజన్ డ్రైవర్ బండాపేశాడు—"

ఇంజన్ డ్రైవరు ఆపకపోతే అయనా నేనూ ఆపుతామా? ఏమిటో చాదస్తం.

"అదే ఎందుకు ఆపాడూ అని?"

"వరద ఉధృతంగా ఉంది. ట్రాక్‌కు చాలా దగ్గర్లో ఉంది ప్రవాహం. అందుకని—"

"తేల్చిచెప్పు మహానుభావా? నాకు గాబరాగా ఉంది."

బండి ఇప్పుడెక్కడ ఆగింది? బ్రిడ్జీమీదనా? అటు వెనక్కూ పోక, ఇటు ముందుకూ పోక గోదారి మధ్యలో వంతెనమీద రైలు ఆగిందా? ఈ వంతెన కొట్టుకుపోయి, రైలుపెట్టెలు గోదావరి పొంగులో కలిసి సముద్రంలో తేలేదాకా......

"ఏమిటమ్మా చాలా గాబరాపడ్తున్నట్టున్నారు. ఇది మామూలే. బ్రిడ్జి దగ్గరకు రాగానే రైలు ఆగి మళ్ళీ మెల్లిగా బయలుదేరి బ్రిడ్జి దాటుతుంది. గోదావరి స్టేషన్నుంచి క్లియరెన్స్‌కోసం ఆగాడు డ్రయివరు. కొన్ని వందలసార్లు దాటాను నా ముప్పైమూడేళ్ళ సర్వీసులో యీ బ్రిడ్జి."

నిట్టూర్పు విడిచాను. హాయిగా గాలి పీల్చుకొన్నాను. ఈ మాట చెప్పటానికి ఇంత సస్పెన్స్‌లో ముంచెత్తాడు. గోదారిలో మునిగిమునిగి ఒడ్డుకు చేరినట్టుంది. తిరిగొచ్చి బెర్త్‌మీద కూర్చున్నాను. ఆ మాజీలకేసి నిర్లక్ష్యంగా చూశాను. నది దాటేప్పుడు ఓడమల్లయ్య. దాటేక బోడి మల్లయ్య అన్న సామెత గుర్తొచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నారూ?"

"నేనా?" ఆశ్చర్యంగా అన్నాను. అంతలోనే గుర్తొచ్చింది. నాలో నేనే నవ్వుకొన్నట్టు.

"మీ ముఖాలు చూసి!" అనాలి అనిపించింది.

"నా చిన్నప్పటి సంగతేదో గుర్తొచ్చిందండి. రైలు గోదావరి వంతెనమీద పోతూండగా కానీ, కానీ తీసి గోదాట్లోకి విసిరాను. అన్నీ స్థంభాలకు తగిలి ఇవతల పడ్డాయి. ఒక్కటీ నేరుగా నదిలోకి విసర్లేకపోయాను. మా స్నేహితురాలు కమల ఒక కాని విసరగలిగింది. వెంటనే కేరింతలు కొడ్తూ చప్పట్లు చరిచింది. 'నాకు మంచి మొగుడొస్తాడే సీతా. నాకు మంచి మొగుడొస్తాడే' అంటూ బెంచీమీద నిలబడి గోదాట్లోకి చూస్తూ కిటికీచువ్వలు పట్టుకొని గంతులేసింది- అమాయకంగా ఐదేళ్ళ కమల." తక్కున ఏదో గుర్తొచ్చి ఆగిపోయాను. వాళ్ళు మాట్లాడిందంతా నాకు సొదగా అనిపించింది. ఇప్పుడు నేను చేస్తున్న దేమిటి? ఎవడి సొద వాడిది. ఎవరి నస వారిది. ఏంచేస్తాం. మనిషి మనసులో ఎంతని దాచుకోగలడు?

"దొరికాడా?"

ఉలిక్కిపడ్డాను.

"ఏమిటి దొరికింది?" ఎదురడిగాను- నలిగిపోయిన ఖాదీ సిల్కు లాల్చీలో నూనె హరించుకుపోయి కొడగట్టిన చమురుపొత్తిలా వెలుగుతున్న మాజీ మంత్రివర్యుడ్ని.

"మొగుడు?" కర్ణకఠోరంగా ఉంది.

"ఎవరికి?" మాట జారింది. యథాలాపంగా అన్నాను. మాటలు వెనక్కు రావు గదా?

"మీ నేస్తం కమలకు మంచి మొగుడొచ్చాడా?" అదోలా నవ్వేడు.

"మొగుడైతే దొరికాడు."

"మంచి మొగుడు దొరికాడా అని?" ఆ ప్రశ్నలోనే ఏదో ఆనందం ఉన్నట్టు ముఖంపెట్టాడా వ్యక్తి.

డీజిల్ ఇంజన్ కూత. ఒకటి. రెండుసార్లు. బండి కదిలింది. టైం చూసుకొన్నాను. 5-45 అయింది.

సికింద్రాబాద్‌లో 7-45కు బయలుదేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్ కొవ్వూరు స్టేషను దాటి గోదావరి రైలుబ్రిడ్జి దగ్గరకు 4గం.15 నిముషాలకొచ్చి ఆగింది. 4గం. 55 నిముషాలకు రాజమండ్రి చేరవలసిన బండి ఇప్పుడు గోదావరి బ్రిడ్జి మీద కొచ్చింది. గంటకు పైగా లేటు. పాపం మావాళ్ళు

స్టేషన్లో నాలుగున్నరనుంచే వేట్ చేస్తూ ఉంటారు. ఏమిటో మనసు. చాలా చిత్రమైనది. పదినిముషాల ముందు చావు బ్రతుకుల్ని ఆలోచించింది. ప్రమాదం ఏదీ లేదనగానే ఓ గంట లేటయితేనే విలవిల్లాడిపోతుంది. హౌ సిల్లీ యీజిట్! 'నీ వెక్కిన బండి ఒక జీవితకాలం లేటు' అన్న ఆరుద్ర కళ్ళముందు కదిలాడు.

వాట్ ఎ బ్యూటిఫుల్ సింఫొని! టక్‌టక్ థన్‌థన్ బ్రిడ్జిమీద రైలు వెళ్తూ చేస్తున్న ధ్వని తమాషాగా ఉంది. రైలు వేగం పెరుగుతున్నకొద్దీ గుడ్డిగా వెలుగుతున్న లైట్లు కంపార్ట్‌మెంట్‌లో కాంతివంతమయినాయి. కిటికీదగ్గర, బ్రిడ్జి ఇనప దూలాల మధ్యనుంచి కిందకు చూస్తూ నిలబడ్డాను.

గోదారి. వరదగోదారి. ఒరవళ్ళు పరవళ్ళు తొక్కుతూ నిండుగా ప్రవహిస్తూన్నది. చూపు కందినంతవరకూ జలమయంగా ఉంది. చల్లటి నీటితుంపర్లతో గాలి ముఖాన్ని తాకుతూ ఉంది. మధురమైన అనుభూతి. 'వెన్నెల్లు మేసి ఏరు పారుతూంటే-' ఎప్పుడో ఏ మహాకవో ఏ మధురానుభూతి పొందో చెప్పిన భావగీతికలు మనసుతీగలను మీటుతూ ఉంటే బాహ్యప్రపంచాన్నే మరిచిపోయాను. ఇలా—ఇలా—జీవితకాలం—అనంతంగా యీ బండి, యీ వంతెనమీద నడుస్తూఉంటే— పొంగి పొరలి ఒడ్డుల్ని ఒరుచుకొని ప్రవహిస్తున్న నిండు గోదారిని వెన్నెల్లో చూస్తూ ఉండిపోతే—

గోదావరి స్టేషన్ వచ్చింది.

సూట్‌కేసు సర్దుకొన్నాను.

గాలికి లేచి అల్లీబిల్లిగా తిరుగుతూ నుదురుమీదకు వాలిపోయిన ముంగురులను సర్దుకొని బెర్త్‌మీద కుదురుగా కూర్చున్న నా ముఖంలోకి ముఖంపెట్టి ముందుకు వంగి చూస్తూ మాజీమంత్రి మళ్ళీ అడిగాడు.

"మీ స్నేహితురాలి మొగుడిసంగతి చెప్పారు కాదు."

పెద్ద జిడ్డుగాడిలా ఉన్నాడు. కళ్ళెత్తి చురుగ్గా చూశాను. అబ్బ ఆ ముఖం! అచ్చంగా స్కెలిటిన్‌లా ఉంది. మొగుడంట మొగుడు! భర్త అంటే యీయన నోటి ముత్యాలేం రాలిపోతాయో! సంస్కృతి లేదు. సంస్కారం లేదు. ప్రజలంటే అలుసు. ఆడదంటే మరీ అలుసు. మనుషులంటే ఎంత నిర్లక్ష్యం? ముప్పైఐదేళ్ళు దేశాన్ని ఏలారు. ఈ జాతి మనుషులింకెంతకాలం ఏలుతారో?

"ఏం పాపం! మంచి మొగుడు దొరకలేదా?"

వళ్ళు మండిపోతున్నది ఆయన మాట్లాడుతుంటే! ఆ ముఖం చూస్తుంటే వాంతివచ్చేట్టుంది. అప్పటికి ఇంకా ఏమీ తినలేదు కాబట్టి సరిపోయింది.

"ఏమండి సీతాదేవిగారూ?"

ఉలిక్కిపడ్డాను. ఏదో మృగం మానవభాష మాట్లాడుతున్నది.

"కథ సస్పెన్స్‌లో వదిలేసిపోతున్నారు" ఊరుకునేట్టు కన్పించడంలేదు. మాజీ ఇంజనీరు ఆ మాజీమంత్రి మాటకు బెకబెకా నవ్వాడు.

"మంచిమొగుడో చెడ్డమొగుడో మీరే చెప్పాలి!" అని ముఖంలోకి చూశాను.

"నేనా? ఎలా?" అంటూ నోరు తెరిచాడు. కోట్లకు కోట్లు తిన్న నోరది. లక్షలకు లక్షలు అబద్ధాలాడిన నోరది. వేలకువేలు బూతులు కూసిన నోరది.

ఛ.ఛ...ఎందుకు ఇలా ఆలోచిస్తున్నాను. నాకే అన్యాయంగాను అక్రమంగాను అనిపించింది. ఆ రకం మనుషులమీద నాకున్న డీప్‌రూటెడ్ ప్రెజుడిసెస్‌తో ఎదురుగావున్న యీ పెద్దమనిషిని గురించి ఆలోచిస్తున్నానేమో అనిపించింది.

"మాంచి సస్పెన్స్‌లో ఉంచేశారు. మీ కమలెవరో నాకు తెలియదు. ఇహ ఆవిడగారి మొగుడిసంగతెలా తెలుస్తుంది నాకు? అహహ్హా!" అతడు నవ్వుతుంటే మూరెడు ముందుకొచ్చిన బానెడు పొట్ట ఎగిరెగిరిపడింది.

"ఎలాగో చెప్తా వినండి!" నాటకఫక్కీలో అన్నాననుకొన్నాను. ఎలా అన్నానో తెలియదు గాని మా.మ. ఆయన పక్కనే ఉన్న మా. ఇ. బుద్ధిమంతులైన బడిపిల్లలు ఆలిస్ ఇన్ వండర్‌లాండ్ కథ వినడానికి సిద్ధమయినట్టుగా శ్రద్ధగా వినసాగారు.

"కమల పెళ్ళయేనాటికి ఆమె భర్త మెట్రిక్ తప్పి ఒకానొక మంత్రిగారిదగ్గర అన్అఫీషియల్ ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. పార్టీ ఆఫీసులో ప్రెసిడెంటుకృ్ఞా అతి సన్నిహితుడుగా పనిచేస్తున్నాడు. చిన్న పెద్ద పనులు చేయిస్తూ రెండుచేతులా ఆర్జిస్తున్నాడు ఆరంభంలో ఆఫీసు బాయ్‌లా మెలిగిన ఆయన ఐదేళ్ళలో చాలా ఎత్తుకు ఎదిగిపోయాడు. ప్రతి మగవాడి విజయాలకు అభివృద్ధిగా ఒక ఆడదాని ప్రతిభ ఉంటుందన్న నానుడి అక్షరాలా నమ్మినవాడు గనక కమలను బలవంతంగా రాజకీయాల్లోకి- కాదు రాజకీయంలోకి దించాడు. భార్య శీలాన్ని పెట్టుబడిగా పెట్టి అంచలంచలుగా పైకివచ్చాడు. ముందు ఎమ్మెల్లే, ఆ తర్వాత మంత్రయ్యాడు. మంత్రయ్యాక కమలలాంటి ఆడవాళ్ళ శీలాన్ని తను ఆదిలో పెట్టిన పెట్టుబడికి ఇబ్బడిముబ్బడిగా హరించివేశాడు. మళ్ళీ జన్మంటూ ఉంటే మళ్ళీ ఇలాటి రాజకీయ నాయకుడికి భార్యగా మాత్రం పుట్టించవద్దని భగవంతుడ్ని ప్రార్థించి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకొన్నదట నా చిన్ననాటి స్నేహితురాలు కమల!" ఆగి మాజీ

మంత్రిగారి ముఖంలోకి చూశాను. దేన్నో వెతకడానికి ప్రయత్నం చేశాను. నా ఆశలు అడియాశలయినాయి. బెల్లం కొట్టిన రాయిలా స్తబ్దుగా జిడ్డోడుతూ ఉన్నాడు.

"కమల భర్త పేరేమిటి?" ఉత్కంఠతో అడిగాడు మాజీ సి.ఇ. అతడి మాట వినగానే నటించి కిటికీలోనుంచి బయటికి చూశాను. రాజమండ్రి అవుటర్ సిగ్నల్ కనిపించింది. హాయిగా గాలిపీల్చుకొన్నాను. ధైర్యాన్ని కూడదీసుకొన్నాను.

"ఎవరండీ ఆయన? మీకు తెలియకుండా ఎవరుంటారు? నలభై ఏళ్ళనుంచి రాజకీయాల్లో ఉన్నారు." మాజీ చీఫ్ ఇంజనీరు ఉక్కిరిబిక్కిరయిపోతూ పక్కనే ఉన్న మాజీ మంత్రిగార్ని గుచ్చిగుచ్చి అడుగుతున్నాడు.

"ఇంత కథ చెప్పిందిగా. అది కూడా ఆవిడ్నే చెప్పమనండి!" అతడి మాటల్లో ఇనుపదబ్బనాలున్నాయి. ఆ క్షణంలో అతడు నాకేసి చూసిన చూపుల్లో చురకత్తుల మెరుపులు కనిపించాయి. నాకు నోరెండిపోతూంది. అయినా బింకంగా ముఖంపెట్టి సూట్‌కేసు తీసుకొని నిలబడి చూశాను. బండి ప్లాట్‌ఫారం మీదకొచ్చింది. కళ్ళు విప్పుకొని కలయ చూశాను. జనంలోనుంచి నా కోసం వచ్చిన మా కోఆర్డినేటర్ కల్పన, ఆమెతోపాటు మరో ఇద్దరు ముగ్గురు కనిపించారు. ప్రాణం లేచివచ్చింది.

ధైర్యంగా ఎదురుగా ఉన్న మాజీలకేసి చూశాను. మంత్రి కత్తులు నూరుతున్నట్టుగా అనిపించింది. ఆ మాజీ సి.ఇ.కేం గుర్తొచ్చిందో అతడూ నాకేసి కొరకొరా చూస్తున్నాడు. బోడి మాజీగాళ్ళు ఇంక నన్నేంచేస్తారు. అంతలో బాత్‌రూంలో డ్రెస్ ఛేంజిచేసుకొని సబ్‌కలెక్టర్ కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చాడు. చిలిపిమనసు అవకాశం దొరికితే కవ్వించా అనిపిస్తుంది. బండాగింది. కిటికీదగ్గర వున్న నన్ను చూసి మావాళ్ళు పరుగెత్తుకొని కంపార్టుమెంట్ దగ్గరకు వస్తూ ఉన్నారు.

"క్షమించాలి. మిమ్మల్ని సస్పెన్స్‌లో వదిలి వెళ్ళాలని లేదు చెప్పేస్తున్నాను. వినండి"

"మొత్తానికి రచయిత్రి అనిపించారు. భలే కథ చెప్పారు. గొప్ప సస్పెన్స్!" పగలబడి నవ్వసాగాడు మాజీమంత్రి

బ్లడీ హిపోక్రేట్. క్షణాల మీద మనిషి మారిపోయాడు.

"ఏమండి సి.ఇ.గారూ, మన సీతాదేవి పుస్తకాలేమయినా చదివారా?"

మన సీతాదేవట? పయోముఖ విషకుంభం అంటే ఏమిటో నాకు మొదటిసారిగా అర్థమైంది.

With best compliments

BRINDAVAN GOODS CARRIERS

TRANSPORT CONTRACTORS & COMMISSION AGENTS

HYDERABAD Phone: 41747 | BANGALORE 223983 | GOA 301

"చదవలేదు. కాని విన్నాను. రెండుమూడేళ్ళక్రితం ఆమె గారు రాసిన నవల ఒకదాని గవర్నమెంట్ నిషేధించిందని తెలుసు. అప్పుడు పత్రికల్లో ఎసెంబ్లీలో—" సి.ఇ.గారి మాట పూర్తికాకుండా అందుకొన్నాడు మాజీమంత్రి.

"ఎసెంబ్లీలో వచ్చేముందు కేబినెట్‌లో డిస్కషన్ కొచ్చింది. నిషేధాన్ని రద్దుచేయాలని నేను గట్టిగా వాదించాను. స్కాండల్ వచ్చి అబద్దాలు కసికసిగా ఉంది. ఎలాగో నిలదొక్కుకున్నాను. కంపార్టుమెంట్‌లోకి కల్పన ఇద్దరు అసిస్టెంట్సుతో సహా వచ్చింది.

"థాంక్యూ సర్." నాకిట్లో నిలబడి చెప్పాను:

"నేనే థాంక్స్ చెప్పాలమ్మా మీకు. మంచి కాలక్షేపం. బలే కథ చెప్పారు!" ఎంత ఆప్యాయతో ఆ గొంతులో.

"అయ్యయ్యో! అది కథ కాదండి. వాస్తవం. జరిగింది. అయితే ఆమె పేరు కమల కాదు."

"మరెవరూ?" ఇద్దరూ ఒక్కసారే నోళ్ళు తెరిచారు.

"విజయదుర్గ!"

మళ్ళీ వెనక్కు చూడలేదు. మరుక్షణంలో ప్లాట్‌ఫారం మీదకు దూకేశాను.

"ఏమిటి మేడమ్ అంత ఖంగారు పడుతున్నారు. బండి ఆలస్యమయిందనా? టైముంది మనకు. ఇక్కడ టిఫెన్ చేసుకొని ఏడుగంటలకు బయలుదేరితే చాలు. మన ప్రోగ్రాం టైంకు అమలాపురం చేరుకోవచ్చు!" వెనకే నడుస్తూ చెప్పుకుపోతున్నది కోఆర్డినేటర్ కల్పన. ఏదో సాధించా ననే తృప్తి మనసుని చుట్టేసింది.

జీప్‌లో కల్పన పక్కన కూర్చున్నాను. "ముందు గెస్ట్ హౌస్‌కు పోనివ్వు!" డ్రైవర్‌కు ఆదేశాలిచ్చింది కల్పన. చాలా చురుకైన పిల్ల.

2

"మేడమ్! వచ్చేది ముమ్మిడివరం!" కల్పన అన్నది.

"ముమ్మిడివరం బాలయోగి" సాలోచనగా అన్నాను.

"అవును మేడమ్. చూస్తారా!" అని డ్రైవర్ని మెల్లగా పోనియ్యమని సౌంజ్ఞ చేసింది కల్పన.

"అక్కడేముంది కల్పనా చూడటానికి?"

"అదేమిటి మేడమ్ అలా అంటారు. లక్షలాది జనం వచ్చి చూసిపోతారు. సెక్రెటరీలు మంత్రులు వచ్చి బాలయోగి గారి దర్శనం చేసుకొనిపోతూ ఉండేవాళ్ళు మేడమ్."

"ఆయన చచ్చిపోయాడుగా?"

"అయితే ఏం మేడమ్. ఇంకా జనం తండోపతండాలుగా వచ్చి ఆయన సమాధిని దర్శనం చేసుకుపోతూ ఉన్నారు. బాలయోగిగారి మహత్యం అలాంటిది!"

దీపావళి శుభాకాంక్షలతో

సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేయండి!

మీ కుటుంబానికి కావలసిన నవ్యత, నాణ్యత కలిగిన చీరలు, సూటింగ్స్, షర్టింగ్స్ మా ప్రత్యేకత!

బీసెంట్ రోడ్, విజయవాడ2

ఫోన్: 62420

"ఏం మహత్యం తల్లీ, మనిషి చచ్చి కుళ్ళి వాసన కొట్టొంటే మూడురోజుల తర్వాత శవాన్ని బయటికి తీశారని పేపర్లో చదివానే!"

కల్పన గతుక్కుమన్నది

"అది నిజమే మేడం! అయినా జనానికి భక్తి తగ్గలేదు!"

"ఇది భారతదేశం. ఇంకో పందేళ్ళయినా పట్టొచ్చు. మతపిచ్చను, మూఢాచారాలను, నమ్మకాలను వదిలించుకొని శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవడానికి. మరి మనది నాలుగువేల సంవత్సరాల నాగరికత గదా!"

"నేరుగా వెళ్ళిపోదామా?"

"నీకు చూడాలని ఉంటే ఆగుదాం" అంటూ కల్పన మొహం చూశాను.

"నో.నో. మేడమ్. మీరు చూస్తారేమోనని. అంతే!" డ్రైవర్‌కేసి తిరిగి నేరుగా పోనీయమని చెప్పింది

అరవై మైళ్ళ వేగంతో పోతూ ప్రతి రెండుమూడు నిము షాలకు స్పీడ్ తగ్గించి ఎదురొచ్చే వాహనాల్ని తప్పుకొంటూ పోతున్నాడు జీప్‌డ్రైవర్. చల్లటి గాలి ముఖాన్ని తాకుతూంటే హాయిగా ఉంది. కళ్ళు మూతలు పడుతున్నాయి.

"మేడమ్! రాత్రి నిద్రపట్టలేదా?" అని అడిగింది కల్పన.

"ఏం? తునికిపాట్లు పడుతున్నానా?"

"అని కాదు మేడమ్. జీప్ కదా అని. అందులో బయట వైపు కూర్చున్నారని!"

కల్పన తెలివైనది. నవ్వొచ్చింది. ఎంత సున్నితంగా చెప్తుంది.

"కోనసీమ వచ్చేశాం మేడమ్. ఇంకో గంటలో అమలాపురం వెళ్ళిపోతాం."

"కోనసీమంటే ఎగ్జాక్ట్‌గా ఏ ఏరియా?" ముంచుకొస్తున్న నిద్రమత్తును వదిలించుకొందామన్న ప్రయత్నంలో కల్పనను మాటల్లోకి దింపాను. అడిగితే చాలు. కల్పనకు ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది. చెప్పింది చెప్పకుండా విసుగెత్తించకుండా గంటలతరబడి కబుర్లు చెప్తుంది. అదీ ఒక కళే అనుకోవాలి. అది అందరికీ చేతనయింది కాదు. నా మట్టుకు నాకు ఐదు నిముషాలు మాట్లాడాక మళ్ళీ ఇంకేం మాట్లాడాలా అని ఆలోచిస్తాను.

"మేడమ్. ఇంతకుముందు బ్రిడ్జి దాటాం కదా. అక్కడ్నుంచి కోనసీమ మొదలవుతుంది. రాజోలు, కొత్తపేట, అమలాపురం యీ మూడు తాలూకాల భూభాగాన్ని కోనసీమ అంటారు. గోదావరి పాయలుగా చీలి గౌతమీ, వసిష్ఠ, వైనతేయా పేర్లతో చివరకు సముద్రంలో కలుస్తుంది. ఈ గోదావరి పాయలమధ్య ఉన్న భూభాగాన్నే కోనసీమంటారు మేడమ్. ఇంత సారవంతమైన భూమి ఆంధ్రప్రదేశ్‌లో మరెక్కడా లేదు. బహుశః భారతదేశంలో కూడా లేదంటే అతిశయోక్తి లేదేమో! ఈ కోనసీమవాసులకో ప్రత్యేకత ఉంది:"

"ఏమిటది?" ఉత్సాహంగా ఉత్కంఠతో అడిగాను. కల్పన అసాధ్యురాలు. నిద్రమత్తు వదలగొట్టింది.

"ఈ కోనసీమను గురించి ఓ కథ ఉంది మేడమ్. మీరు విన్నారో లేదో?"

"కథా? చెప్పు. చెప్పు!" అంటూ సర్దుకు కూర్చున్నాను జీపులో. ఎటుచూసినా పచ్చటి తివాచి పరచినట్టున్నది నేల. రోడ్డుకు అటూ, ఇటూ అరటి, కొబ్బరి, మామిడి తోటలు. పూలతోటలు. పనుపుతోటలు. చూస్తుంటే ఒళ్ళు పులకించిపోతూంది.

"కల్పనా! చెప్పవేం? కోనసీమ కథ చెప్తానన్నావుగా?" కల్పనవైపు తలతిప్పి చూశాను. ఆమె చెంపలు ఎరుపెక్కాయి. కళ్ళు మిలమిల్లాడుతున్నాయి. ఆశ్చర్యంగా చూశాను. కథ చెప్పడానికి ప్రిపేర్ అవుతుందన్న మాట. తను చెప్పబోయే కథ మనసులో మొదలగానే ఆమె ముఖంలో వచ్చిన మార్పు నన్ను మంత్రముగ్ధను చేసివేసింది. కల్పన-ప్రవృత్తికి తగ్గ పేరు-ప్రయత్నిస్తే పెద్ద ఆర్టిస్టు కాగలదు.

"మేడమ్. రడీ!" కల్పన కంఠంలో ఎంతలో ఎంత మార్పు!

"యస్ ఐయాం రడీ! గో ఆన్!"

"కైకేయి కోరికపై తండ్రిమాట జవదాటని శ్రీరామచంద్రుడు సీతాసమేతుడై లక్ష్మణుడు వెంటరాగా అయోధ్య వదలి అరణ్యవాసానికి బయలుదేరి వస్తున్నాడు..."

"అయోధ్య రాముడికి కోనసీమకు సంబంధమేమిటి కల్పనా?" వచ్చే నవ్వాపుకుంటూ అడిగాను.

"మేడమ్! మీరిట్లా మధ్యలో, అడ్డుపుల్ల లేయకూడదు. పూర్తిగా విన్న తర్వాత అడగండి అనుమానాలేమున్నా ఉంటే!" సీరియస్‌గా ముఖంపెట్టి అన్నది.

"సారి కల్పనా సారి...ప్లీజ్ చెప్పు. ఊఁ." పెదవి బిగించి కూర్చున్నాను.

"అట్లా బయలుదేరిన రాముడు, సీత, లక్ష్మణుడూ దండకారణ్యంలో కొంతకాలం ఉండి దక్షిణాపథానికి ప్రయాణం కట్టారు. లక్ష్మణుడు మూటాముల్లె నెత్తిన బెట్టుకొని అన్నగారిని వదినగారిని అనుసరించి వస్తున్నాడు. సీతా, రాముడు చెయ్యీ చెయ్యీ కలుపుకొని చెట్టాపట్టా లేసుకొని దారిలో కనిపించే వింతలను విశేషాల్ని చూస్తూ హాయిగా కబుర్లు చెప్పుకొంటూ వశిష్టానది వొడ్డుకొచ్చారు.

వాళ్ళ వెనకే అన్నగారి అడుగుజాడల్లో మూటలు మోస్తూ చెమటలు కక్కుతూ లక్షణుడు కూడా నది ఒడ్డుకు చేరుకున్నాడు. సీతారాములు నది దాటారు. ఆ వెనకే లక్ష్మణుడూ నది దాటాడు. నది దాటాక కొంతదూరం సీతను వెంటబెట్టుకొని నడిచిన రాముడు లక్ష్మణుడొస్తున్న జాడ కనిపించకపోయేసరికి ఆగి వెనక్కు తిరిగి చూశాడు.

అల్లంత దూరంలో లిల్లాయి పాటలు పాడుకొంటూ, యీలలువేస్తూ నిర్లక్ష్యంగా నడిచివస్తోన్న లక్షణుడ్ని చూసి రాముడు ఇదేమిటి నా తమ్ముడు లక్ష్మణుడేనా ఇతడు అని ఆశ్చర్యపోయాడు. కొయ్యబొమ్మలా నిలబడి తమ్ముడికేసి చూడసాగాడు. అంతవరకు నెత్తిమీద పెట్టుకొని మోస్తూ తీసుకొస్తున్న మూటల్ని రెండు చేతుల్తో పట్టుకొని అట్టూ ఇటూ ఊపుతూ రాముడికేసి ఉసిఉసిగా వడివడిగా వస్తూన్నాడు. అలా వస్తూన్న తమ్ముడ్ని చూసి, మనసులో మధనపడుతూ సీతమ్మను వెంటపెట్టుకొని ముందుకు నడక సాగించాడు రాముడు.

"ఆగు!"

వెనకనుంచి లక్ష్మణుడి కేక వినిపించింది. రాముడూ సీతా శిలావిగ్రహాల్లా నిలబడిపోయారు. దగ్గరౌతూన్న లక్ష్మణుడి వాలకం చూసిన రాముడు అయోమయావస్థలో పడిపోయాడు.

"ఎవడు మోస్తాడనుకున్నావ్ యీ గాడిద బరువంతా? నీ బట్టలు సామాగ్రి కాకుండా నీ పెళ్ళాంచీరెలు, లంగాలు కూడా నేనే మొయ్యాలా ఏమిటి? నేనేం నీ బానిసను అనుకొన్నావా? నేనూ మగాడ్నే! నాకూ పౌరుషం ఉంది. ఆడదాని ఇడిసిన బట్టలు మోసే ఖర్మ నాకేం పట్టలేదు! మీ మూటలు మీరు మోసుకోండి!" అంటూ లక్ష్మణుడు మూటల్ని రాముడిముందు పారేసేడు. అలా వాళ్ళ మూడు మూటలు విసిరేసి స్వేచ్ఛగా తిరుగుతూ, పళ్ళు ఫలాలు కోసుకొని తింటూ, హాయిగా పాటలు పాడుకుంటూ అన్నవదినలను వదిలేసి వెళ్ళిపోయాడు. ఇదేమీ అర్థంకాని రాముడు ఖిన్నుడైపోయి తమ్ముడు పారేసిన మూటల్ని నెత్తిన పెట్టుకొని సీతతో ముందుకు సాగిపోయాడు. సీతమ్మకయితే అంతా అగమ్యగోచరంగా ఉందట.

రాముడూ, సీతా మూడురోజులపాటు నడిచి ఎట్టకేలకు గోదావరి పాయలైన గౌతమి వైనతేయా పాయిలు దాటి దక్షిణదిక్కుగా నడవసాగారు. ఆమడదూరం అన్నా నడిచారో లేదో వెనకనుంచి హృదయవిదారకంగా కేకలు విన్పించాయి. రాముడు ఆగి వెనక్కు తిరిగి చూశాడు. అటునుండి తమ్ముడు లక్ష్మణుడు గుండెలు బాదుకొని విలపిస్తూ పరుగుపరుగున వస్తూ కన్పించాడు.

"అగ్రజా! శ్రీరామచంద్ర ప్రభూ! ఏమిటీ దారుణం? నీ అనుంగు తమ్ముడు, నీ సేవకుడు ఇంకా బ్రతికే ఉన్నాడు. ఆ మూటలు మీరు మొయ్యడమేమిటి? నా వదిన, నా తల్లి, నెత్తిన ఆ భారమేమిటి? కరుణాసముద్రా! దయామయా! నాకీ శిక్ష ఎందుకు విధించావు. నేను చేసిన నేరమేమిటి? నే చేసిన అపచారమేమిటి?" కన్నీరు మున్నీరుగా విలపిస్తూ లక్ష్మణుడు అన్న పాదాలను చుట్టేసుకొన్నాడు.

దయామయుడయిన రామచంద్రుడు తమ్ముడ్ని ఓదార్చి తనదగ్గర, సీతమ్మ నెత్తిమీద ఉన్న మూటల్ని దించి లక్ష్మణుకికి అందించాడు. లక్ష్మణుడు మహాప్రసాదంలా అందుకొని నెత్తిన పెట్టుకొని అన్నగారి ఆజ్ఞకోసం ఎదురుచూశాడు.

నాలుగడుగులు ముందుకువేసిన రాముడికి చటుక్కున ఏదో ఆలోచన తళుక్కున మెరిసింది. అంతవరకు నది దాటేంతవరకూ ఎంతో నమ్రతతో ఉన్న లక్ష్మణుడి ప్రవర్తన నది దాటగానే మార్పువచ్చింది. అలానే ఈ నది దాటగానే లక్ష్మణుడిలో మార్పువచ్చింది. ఏమిటీ చిత్రం?

రాముడు ఆగి లక్ష్మణుడితో 'తమ్ముడూ నువ్వూ వదినా నడుస్తూ ఉండండి. నే నిప్పుడే వస్తాను" అనిచెప్పి రాముడు వెనక్కు వచ్చాడు. నది దాటి కొంతదూరం నడిచి అక్కడ ఇంత మట్టితీసి మూటకట్టుకొని తిరిగి ప్రయాణమయ్యాడు. నది దాటి లక్ష్మణుడిని, సీతను కలుసుకొన్నాడు. తను తెచ్చిన మట్టిమూటను కూడా లక్ష్మణుడి నెత్తిన పెట్టి దక్షిణదిక్కుగా ప్రయాణం సాగించాడు.

రావణాసురుడు సీతను ఎత్తుకువెళ్ళాడు. రాముడు వానర సైన్యాన్ని వెంటబెట్టుకొని వారధికట్టి లంకను చేరడం,

With best compliments from

PRASAD POULTRY FARM

HIMAYATSAGAR VILLAGE, VIKARABAD ROAD,

HYDERABAD — PHONE: 48093

రావణాసురుడ్ని చంపి సీతను వెంటబెట్టుకొని పుష్పక విమానంలో అయోధ్యకు తిరిగిరావడమూ జరిగిపోయాయి.

పట్టాభిషేకం అయాక నిండుసభలో సీతాసమేతుడయిన రాముడు కొలువుతీరి ఉన్న ఓ రోజు, దండకారణ్య విశేషాల్నీ, కిష్కింధలో జరిగిన కథాకమామీషూ, లంకానగరి ఔన్నత్యాన్నీ ముచ్చటించుకొంటున్నారు. రాముడికి హఠాత్తుగా ఆనాటి లక్ష్మణుడి ప్రవర్తన గుర్తుకొచ్చింది.

మూటకట్టి తెచ్చిన మట్టిని దర్బారుహాల్లో కుప్పగా పోసి సభాసదులకేసి చూశాడు. వాల్మీకి, వశిష్ట, విశ్వామిత్రాది మహాఋషులూ, సుగ్రీవ, అంగద, జాంబవంతహనుమాదులూ కొలువుతీరి ఉన్నారు. భరత లక్ష్మణ శతృఘ్నులు సీతారాములకు వింజామరలు వీస్తూ నిలబడిఉన్నారు.

"గురువర్యులూ, మహాఋషులూ, పూజ్యులూ, స్నేహితులు, హితులారా-" పట్టాభిరాముడు గంభీరంగా మొదలుపెట్టి, ఆనాటి లక్ష్మణుడి ప్రవర్తనను గురించి సవివరంగా వివరించాడు.

"ఇప్పుడు మీముందున్న మట్టి గోదావరీనది పాయల మధ్య ఉన్న భూఖండానికి చెందినది. ఆనాటి లక్ష్మణుడి ప్రవర్తనకు కారణం నా తమ్ముడ్ని ఆవరించిన మాయా, ఇంద్రజాలమా లేక యీ మట్టిలో వున్న గుణవిశేషమా, అన్నది నాకు ఇంతవరకు అంతుబట్టలేదు. అందువల్ల మీరొక్కక్కరే ఆ మట్టిమీద నిలబడి మీ అమూల్యమయిన అభిప్రాయాల్ని తెలియజేయమని కోరుతున్నాను!"

రాముడు చెప్పిందదంతా విని ఎవరికివారు మౌనంగా కూర్చున్నారు. ఎవ్వరూ ముందుకు రాలేపోవడం గమనించిన రాముడు హనుమంతుడ్ని చూసి అన్నాడు.

"హనుమా! నువ్వు చిరంజీవివి. త్రేతాయుగం తర్వాత వచ్చే ద్వాపరకలియుగాంతాలవరకూ ఉండవలసినవాడివి. బ్రహ్మజ్ఞానివి. రామాజ్ఞను జవదాటనివాడివి. ఊం లేచి ఆ మట్టిమీద నిలబడు అంజనీపుత్రా-"

"రామాజ్ఞ!" శిరసు వంచుకొని వినమ్రతతో రాముడికి నమస్కరించి మట్టిమీద నిలబడ్డాడు. సభాసదులు ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

హనుమంతుడి రోమాలు నిక్కబొడిచినై. తోక జయ్యిన లేచి దర్బారుహాలు కప్పుకు ఆనింది.

"ఓయీ రామచంద్రా విను. ఈ హనుమంతుడు లేకపోతే నీకు సీతజాడ తెలిసేదే కాదు. యీ అంజనీతనయుడు లేకపోతే నీ తమ్ముడు లక్ష్మణుడు బ్రతికేవాడు కాదు. అదంతా ఎందుకు? నా సహాయమే నీకు లేకపోతే నువ్వింకా అడవుల పట్టుకొని ఏడుస్తూ తిరుగుతూనే ఉండేవాడివి..."

సభ అంతా ఆహాకారాలతో నిండిపోయింది. ఏమిటీ ఘోరం హనుమంతుడేనా ఇలా మాట్లాడుతున్నది?

సుగ్రీవ అంగద జాంబవంతాదులు హనుమంతుడ్ని ఆ మట్టికుప్ప మీదనుంచి పక్కకు నెట్టారు. కొద్దిక్షణాల్లో రోమాలు కుంచించుకుపోయాయి. తోక ముడుచుకుపోయింది.

"రామచంద్రప్రభో మన్నించు! ఆ మట్టిమీద నిలబడి ఏదేదో మాట్లాడాను!" అంటూ హనుమంతుడు రాముడి కాళ్ళమీద పడిపోయాడు.

రాముడు చిరునవ్వు ప్రసరించుతూ సభను కలియ చూశాడు. ఎవరికివాళ్ళు గుండెలు బిక్కపట్టుకొని కూర్చున్నారు.

"గురువర్యా తమరు-" సగౌరంగా ఆహ్వానించాడు.

వశిష్ఠమహాఋషి గడ్డం సవరించుకొని తపోమహిమాన్యుతుడయిన తనను గుప్పెడు మట్టి ఏంచేయగలదు అన్న ధీమాతో వచ్చి నిలబడ్డాడు.

"ఓయీ రామా! నీ పుట్టుకకు కారణం నేను. నీ తండ్రి చేత పుత్రకామేష్టియాగం చేయించి పుత్రభిక్ష ప్రసాదించింది నేను. నీకూ, నీ తమ్ముళ్ళకు చదువుసంధ్యలు నేర్పింది నేను. నేనే లేకపోతే నువ్వింతటివాడివి..."

విశ్వామిత్ర మహాఋషి వచ్చి వశిష్టుడ్ని మట్టిమీదనుంచి పక్కకు లాగాడు.

"దశరథతనయా! అయోధ్యరామా పాహి మాం! పాహిమాం- సర్వాన్ని జయించాననుకొన్నాను. కాని నాలో అహంకారం యింకా నావలేదని యిప్పుడే తెలుసుకొన్నాను, ఈ గారెడు మట్టి నా కళ్ళు తెరిపించింది-"

"వశిష్టా ఏమిటీ దేబరతనము! ఈ గారెడు మట్టి నిష్ఠాగరిష్టులయిన మమ్మే ఏంచేయగలదో ఇప్పుడే చూసెదము గాక" అంటూ విశ్వామిత్రముని మట్టిమీద నిలబడ్డాడు.

మొదటి ఇద్దరికంటే మరొక్కక్షణం మౌనంగా నిలబడ్డాడు విశ్వామిత్రుడు. సభాసదులందరూ విశ్వామిత్రునికి అభినందనలు తెలియజేయడానికి నిలబడ్డారు.

"అర్భకుడా! ఇదియంతయూ నీ గొప్ప అనియే తలంచుచుంటివా? నీకు ధనుస్సుపట్టడం నేర్పినవాడిని నేను. తాటకిని కచాదుడ్ని నువ్వు చంపావని తలపోస్తున్నావేమో? నా తపోమహిమవల్లనే నువ్వు రాక్షససంహారం చేయగలిగావు. నేను రాజఋషినని మరిచిపోయావా? సృష్టికి ప్రతిసృష్టి చేయగలిగిన నేను నీకు మంత్రతంత్రాలు ఉపదేశించి ఇంతటివాడిని చేశాను. శివధనుస్సు విరచడం నీవల్ల అయ్యేపనేనా? అది నావల్ల గదూ జరిగింది. నా ప్రమేయం లేకుండా సీతను వివాహమాడగలిగేవాడివా......"

విశ్వామిత్రుడు శృతిమించి రాగాన పడుతున్నాడని గ్రహించిన సభాసదులంతా మూకుమ్మడిగా వచ్చి అతడ్ని పక్కకు లాగారు.

"ఏమిటీ విచిత్రం? యీ పిడికెడు మట్టి సృష్టికే ప్రతి సృష్టిచేయగల నాకే భంగపాటు కల్గిస్తుందా? తాటకసంహారా! జానకీరామా క్షమించు." విశ్వామిత్రుడు తలదించుకొన్నాడు.

"అందులో మీ తప్పు లేదు మహాత్మా, ఊరడిల్లండి!" విశ్వామిత్రుడిని ఓదార్చి మళ్ళీ సభాసదులను కలయజూశాడు శ్రీరామచంద్రమూర్తి.

తలెత్తి రాముడికేసి చూసే ధైర్యం ఎవరికీ లేక పోయింది. ఎవర్ని పిలిచి ఆ మట్టిమీద నిలబడమని ఆదే శిస్తాడోనని భయంతో వణికిపోతున్నారు. సర్వశక్తి సంపన్నులయిన వశిష్ఠ విశ్వామిత్ర హనుమదాదులకా శృంగ భంగమయింది. వారిముందు తామేపాటివాళ్ళు?

"మహాత్మా! ఆదికవీ! వాల్మీకి మునీంద్రా! తమరు ప్రయత్నిస్తే సఫలీకృతులు కాగలరనే మా విశ్వాసం!" రాముడు సింహాసనం మీదనుంచి లేచి నిలబడి వాల్మీకికి నమస్కరించాడు.

వయోవృద్ధుడయిన వాల్మీకి మందహాసంచేస్తూ అడుగులో అడుగు వేసుకుంటూ నడిచివచ్చి మట్టిమీద నిలబడ్డాడు. సభ యావత్తూ ఊపిరి బిగబట్టి ఉత్కంఠతో చూస్తున్న రాముడు చిరునవ్వుతో వాల్మీకి మహాఋషికేసి ఆశగా చూడసాగాడు.

"కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరం! అన్నది ఎవరు? ఈ వాల్మీకే! రాముడనేవాడు పుట్టకముందే వాల్మీకి రామాయణాన్ని రచించాడు. అసలు రాముడెవడు? నేను సృష్టించిన పాత్ర. నా కావ్యానికి రూపకల్పన మాత్రమే యీ రాముడు చేసిన ఘనకార్యాలన్నీను. నేనే రామాయణ కావ్యం వ్రాయకపోతే యీ రాముడు లేడు. భూమిపుత్రి సీతను ఎవరు సృష్టించారు? అసలు ఆవిడ రావణాసురుడికి ఏమౌతుంది? లంకలో అశోకవనంలో సీత ఏంచేసింది? నేనే గనక సీతను మండోదరికి సవితిగా చిత్రిస్తే యీ రాముడెక్కడ ఉండేవాడు? ఈ సీత మహాసాధ్వి ఎలా..."

'నెట్టండి-పక్కకు నెట్టండి! ముసలాడు మతిపోయి మాట్లాడుతున్నాడు.' సభలో పెద్దగా కేకలూ అరుపులూ వినిపించాయి. హనుమంతుడి తోకతో వాల్మీకిని చుట్టి దూరంగా విసిరేశాడు

"రామకథ రచించి తరించాననుకొన్నాను! కాని రామ దూషణచేసి ఘోర పాపం చేశాను. ఆశ్రిత రక్షకా! కోదండ రామా? నాకు యీ పాప విమోచనం కలిగించవా రామ చంద్రా?" వాల్మీకి వాపోయాడు.

"ఆదికవీ! వాల్మీకి మహాఋషీ! ఇందులో మీరుచేసిన పాపమేమీ లేదు. వశిష్ఠ, విశ్వామిత్ర హనుమదాదులు చేసినదే మీరు చేశారు. ఇందులో తమరి తప్పిదమేమీ లేదు?" అని, శ్రీరామచంద్రప్రభువు లేచి నిలబడి సభాసదుల నుద్దేశించి ఇలా అన్నాడు.

"ఆర్యులారా. పూజ్యులారా! వసిష్ఠ, విశ్వామిత్ర, వాల్మీకిహనుమదాదులు ఆ మట్టిమీద నిలబడి ఏమేమి మాట్లాడారో సభాసదులందరికీ విదితమే. ఇది వారి గుణదోష మెంతమాత్రము కాదు. ఇందరి నిష్కామ కర్ములను మహాత్ములను ఇలా అహంకారంతో స్వార్థ చింతనతో మాట్లాడించేట్లు చేసినది మీ అందరి సమక్షంలో ఉన్న వారడు మట్టే. ఇది ఆ మట్టి మహత్యం. ఆ మట్టిలో ఉన్న సారం మనుషుల్ని అలా తయారుచేస్తుంది. ఆ గడ్డమీద పుట్టిన పశుపక్షాదులే గాక మనుషులు కూడా ఏపుగా పెరుగుతారు. పుష్టిగా ఉంటారు. అహంకారంతోనూ. ఆత్మస్థయిర్యంతోనూ ఉంటారు. అది ఆ గడ్డ మహాత్యం. కలియుగంలో భారతఖండంలో ఇది కోనసీమగా ప్రసిద్ధి పొందుతుంది-"

అప్పుడే లేచి నిలబడిన సీతను గమనించి ఆగిపోయాడు రాముడు. వదిన సీతమ్మను తలెత్తిచూసి అంతలోనే అవనత వదనుడై ముఖం పక్కకు తిప్పుకొన్నాడు లక్ష్మణుడు. తమ్ముడి పెదవులపై ఛాయామాత్రంగా కదిలిన దరహాసం చూసి రాముడు కలవరపడ్డాడు.

కొంపతీసి సీత ఆ మట్టిమీద నిలబడతానంటుందా ఏం? తనను గురించి ఏమేమి మాట్లాడుతుందో. తనను గురించి అంతగా తెలియనివాళ్ళే ఇంత లేసి అన్నారు. ఇహ అర్ధాంగి అయిన సీత అయితే-సద్గుణాభిరాముడికి వణుకు పుట్టింది.

వళ్ళు చల్లబడింది. సూర్యవంశ చరిత్ర, రఘువంశ చరిత్ర ఆ చారెడు మట్టిలో—

"హనుమా!" రాముడు గంభీరంగా ముఖంపెట్టి అంజనేయుడ్ని చూశాడు.

"స్వామీ" రామభక్త హనుమాన్ మోకరిల్లాడు. "ఏమి ఆజ్ఞ!"

"ఆ మట్టి తీసుకెళ్ళి గౌతమీ వసిష్టా నదుల మధ్య కలిపేయ్!" ఆజ్ఞాపించాడు కోదండరాముడు.

"ప్రభువాజ్ఞ! కాని నాదొక చిన్న కోరిక అనుగ్రహించాలి."

"ఏమిటది?" పది తలల రావణబ్రహ్మను యుద్ధరంగంలో ఎదుర్కొన్నప్పుడు మా రాముడు స్థయిర్యాన్ని కోల్పోలేదు. కాని ఈ కోతివెధవ ఇప్పుడేమి కోరమన్నాడో గదా హతవిధీ.

"కలియుగంలో కోనసీమలో నేను స్థిరనివాసం ఏర్పరచుకోవాలని ఆశగా ఉంది. అందుకు ప్రభువులు అనుగ్రహించాలి!"

రాముడు అమ్మయ్య తిమ్మయ్య కోరిక ఇదేగదా అని కుదటపడ్డాడు.

"అలాగే. కాని ఒక్క షరతు!"

"శలవియ్యండి ప్రభూ!"

"నీ గుండెల్లో సీతారాములుండరు. భగవదంశ నీలో ఉండదు. వట్టి కోతిగానే ఉండిపోతావు."

"ప్రభూ. రామచంద్రా. కనికరించాలి! ఇన్నేళ్ళగా సీతారాముల సేవలకే జీవితాన్ని ధారపోసినవాడిని!" కిందఉన్న మట్టిని పోగుచేసి మూటకడ్తూ అన్నాడు హనుమంతుడు.

ఆ మట్టి స్పర్శ తగలగానే హనుమంతుడిలో వచ్చిన మార్పును పసిగట్టాడు రాముడు - మేడమ్-గట్టిగా పట్టుక్కూర్చోండి. ఇక్కడ రోడ్డు షార్ప్‌కర్వుంది" అని హెచ్చరించింది కల్పన.

"ఊం. ఓ.కే. కానియ్. ఆపేశావ్ మధ్య సస్పెన్స్ పెట్టేసి. అప్పుడు రాముడేమన్నాడూ?" ఉక్కిరిబిక్కిరయిపోతున్నాను.

"హి డజ్‌నాట్ వాంటూటేక్ ఎనిమోర్ చాన్స్!"

"ఏమిటేమిటి కల్పనా సడన్‌గా మార్చేశావ్?"

"అదే మేడమ్. రాముడు ఇహ చాన్స్ తీసుకోదలుచుకోలేదు. భారతఖండంలో హైందవులు గుడులు కట్టి నీ విగ్రహాన్ని ప్రతిష్టిస్తారు. పూజిస్తారు. కాని నువ్వు కనిపించితే కర్రుచ్చుకొస్తారు. గద్దలు విసురుతారు. నీ జాతివాళ్ళను బంధించి విదేశాలకు ఎగుమతి చేస్తారు. అందుకు సమ్మతమేనా అని రాముడు హనుమంతుడ్ని అడిగాడు మేడమ్!"

"అందుకు హనుమంతుడు ఒప్పుకొన్నాడా?" అని నేనడిగాను కల్పనను.

"ఒప్పుకొన్నాడు. మాడమ్. ఒప్పుకొన్నాడు మేడమ్." కల్పన నొక్కినొక్కి చెప్తుంటే నాకు నవ్వొచ్చింది. అక్కడ రాముడి దర్బారులో తను ఉండి చూసినట్టే చెప్తూంది కల్పన. కాల్పనిక కథే కావచ్చు. వాస్తవికత ఉట్టిపడేట్టు చెప్పుతున్నది కల్పన. గొప్ప రచయిత్రి ఆయే లక్షణాలున్నాయి కల్పనలో. పుక్కిటి పురాణగాథనుంచి అల్లిన ఓ కట్టుకథను ఎంతటి నైపుణ్యంగా చెప్పగలుగుతుంది. ఆశ్చర్యంగా ఉంది. కల్పన శిల్పం శైలి అద్భుతం.

"హనుమంతుడు అలా ఒప్పుకొన్నాడంటే ఎవరూ నమ్మరోయ్ కల్పనా!" అన్నాను.

"షూర్ మాడమ్-ఒప్పుకొన్నాడు." తల మరీ మరీ ఎగరేసి చెప్పుకుపోతున్నది కల్పన.

"హనుమంతుడు ఎందుకు ఒప్పుకొన్నాడో తెలుసా మేడమ్?" కళ్ళు గిరగిరా తిప్పుతూ నావంక చూసింది.

"ఎందుకట?" నాకు నవ్వాగడంలేదు.

"గుడిలో రాతిబొమ్మయి కూర్చునేకంటే కోనసీమలో కోతయి కొబ్బరిచెట్లమీద తిరగడం కోటి రెట్లు నయం! అన్నాడట హనుమంతుడు!"

"బ్యూటిఫుల్ - వండర్‌ఫుల్ ఎండింగ్—" గొప్ప ముగింపు. కొసమెరుపు" కల్పన వీపు మీద చరిచాను. బాస్ మెచ్చుకొంటున్నందుకు కల్పన ఉప్పొంగిపోయింది.

"చాలా గొప్పగా చెప్పావోయ్! కథ బరువంతా చివరి వాక్యంలో ఉంది. కథకు ప్రయోజనమూ ఆ ముగింపులోనే వచ్చింది. సెబాష్! కల్పనా!"

"ఏమిటి మేడమ్! మీముందా? హనుమంతుడి ముందు కుప్పిగంతులా, అన్నట్టుంది!" మూతి గుండ్రంగా తిప్పుకొంటూ సాగదీసి సాగదీసి అన్నది కల్పన.

దేరీజే స్ట్రీకాఫ్ జీనియస్ ఇన్ హర్. ఇంతకుముందు యీజీ గోయింగ్ టైప్ అనే అనుకొన్నాను.

"మేడమ్. వచ్చేశాం అమలాపురం. పుయ్ ఆర్ జస్ట్ ఇన్‌టైం!" కల్పన కోఆర్డినేటర్ కమలయిపోయింది. "నేరుగా గెస్టుహౌసుకు వెళ్తున్నాం మేడమ్ స్నానంచేసి టిఫిన్ తీసుకొని మీటింగ్ హాలుకు వెళ్దాం!"

"ఓ.కే. నీ ఇష్టం."

మరో ఐదునిమిషాల్లో జీప్ అమలాపురం అతిథి గృహాని కొచ్చింది. మహిళాసంఘం ఆర్గనైజర్లు ఇద్దరు ఎదురొచ్చి

ఆహ్వానించారు. జీప్ దిగి అతిథిగృహంలో కాలుపెట్టే ముందు పక్కన నడుస్తున్న కల్పనని చూసి-

"ఒక్క సందేహం కల్పనా!"

"ఏమిటి మేడమ్?" ఆశ్చర్యంగా అన్నది కల్పన. "కథను కంచికి పంపేశావా? సందేహాలుంటే అడగ మన్నావుగా!" అన్నాను.

"వాట్ మేడమ్? మీరింకా అదే ఆలోచిస్తున్నారా?"

"సీత లేచి నిలబడింది ఎందుకో చెప్పలేదు."

"రూం నంబరు 2సి మనది." అంటూ డోర్ తెరిచి గది చూపించింది. గది తలుపు వేసింది. కలయచూస్తున్న నన్ను చూసి

"మేడమ్ బాత్‌రూం ఇటు" అన్నది కల్పన.

"చెప్పలేదు. సీత ఎందుకు లేచి నిలబడింది రాముడి దర్బారులో?"

"అందుకే మేడమ్!" చిలిపిగా నవ్వింది కల్పన. బాత్ రూం డోర్ తెరుస్తున్న నాకు నవ్వాగింది కాదు.

3

మూడు రోజులు - ఊపిరిసలపకుండా గడిచిపోయింది. యూత్ క్లబ్స్ విజిట్సు, మహిళాసంఘాల సభలు సమావేశాలు, ముఖ్యమైన సెంటర్స్, గ్రామాల పర్యటనతో నేనొచ్చిన పని పూర్తయింది. కల్పన అన్నీ సమర్థవంతంగా నిర్వహించింది. ఆరోజు మూడు గంటలకు అతిథి గృహం చేరాము. రెండు గంటలు విశ్రాంతి తీసుకొని లేచేసరికి కల్పన ఫ్రెష్‌గా తయారయి వచ్చింది. ఆమె వెనకే అటెండరు కాఫీ టిఫిన్ పట్టుకొచ్చి నా ముందుంచాడు.

"త్వరగా కానీయండి మేడమ్. మనకు తిరిగొచ్చేసరికి లేటయిపోతుందేమో?"

కల్పన కేసి ఆశ్చర్యంగా చూశాను.

"మళ్ళీ ఎక్కడికి ప్రోగ్రాం పెట్టావ్?"

"అరగంట పోనూ అరగంట రానూ, ఏడింటికల్లా తిరిగివచ్చేద్దాం!"

"రాజమండ్రి వెళ్ళే సంగతేం చేశావ్. ఇప్పుడు బయలు దేరితే గోదావరి అందొచ్చు! బై ఛాన్స్ బర్త్ దొరికితే వెళ్తాను లేకపోతే కోణార్క్‌లో-"

"అదేమిటి మేడమ్. రేపు సాయంకాలం వరకూ మీరిక్కడే ఉంటున్నారు. మీకోసం కోనసీమ స్పెషల్ పూత రేకులు తయారుచేయిస్తున్నాను. రేపు రాత్రి గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు మీ టికట్ రిజర్వు చేయించాను. త్వరగా కాఫీ తాగి డ్రస్‌చేసుకోండి!"

కల్పనతో వాదించి లాభంలేదని తెలుసు. అంత ఆప్యాయత, అభిమానం అయినవాళ్ళు కూడా చూపించరు.

"ఓ.కే. డియర్. ఇంతకీ ఎక్కడకి తీసుకుపోతున్నావో చెప్పలేదు?"

"సస్పెన్స్ మేడమ్. సస్పెన్స్. ఈ మధ్య సస్పెన్స్ కథలుకూడా రాస్తున్నారుగా మీరు! జీవితంలో సస్పెన్స్ చూడొద్దా?"

"కథల్లో సస్పెన్స్ బాగానే ఉంటుంది. జీవితంలో సస్పెన్స్ భరించలేము కల్పనా."

"అది నిజమే మేడం." ఆమె కళ్ళలో ఏవో చీకటి నీడలు. కలవరపడ్డాను. ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ చెలాకీగా ఉండే కల్పనకు కూడా......

పది నిమిషాల్లో తయారయి కల్పన పక్కన జీప్‌లో కూర్చున్నాను. కొబ్బరితోటలు, జామ చెట్లు, అరటితోటలూ వాటి మధ్యగా కాలువ పక్కన రోడ్డుమీద జీప్ వెళ్తుంటే ఎంతో హాయిగా ఉంది. ప్రకృతి పంచి ఇచ్చే ఆనందం ముందు మానవుడు కల్పిందుకొన్న సుఖాలు ఏమాత్రం?

చిన్న వంతెన దగ్గర జీప్ ఆగింది.

"మేడం దిగండి. అదుగో ఆ కన్పించేది టెంకాయ పాలెం. ఈ కొబ్బరితోటలో నుండి నడిచి వెళ్ళాలి."

జీప్ దిగాను. కల్పన వెనక నడుస్తున్నాను రెండు అరటితోటలూ, ఓ పసుపుతోటా దాటి ఒత్తుగా, గుబురుగా పెరిగిఉన్న జామతోట ముందుకొచ్చి ఆగాము.

"మేడం తోట మధ్యలో ఉన్న గుడి కన్పిస్తుందా?" అడిగింది కల్పన.

"గుడా? అదెక్కడా. కన్పించడంలేదే?"

"అదేమిటి మేడం. అక్కడ జామచెట్టు నీడలో-"

"ఓ. అదా! అదేం గుడి. ఎదో గుడిసెలాగుంటేను!" గుడంటే గాలిగోపురాలు, ఆకాశాన్ని అంటుకునే పెద్దపెద్ద కట్టడాలను ఊహించిన నా కళ్ళకు అది గుడిగా కన్పించ లేదు. కల్పన వెనకే కాలిబాటన నడిచి గుడి ముందుకొచ్చి ఆగాను.

"ఇది ఆంజనేయస్వామి గుడి. మొదటిసారి వచ్చిన వాళ్ళకు ఒకే ఒక్క కోరిక నెరవేరుతుంది. అందుకే ఈ గుడికి భక్తులు ఒకేఒకసారి వస్తారు. కోనసీమలో పెళ్ళికాని ఆడపిల్లలంతా ఓసారి వచ్చి స్వామివారి దర్శనం చేసుకొంటారు."

"మంచి మొగుడు దొరికాలనా?"

"కరెక్ట్ మేడం. కోనసీమ కాపరానికి వచ్చిన కోడళ్ళంతా ఓసారొచ్చి దర్శనం చేసుకుంటారు."

"మంచి కొడుకు పుట్టాలనా?"

"అవును మేడం. స్త్రీ కోరుకునేదేమిటో మీకు బాగా తెలుసు. ఇప్పుడు మీరు మొదటిసారి వచ్చారు. ఏమి కోరుకుంటారో కోరుకోండి!" ఉషారుగా అన్నది కల్పన

"నువ్వు మొదటిసారి వచ్చినప్పుడేం కోరుకొన్నావో చెప్పు ముందు."

"మంచి ఉద్యోగం రావాలని."

కల్పన కళ్ళలోకి ప్రశ్నార్థకంగా చూశాను

"మంచి ఉద్యోగం వస్తే మంచి భర్తకూడా దొరుకుతాడు మేడం."

"బాగా వంటచేసిపెట్టేవాడా?"

కల్పన విరగబడి నవ్వింది. నాకూ నవ్వాగలేదు.

"నీ కోరిక నెరవేరిందా?"

"మొదటిది జరిగింది."

"ఏమ్. నిన్ను సెలక్ట్‌చేసి ఉద్యోగమిచ్చింది నేను. ఆంజనేయస్వామి ఏం చేశాడు?"

"హనుమంతుడొచ్చి ఇంటర్వ్యూ బోర్డులో కూర్చుంటాడా ఏమిటి? మీచేత చేయించాడు."

"ఓహో! అంటే నీది ఆంజనేయస్వామి రికమన్‌డేషన్ అన్నమాట. సరే, ఆ రెండోది ఏమైంది?"

"ఆ మధ్య ఒకడు పెళ్ళిచూపుల కొచ్చాడు. జీతమెంతని అడిగాడు ఆ తర్వాత పైసంపాదనెంతని అడిగాడు గాడ్దికొడుకు!"

"అమ్మోయ్ చంపలేసుకో. దేముడిముందు తిడ్తున్నావ్?" నవ్వాపుకుంటూ అన్నాను.

"గెటవుట్ రాస్కెల్. మళ్ళీ ఈ సీమలో కన్పించావో కాళ్ళు విరగొడ్తానన్నాను. వాడే చెంపలు వాయించుకొని అదేపోత పోయాడు."

"అవును అన్నట్టు మీ స్వామి తీర్చే కోరిక ఒక్కటే కదా! అందుకే అలా జరిగింది పో" అన్నాను

"అది పోనీయండీ మేడం. మీరు కోరుకున్నారా? గుళ్ళోకి వెళ్దామా?"

ఓ క్షణం ఆగి అన్నాను.

"నేను కోరుకునేదేమీలేదు పద!"

"నేను నమ్మను!" ఖచ్చితంగా అనేసింది.

దిమ్మెరపోయి చూశాను.

"నన్ను చెప్పమంటారా? మీరేమి కోరుకొన్నదీను!"

"ఊఁ. చెప్పు చూద్దాం!"

"ఓ మంచి కథకు ప్లాటివ్వమని?"

కల్పన వీపుమీద గట్టిగా చరినాను, ఆవులిస్తే పేగులు లెక్కపెడ్తారంటారు. కల్పన నోరు తెరవకపోయినా

The greatest cooling power by far.



* Designed to withstand 45°C
* Available on concessional excise duty for special applications
* Unique oscillating louvres
* Choice of finishes in grills

AMTREX

Air conditioners
0.5, 1, 1.5, and 2 tonnes

Marketed by.
SPECTRUM ELECTRONICS
Opp. Urdu Hall, Himayatnagar,
Hyderabad Ph . 226106

లెక్కపెట్టేట్టున్నది.

గుళ్ళో ప్రవేశించాము,

రెండు నిముషాలు ఆంజనేయుడి విగ్రహాన్ని తదేకం చూశాను.

"ఇదేమిటి కల్పనా? ఈ ఆంజనేయుడి చేతిలో?"

"కొబ్బరికాయ!"

"ఆ చేతిలో ఉండవలసింది సంజీవినిపర్వతం కాదా?"

"ఈయన పేరే టెంకాయ ఆంజనేయుడు. ఈ ఊరిపేరు టెంకాయపాలెం అని అందుకే వచ్చింది." యాంత్రపాలజీ ప్రొఫెసర్‌లా చెప్పుకుపోతున్నది కల్పన.

కొండంత కొబ్బరికాయ చేతులో సంజీవపర్వతంలా పెట్టుకొన్న ఆంజనేయుడి విగ్రహాన్ని చూడటం మాట రాముడెరగు వినకూడా వినలేదు.

"ఈ కోతేమిటి? కొబ్బరికాయేమిటి?" పెదవి విరిచావనుకొంటాను.

"భలే అన్నారు మేడం! కోతి కొబ్బరికాయా! దీని వెనక ఓ పెద్ద కథ ఉంది!" అన్నది" కల్పన.

"ఏమిటా కథ."

"గుడివెనక ఉంది రండి."

కల్పన గుడి వెనక్కు తీసుకెళ్ళింది . ఐదు-రాతిలో చెక్కబడిన బొమ్మలున్నాయి.

"మేడం ఈ బుర్రమీసాలవాడున్నాడు చూశారా. వాడి పేరు శివయ్య. అ పక్క విగ్రహం వాడిభార్య గంగమ్మది. ఆ చిన్నది కూతురు గౌరి. గౌరికి ఇరుపక్కల ఉన్నవాళ్ళు ఈశ్రాజు, సత్తిరాజులు!"

శ్రద్ధగా పరిశీలనగా చూస్తున్నాను.

"మేడం. ఇటు తలపైకెత్తి చూడండి!" కల్పన చెయ్యి ఎత్తి చూపుతూ అన్నది. చూశాను.

పెద్ద కొబ్బరికాయ. ఆ కొబ్బరికాయమీద కూర్చుని చిన్న కోతి. మళ్ళీ ఆ కోతిచేతిలో చిన్న కొబ్బరికాయ— మళ్ళీ అ కొబ్బరికాయమీద చిన్న కోతి - అలా మూడు కోతులూ- మూడు కొబ్బరికాయలు ఉన్నాయి.

చూస్తుంటే నాకంతా అయోమయంగా ఉంది. నా బుర్ర ఎండిన కొరిడీ కొబ్బరికాయలా అయిపోయినట్టు అనిపించింది.

"చూసారా? మీ కోరిక నెరవేరింది?"

"ఊఁ!" త్రుళ్ళిపడ్డాను.

"కథకు ఇతివృత్తం దొరికిందిగా!"

"ఈ కోతి-కొబ్బరికాయతో నాకుఉన్న మతికాస్తా పోగొట్టావ్? శివయ్య, గంగమ్మ, గౌరి ఈశ్రాజు, సత్తిరాజులకు యీ కొబ్బరికాయ కోతికీ ఉన్న సంబంధం ఏమిటో చెప్పు మరి."

"వెళ్దాం పదండి. చీకటిపడితే కాలవపక్క రోడ్డుమీద మన డ్రైవర్ సరిగా నడపలేడు. వాడికి రేచీకటి!" కల్పన దారితీసింది.

వంతెనదగ్గరకొచ్చి జీపు ఎక్కాము- జీప్ సాగింది.

"ఊఁ! ఇప్పుడు చెప్పు. ఆ కోతి కొబ్బరికాయ కథేమిటో?"

"రాత్రికి మేడం!"

"అంతవరకూ సస్పెన్సేనంటావా?"

"ఆహా! టెంకాయ ఆంజనేయుడి అనగా!" కల్పన నవ్వుల్తో తియ్యటి ప్రవాహాదులు వెదజల్లింది.

గెస్టుహౌసుకు వచ్చేదాకా కోతీ-కొబ్బరికాయను గురించే ఆలోచిస్తూ కూర్చున్నాను. అతిథిగృహం ఆవరణలోకి జీప్ తిరుగుతుండగా మెరుపులా గుర్తొచ్చింది,

"దశరథరాముని దర్బారులో హనుమంతుడు కలియుగంలో కోనసీమలో ఉండేందుకు పర్మిషన్ అడిగాడు కదూ?"

"ఆఁ! అడిగాడు. రాముడు పర్మిషన్ కూడా ఇచ్చాడుగా!" చాలా సీరియస్‌గా అన్నది కల్పన.

"అయితే ఆ హనుమంతుడేనా, యీ టెంకాయ ఆంజనేయుడు?"

"భలే! కరెక్ట్‌గా ఊహించారు మేడం."

"సో దేరీజె కంట్యిన్యుటీ టు యువర్ స్టోరీ." అన్నాను కల్పన భుజంమీద చెయ్యివేసి జీప్ దిగుతూ.

భోజనాలయాక, పక్కమీద కూర్చొని "ఊఁ. నీ కోతి కొబ్బ..." ఆవలింత ఆపుకుంటూ "చెప్పు" అన్నాను.

"మేడమ్. మీ కళ్ళు మూతలుపడిపోతున్నాయి. ఇహ పడుకోండి!" అంటూ లేచి నిలబడింది కల్పన.

"అయితే ఓ పని చెయ్యి. ఈ రాత్రి ఆ కథేదో రాసి రేపు ఉదయం పట్టుకురా" అన్నాను.

"నేనా? కథరాయడమా?" కల్పన కళ్ళు మెరిశాయి.

"హనుమంతుడి బలం జాంబవంతుడు చెప్పేదాకా తెలియలేదుట హనుమంతుడికి. అట్లా ఉంది నీ వరస!"

"సీతమ్మ ఆజ్ఞ ఆవశ్యం ఆచరణీయం!" తమాషాగా చేతులుకట్టుకొని తలవంచి అన్నది కల్పన.

ముంచుకొస్తున్న నిద్ర తేలిపోయింది.

"గుడ్ నైట్ మేడం."

"గుడ్ నైట్!"

"విష్ యూ మంకీ డ్రీమ్స్!" అనేసి కల్పన ఒక్క గంతులో గదిలోనుంచి బయిటికి దూకింది.

నాటీగరల్ - లేచి డోర్ లాక్ చేసివచ్చి పడుకొన్నాను. అపురూపమయిన ఆమె లావణ్యం, అమోఘమయిన తెలివి తేటలు, అనన్యసామాన్యమయిన ఆమె వాక్చాతుర్యం, అద్వితీయమైన ఆమె స్నేహార్ద్రిత - తలుచుకొంటూ ఎప్పుడు నిద్రపోయానో తెలియదు.

4

సాయంత్రం టీ తాగి బయలుదేరాం - ఉదయంనుంచి అప్పటిదాకా కల్పన నన్ను బిజీగానే పెట్టింది. తన స్నేహితులను తీసుకొచ్చి పరిచయం చేసింది. అమలాపురం అంతా తిప్పి చూపించింది. పెద్దరాజుగారింటికి భోజనానికి తీసుకెళ్ళింది. రాజుల మర్యాదలూ, ఆచార వ్యవహారాలు నేను స్వయంగా చూడాలని కల్పన ఉద్దేశ్యం అయిఉంటుంది.

జీప్ పళ్ళబుట్టలతోనూ పూతరేకుల డబ్బాలతోనూ నింపేసింది.

"మేడమ్. నేరుగా రాజమండ్రి వెళ్ళిపోతున్నాం!" అన్నది జీప్ ఎక్కి కూర్చుని.

"అంటే?" ఆమెపక్కన సర్దుక్కూర్చొని అన్నాను.

"మొన్న వచ్చేప్పుడు మీకు ముమ్మిడివరం బాలయోగి ఆశ్రమం చూపించాలని చుట్టూతిప్పి తీసుకెళ్ళాను. ఇప్పుడు నేరుగా వెళ్తున్నాం. అటు గౌతమీ-ఇటు వశిష్టానది. అంటే మీరు కోనసీమ అంతా చూసినట్టే!"

"గట్టిదానివే! థాంక్యూ."

"పోనియ్- జాగ్రత్తగా," డ్రైవర్‌కు ఆదేశాలిచ్చింది.

పచ్చటి చేలూ, పళ్ళతోటలూ, కాలువలూ జీప్‌వెంట పరుగులుతీస్తున్నాయి. కోనసీమ ప్రకృతి సౌందర్యాన్ని హృదయం విప్పి ముద్రించుకోవడానికి ప్రయత్నంచేస్తున్న నాకు హఠాత్తుగా ఓ కొబ్బరితోటలో కోతులు కన్పించాయి!

"కల్పనా! ఏదీ నీ కోతి కొబ్బరికాయ కథ!"

కల్పన పక్కకు తిరిగి నా కళ్ళల్లోకి చూసింది.

"మీరు అడుగుతారా లేదా అని ఉక్కిరిబిక్కిరయి చచ్చిపోతున్నాను మీరు అడక్కపోతే నేనెంత డిజపాయింటయేదాన్నో మేడం, రాత్రంతా కూచుని బుర్ర పగులకొట్టుకుని రాసేను. ఇది కల్పన కాదు మేడం ఎన్నో ఏళ్ళ క్రితం యీ కోనసీమలో జరిగినది. దృష్టాంతంగా వెంకాయ స్వామి గుడి ఇప్పుడికీ ఉంది. చూచారుగా. ఆ గుడివెనక చెక్కబడిన గౌరి కథే ఇది" హేండ్‌బ్యాగ్ తెరచి మడత చుట్టిపెట్టిన అరవై-డెభ్భై పేజీల వ్రాతప్రతి నా చేతికి అందించింది కల్పన.

"మేడం! ఒక్క షరతు!" కళ్ళజోడు తుడుచుకొని చదవడానికి ఉపక్రమిస్తుండగా అన్నది కల్పన.

"ఏమిటా షరతు?"

"ఒప్పులు నావి. తప్పులు మీవి!"

"ఎందుకో?" వచ్చే నవ్వుని ఆపుకుంటూ అడిగాను, కల్పన ముఖంలోకి చూస్తూ.

"నేను మీ ఏకలవ్య శిష్యురాల్ని, అందుకని!"

"మరి గురుదక్షిణ?"

"మీరు కోరింది!"

"నేను యీ కథ చదివేంతవరకూ నోరు మూసుకు కూర్చో."

"గురువాజ్ఞ. మహా ప్రసాదం."

కాగితాల పొత్తి విప్పి మొదటి పేజీ చూశాను. ఆశ్చర్య పోయాను. కథకు పెట్టిన పేరే బ్రహ్మాండంగా ఉంది. ఆమె చిలిపితనమూ, తెలివితేటలూ కథకు పేరు పెట్టడంలోనే వెల్లడవుతున్నాయి.

"కల్పనా! యీ కథకు పెట్టిన పేరు-" నామాట పూర్తి కాకముందే కల్పన నోటిమీద వేలుపెట్టి తను మాట్లాడ కూడదన్నట్లు సూచించి చెవులూ, కళ్ళూ, నోరూ మూసుకొని ఉండే బొమ్మల్లో ఆఖరి బొమ్మలా ఉందప్పుడు కల్పన.

చదవడం ప్రారంభించాను.

కోతి కొబ్బరికాయ!'
లేక
కొబ్బరి కోతి!
కాక
గౌరి ప్రేమ కథ!
అనే
కన్నవారి కన్నీళ్ళ గాథ'

అనగనగా—

గోదావరి అనుంగుపుత్రికలైన గౌతమీ, వశిష్ట వైనతేయానదుల పరివేష్టితమయిన భూభాగంలో ఓ చిన్న పల్లె ఉంది, ఆ పల్లెకు శివయ్య మకుటంలేని మహారాజు. శివయ్య భార్య గంగమ్మ ఊరంతటికి పెద్ద ముత్తైదువు.

ఆ పల్లెవాసులంతా చేపలుపట్టుకొని, రాదారి పడవల్లో సరుకులు రవాణాచేసి జీవిస్తూ ఉంటారు. వాళ్ళ అవసరాలు బహుకొద్ది. కోర్కెలు చిన్నవి. విసిరిన వలలో పక్కోజెల్లో పడితే చాలు. ఇంటిదాని కడుపున రెండు కాయలుకాస్తే చాలు. తగాదాలు లేవు. కార్పణ్యాలు లేవు. కావేషాలు లేవు. తగాదాలు ఎప్పుడేమన్నా వస్తే కులపెద్ద శివన్న తీర్పు శివుడాజ్ఞలాంటిది.

ఇదిట్లా ఉండగా—

శివయ్య గంగమ్మ దంపతులకు ఓ ఆడకూతురు పుట్టింది. ఊరంతా పండగ చేసుకొంది. అస్తారుబతంగా అల్లారు ముద్దుగా, బొంత అరటిలా చప్పుచప్పున ఎదిగొస్తూన్న ఆ పిల్లకు గౌరి అని నామకరణం చేశారు శివయ్యదంపతులు.

అరెరే! ఇహ ఆ గౌరి ఎలా పెరుగుతుందయ్యా అంటే–'గోదారి గట్టుంది గట్టుమీద చెట్టుంది. చెట్టుమీద పిట్టుంది. పిట్ట మనసులో ఏముందో' అన్నట్టే కాకుండా, గౌరమ్మ పాలపొంగు వయసులో, బిగువు బిగువు వంటితో, బెదురు బెదురు చూపుతో, తళుకు బెళుకు కళ్ళతో, వంపుసొంపుల హొయలతో సదీసదాలూ, చెట్టూపుట్టా, ఆకురెమ్మా, పువ్వూరేకూ వెతుకుతోంది. ఎందుకోసం? పదాహారేళ్ళ పల్లెపడుచు దేనికోసం వెతుకుతుంది? అందుకోసం!

అది అందరికి పండగరోజు. పండగలన్నింటిలోకి పెద్ద పండగ. శివన్న కొత్తబోటు జలప్రవేశం చేసేరోజు. పల్లీయులందరు పండగ చేసుకొన్నారు. శివన్న ఇంట్లో తిని తాగి తందనాలాడుతూ పడవలరేవుకాడి కొచ్చారు.

శివయ్య గంగమ్మలు, గంగమ్మ తల్లికి పూజలుచేశారు. కొత్త పడవకు పసుపు కుంకుమలు అద్దారు. అలనాటి దాసరాజు కుమార్తె మత్స్యగంధిలా అలంకరించుకొని పడవ మీదకొచ్చింది. కూతురు వెనకే శివయ్య గంగమ్మ పడవ మీద కొచ్చారు. చిన్నాపెద్దా పల్లీయులంతా పడవచుట్టూ మూగారు.

శివయ్య పీచుతియ్యని కొబ్బరికాయ సంచిలోనుంచి తీసి పడవ ముందుభాగాన పెట్టాడు. సాంబ్రాణికడ్డీలు వెలిగించి కొబ్బరికాయలో మార్చాడు. కుంకుమ బొట్టుపెట్టి సాష్టాంగ పడి కొబ్బరికాయకు మొక్కాడు. లేచి నిలబడి కొబ్బరికాయ రెండు చేతుల్తో పైకెత్తి పట్టుకొని జనాన్ని అందర్నీ కలియజూస్తూ అన్నాడు శివయ్య.

"గంగపుత్రులారా! పుత్రికల్లారా! మన కులాచారం ప్రకారం పడవ జలప్రవేశం చేసేప్పుడు పీచుతీసిన కొబ్బరికాయ కొట్టి శాత్తామని మీ అందరికి తెలుసు. మరి మా వంశాచారంగా పీసుతియ్యని కొబ్బరికాయ కొట్టాలన్నది కూడా మీ అందరికి తెలిసిందే. ఇది మా తాతలనాటినుంచి వత్తాన్న ఆశారమే అనికూడా మీలో పెద్దోలందరికి తెలుసు. మా తాతముత్తాతలు మన కులానికి పెద్దలు, పల్లెకు నాయకులు, అవటాన ఇట్టాంటి ఆశారం ఉంది మరి. కుటుంబంలో పెద్దకొడుకయినోడు కొట్టాలి యీ కొబ్బరికాయిని అని కూడా మీ అందరికీ తెలుసు. మరి నా క్కొడుకులు లేరని కూడా మీకు తెలుసు. ఉన్నదల్లా ఒక్కగాను ఒక్క బిడ్డ. లేకలేక కలిగిన సంతానం. మా గౌరమ్మతల్లిచేత కొబ్బరికాయ కొట్టించాలని నా అభిమతంగా ఉంది. మరి మీరే వంటారు!" శివయ్య చుట్టూఉన్నవాళ్ళను కలయజూశాడు.

అవునని అందరూ తలలూపి తమ ఆమోదాన్ని తెలియజేశారు. కాని వయోవృద్ధుడయిన పక్కయ్య "అపశారం అపశారం గంగమ్మతల్లికి!" అన్నాడు.

"ఏందిరా పక్కయ్యా నువ్వంటుంది!" శివయ్య పక్కయ్య ముందుకొచ్చి అన్నాడు.

"తొలంబరం మొగోడు కొట్టాల్సిన కొబ్బరికాయను ఆడకూతురుచేత కొట్టిత్తే గంగమ్మతల్లికి అపశారం చేసినట్టు కాదా?"

"కానేకాదు. ఆ మాటకొత్తే కొడుకైనా కూతురైనా గౌరమ్మే కద నాకుంది. అయినా, ఆడకూతురు కొబ్బరికాయ కొడితే అపశారం ఎట్టవుద్ది? గంగమ్మ తల్లికూడా ఆడ కూతురే గంద!" తర్కించాడు శివయ్య.

"బాబా శివన్న! నువ్వు సెప్పిందే సరయిమాట. గౌరమ్మ సేతనే కొట్టించు!" అన్నారు అందరూ.

భూమికీ, ఆకాశానికీ, గాలికీ, గంగకు దండంపెట్టి శివయ్య కూతురు గౌరికి కొబ్బరికాయ అందించాడు. గౌరి కొబ్బరికాయ ఒకచేత్తో, హారతి పళ్ళెం మరోచేత్తో పట్టుకొని బోటంతా కలయదిరిగి వాయుదేవుడికి, వరుణదేవుడికి మొక్కి నొగలి ముందు నిలబడింది. శివన్న గంగమ్మలకు మొక్కి కొబ్బరికాయ పైకెత్తింది.

"గౌరమ్మా! ఒక్క దెబ్బకు పగలాలి!" శివయ్య బుర్ర మీసాలు తిప్పుకొంటూ గౌరికి హెచ్చరిక చేశాడు.

గౌరి తన బలమంతా కుడిచేతిలోకి కూడదీసుకొన్నది. ఆకాశంకేసి లేచిన కొబ్బరికాయ పడవ నొగలిమీద కొచ్చిస్టే వచ్చి గౌరి చేతుల్లో న్నుంచి జారి గోదావరిలో పడింది.

ఈ హైద్రాబాదే ఓ ఆటంబాంబు
వేరే టపాకాయలెందుకు దీపావళికే!



తృళ్ళి తూలిన గౌరి కొబ్బరికాయతోపాటు నదిలో పడింది. అందరు ఆహాకారాలు చేశారు. పక్కోయ్య మాత్రం కుళ్ళు కుళ్ళుగా నవ్వుకొన్నాడు.

"మీరేం భయపడకండి. గంగమ్మతల్లి నా గౌరమ్మనేం చేయదు. గోదార్ని అటూ ఇటూ ఆరుసార్లు యీదగల సత్తా నా కూతురికుంది..." అని అందరికీ ధైర్యం చెప్తున్న శివయ్య ఒక్కసారిగా గావుకేక పెట్టాడు.

"మొసలి! మొసలి!! అమ్మా గౌరీ!"

కొర్రమీనులా తృళ్ళుతూ పొర్లుతూ పడవదగ్గరకు యీదుకొస్తున్న గౌరికి మొసలి ఎదురైంది. ఎండిన చెట్టు మొదల్లో నీళ్ళలో సగంపైనా సగంకిందా తేలుతూ తనవైపే నోరు తెరుచుకొని వస్తోన్న మొసలిని చూసింది. గిర్రున వెనక్కు తిరిగింది. నదిగోదావరిలోకి యీదుతోంది.

పడవమీద ఆహాకారాలు. ఒడ్డున ఉన్న పల్లెజనం కేకలు పెడబొబ్బలు పెడుతున్నారు.

శివయ్య చేతులెత్తి కులదేవతను పిలుస్తోన్నాడు.

గంగమ్మ గంగాభవానికి మొక్కుతూ సోకాలు తీస్తున్నది.

నదిలో మొసలి మునిగినప్పుడు గౌరి తేలుతూంది. గౌరి మునిగినప్పుడు మొసలి తేలుతున్నది. ఉరవళ్ళు పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్న గోదావరి నదిలో గౌరిని వెంటాడుతున్న మొసలి రానురాను దగ్గరౌతూంది.

గౌరిని రక్షించడానికి సిద్ధమయిన గజయీతగాళ్ళు 'హేమాహేమీ'ల కాళ్ళు చల్లబడి గుడ్లు మిటకరించి ఒడ్డున నిలబడి చూస్తున్నారు. మొసళ్ళంటే గంగపుత్రులకు వళ్ళు తెలియని భయం మరి!

శివయ్య నిర్వీర్యులయిపోయి నిలబడిన గంగపుత్రులను కలయజూశాడు.

"గంగమ్మ తల్లిమీన ఆన! ఓ గంగపుత్రులారా! చెప్పేది వినండి. నా గౌరమ్మను రక్షించినోడికి నా సర్వస్వం అయిన గౌరినిచ్చి కళ్యాణం చేస్తా. నా యావదాస్తి, యీ కొత్త బోటు ఆడికే యిస్తా. ఆ అదృష్టవంతుడెవరో, వీరాధి వీరుడెవడో, సూరాధిసూరుడెవరో ముందుకు రండి!" ఎలుగెత్తి చాటాడు.

అంతా మౌనంగా నిలబడ్డారు. గోదావరి గలగలలు మినహా అంతా నిశ్శబ్దం.

"ఇందరున్నారు మూతిమీద మీసం ఉన్నోళ్ళు! అన్నీ రొయ్యమీసాలేనా? నా కూతుర్ని రచ్చించేవాళ్ళే లేరా?" గంగమ్మ వాపోయింది.

"అయితే ఇనండిరా! ఇట్టాటి కులపోళ్ళకు పెద్దగా ఉండేకంటే మొసలినోట్లో పడి చావడం మేలు!" శివయ్య తలగుడ్డ నడుంకు బిగించాడు.

"ఆగు మామా! నేనున్నా!" సత్తిరాజు పంచె ఎగగట్టి చొక్కా విప్పి నదిలోకి దూకాడు. అదే సమయంలో పడవ అవతలవైపు నుంచి మరొకడు నదిలోకి దూకి ప్రవాహంలో సొరచేపలా యీదుకుపోతున్నాడు.

"ఆడెవడూ?" ఆశ్చర్యపోయాడు శివయ్య.

"ఆడు నా మేనల్లుడు ఈర్రాజు!" గర్వంగా అన్నది గంగమ్మ.

"బా! శివన్నా? నీ మేనల్లుడు సత్తిరాజు గెలుస్తాడో, గంగమ్మ మేనల్లుడు ఈర్రాజు గెలుస్తాడో చూడాలి. ఈ దెబ్బతో నీ అసలల్లుడెవడో తేలిపోవాలి!" పడవలో ఉన్న పెద్దల్లో ఒకడన్నాడు.

"బా మల్లన్నా! నా బిడ్డను కాపాడినోడే నా ఇంటి అల్లుడౌతాడు. ఇంతకీ-!" అంటూ శివయ్య అరిచెయ్యి ఆనించుకొని దూరంగా నదిమీదకు చూశాడు. ఒడ్డున ఉన్న వాళ్ళందరూ ఆదుర్దాగా చూశారు.

"మామా నేనున్నా!" అన్న సత్తిరాజుమాట ఎప్పుడయితే విన్నాడో, యీర్రాజు పంచ బిగించికట్టి, పట్టాకత్తి మొలలో దోపి, అల్లంత దూరాన్న ఉన్న సత్తిరాజుని చూసి, కోడె తాచు చందాన తలతిప్పి మీసం దువ్వి, గంగమ్మతల్లికి నమస్కరించి, నదిలోకి దూకాడు. సత్తిరాజూ ఈర్రాజూ పోటాపోటీగా గండుమీనుల్లా ఈదుతున్నారు. నిముషాలమీద నదిగోదార్లోకి వచ్చారు. ముందు గౌరి, గౌరిని వెన్నంటి మొసలి, మొసలి వెనక ఈరా, సత్తిరాజులు.

శివయ్య గంగమ్మలతోపాటు పడవమీద ఒడ్డున ఉన్న వాళ్ళ భయాందోళనలు, సంభ్రమాశ్చర్యాల్లోకి మారాయి.

ఈరా, సత్తిరాజులు చురకత్తుల్లా మెరిసి, రేచుక్కల్లా మొసలిని చుట్టుముట్టాడు.

కొద్దిక్షణాలు.

జనం ఊపిరి బిగబట్టారు.

గోదావరి కుంకమబొట్టు పెట్టుకుంది!

ఎర్రచీర కట్టుకొంది. ఎర్ర రవిక తొడుక్కుంది.

గోదారంతా రక్తం!

"అమ్మా గౌరీ!" శివయ్య దంపతులు పెనుకేక వేశారు.

"మూడు ప్రాణులు నడిగోదావరిలో- మొసలి నోట్లో" ముసలి పక్కేయ్య గొణుక్కుంటున్నాడు. ఒడ్డున పల్లె పడుచులు గోడుగోడున ఏడుస్తున్నారు. పల్లెకారులు చేతులెత్తి అరుస్తున్నారు.

క్షణాలు గడిచాయి.

నిముషాలు దొర్లాయి.

జనం చప్పట్లు కొడ్తున్నారు. ఈలలు వేస్తున్నారు.

ఈరా సత్తిరాజులు గౌరిని చెరోరెక్కా పట్టుకొని ఈదుకొస్తున్నారు. శివయ్య పడవమీద మోకరిల్లి గంగమ్మ తల్లిని ప్రార్థిస్తున్నాడు.

5

గూడెంలో కొబ్బరిచెట్టుకింద ఇంటిముందు నులకమంచంమీద శివయ్య కొలువుతీరి ఉన్నాడు. ఆడా, మగా, ఆబాలగోపాలం చుట్టూచేరి కూర్చొని ఉన్నారు. ఈర్రాజు, సత్తిరాజు కులపెద్దల వెనగ్గా, జనానికి కొంచెం ముందుగా నిలబడి ఉన్నారు. గౌరి తండ్రివెనగ్గా తల్లి పక్కన నిలబడి ఈరా, సత్తిరాజుల్ని దొంగచూపులు చూస్తూఉంది. కొలువు తీరిన శివన్నకు కొబ్బరాకులు వింజామరలై వీస్తున్నాయి. చల్లని నీటిగాలి. అయినా ఉక్కగానే ఉంది అందరికీ. ఉత్కంఠంతో శివయ్యను చూస్తూ ఉన్నారు.

శివయ్య లేచి నిలబడ్డాడు. అందరినీ కలయచూశాడు. గొంతు సవరించుకొని గంభీరంగా మొదలుపెట్టాడు.

"గంగమ్మ తల్లిగా ప్రమాణం చేశాను. నా ప్రమాణాన్ని చెల్లించుకోబోతున్నాను. పెద్దలు మీరంతా కూడబలుక్కొని చెప్పండి. గౌరిని కాపాడిందెవరు? నా చెల్లెలి కొడుకు సత్తిరాజా? నా పెళ్ళాం తమ్ముడు కొమార్డు ఈర్రాజా!"

"అందరికీ పెద్దవు నువ్వే! మా అందరి తగవులు తీర్చేటోడివి. మంచి సెడ్డ సెప్పేటి కులపెద్దవు గందా? నువ్వే సెప్పాలి మరి!" అన్నాడు ముసలి పక్కేయ్య.

"అరే పక్కేరీ! వయిసొచ్చిందిరా నీకు. కాని బుద్ది పెరగలేదు. ఇది నా సొంత ఇషయం. ఇది నాకు తేలకనే మీముందు పెట్టింది. ఒకడేమో నా సొంత సెల్లెలి కొడుకు, రెండోవాడేమో నా ఆడదానికి సొయానా తమ్ముడు కొడుకయిపాయా. ఇద్దరూ గౌరిని కాపాడినోళ్ళే గంద. మరెట్టా?

With best compliments from:

M/S. R. N. FILTERS (P) LTD.

Manufacturers of

CIGARETTE FILTERS

INDUSTRIAL DEVELOPMENT AREA, UPPAL, HYDERABAD.

అందుకే మిమ్మల్ని కోరుతున్నా. మీరే మంచీ సెబ్బరా అలోచించి న్యాయమేదో సెప్పండి" అని శివయ్య తిరిగి నులకమంచంమీద చక్రవర్తి సింహాసనంమీద కూర్చున్నట్టు కూర్చున్నాడు.

"బలే సిక్కు తెచ్చిపెట్టావుగదయ్యా శివయ్యా." నవ్వుకున్నాడు పక్కెయ్య. "మల్లన్నా! మనకు తప్పేట్టులేదురా సామి!" అంటూ పక్కెయ్య జామచెట్టుకిందకు దారి తీశాడు. మరో ఇద్దరు కులపెద్దలు అడవయ్య, జంగయ్య వాళ్ళతో చేరారు. కాలం గడిచిపోతూంది. పొద్దు నడినెత్తికొచ్చింది. ఇంకా వాళ్ళు చర్చించుకొంటూనే ఉన్నారు.

చిన్నా పెద్దా ఆడ మగా ఉక్కిరిబిక్కిరయిపోతూ అల్లంతదూరం జామచెట్టుకింద కూర్చున్నవాళ్ళకేసి కళ్ళు పత్తికాయలు చేసుకొని చూస్తున్నారు.

అటు ఈశ్వరరాజువైపువాళ్ళు, ఇటు సత్తిరాజువైపువాళ్ళు పెద్దల నిర్ణయం తమకే అనుకూలంగా వస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఇహ శివయ్య గంగమ్మల సంగతి సరేసరి!

ఒక్కగానొక్కబిడ్డ. బోలెడంత ఆస్తి. కొత్త ఇల్లు. ఉత్తరోత్తరా ఒక వూరికి పెద్దరికం, కులపెద్దరికం అన్నీ గౌరిని మనువాడబోయేవాడికే దక్కుతాయి. ఆ అదృష్టం ఎవడికి పడుతుందో? తన తమ్ముడి కొడుక్కా? తన చెల్లి కొడుక్కా. ఆ ఇద్దరికీ అదే ఆలోచన. ఒకటే ఆలోచన!

ఇక గౌరమ్మ ఎలా ఉందయ్యా అంటే? ఇద్దరూ తను కావాలనుకొనేవాళ్ళే. ఇద్దరికీ తనంటే పల్లమూరిన ఇష్టం. ఇద్దరూ తననే మనువాడ కోరుతున్నవాళ్ళే! మరి ఎవరికో? ఎవరంటే ఇష్టం-మధనపడిపోతూ జామచెట్టుకింద తలలు మోటించుకొని కూర్చున్న కులపెద్దలకేసి కన్నార్పకుండా చూస్తున్నది గౌరి.

పెద్దలు ఇంకా చర్చిస్తూనే ఉన్నారు. జనంలో అలజడి బయలుదేరింది. శివయ్య అసహనంగా ఉన్నాడు. అయినా అతడు దల్పించుకోకూడదు. పెద్దల నిర్ణయం శిరసావహించాలి! గంగమ్మతల్లి అనగా. జనం లేచి కూర్చుంటూ బట్టలకు అంటిన ఇసుకను దులుపుకొంటున్నారు. ఉండి ఉండి గాలి స్తంభించిపోయింది. కొబ్బరాకు లల్లల్లాడటం లేదు.

ధనామని ఓ కొబ్బరికాయ పైనుంచి పడింది! జనం మధ్యగా శివయ్య ముందు పడింది. అందరూ తలలు పైకెత్తి చూశారు. శివయ్య మంచంమీదనుంచి ఒక్క గంతేసి దూకాడు. తల పైకెత్తి చూశాడు.

రెండు చేతులు పైకెత్తి "స్వామీ దండాలు. దండాలు!" అంటూ బిగ్గరగా అరిచాడు.

కొమ్మ కొమ్మమీదనుంచి కొమ్మమీదకు దూకుతూ కిచకిచలాడింది ఓ కోతి.

"ఆంజనేయసామీ దండాలు. కరుణించు సామీ కరుణించు!" రెండుచేతులు పైకెత్తి కోతిని పిలిచాడు.

అది కిచకిచా అరిచి కొబ్బరి ఆకుల మీదుగా మరొక చెట్టుమీదకు. అక్కడ్నుంచి మరో చెట్టుమీదకు దూకుతూ వెళ్ళిపోయింది.

శివయ్య వంగి కోతి పడేసిన కొబ్బరికాయ తీసుకొని కళ్ళకద్దుకొన్నాడు.

"ఇది ఆంజనేయస్వామివారి ప్రసాదం. నా గౌరమ్మను మనువాడబోయే వాడికే ఇస్తాను!" అని ప్రకటించాడు. జనం తమ ఆమోదాన్ని తెలియజేశారు. శివయ్య అటూ ఇటూ తిప్పి చూసుకొంటూ 'ఇది ఈ కొబ్బరికాయ గోదావరి నదిలో పడిపోయినది కాదుగదా?' అనుకొన్నాడు.

"ఏంటి బావా? కోతిసిరిన కొబ్బరికాయకేసి అట్టా సూత్తుంటావ్?" అడిగాడు సత్తిరాజు తండ్రి.

"కళ్ళు పోతయిరా! నోరుమూసుకో. ఇదేం కొబ్బరికాయనుకొన్నావ్?" అంటూండగా జామచెట్టు నీడలోంచి కులపెద్దలు కదిలిరావటం కనిపించింది శివయ్యకు. చేతిలో ఉన్న కొబ్బరికాయ గంగమ్మకిచ్చి జనంముందుకొచ్చి నిలబడ్డాడు. నలుగురు పెద్దలూ వచ్చి శివయ్య ముందు నిలబడ్డారు.

గౌరి గుండెలు గుబగుబలాడాయి.

జనం ఒకళ్ళనొకళ్ళు తోసుకొని ముందుకు వస్తున్నారు. శివయ్య జనాన్ని సర్ది కూర్చోబెట్టాడు.

గంగమ్మ గౌరి తన మేనల్లుడికే దక్కుతుందని ఆశతో ఎదురుచూస్తూ ఉంది.

"అందరూ ఇంటుండగా మీ అభిప్రాయమేంటో

చెప్పండి. గౌరిని రచ్చించినోడు సత్తిరాజా, ఈశ్రాజా?" నలుగుర్నీ ఉద్దేశించి అన్నాడు శివయ్య.

"నేవొప్ప!"

"ఏందే మద్దెల నీ యవ్వ నీ గొడవ!" శివయ్య పెళ్ళాన్ని గదిమాడు.

"ముందు సత్తిరాజు ఈ సెందుకెత్తుతావ్? ఆళ్ళని చెప్ప నీయ్ మరి!" అన్నది గంగమ్మ.

"బాగుందే నీ యవ్వారం? ఎవుడో ఓడిపేరు ముందల చెప్పాలి గందా?"

"అట్టయితే ఈశ్రాజుగాడి పేరే ముందెట్టొచ్చుగా?" మంగలి పెద్ద లాజిక్కు. శివయ్య తల గోక్కుంటూ ఏదో అనబోయేసరికి గౌరి అడ్డంవచ్చింది.

"మీరేంటి కయ్యాలాడుకుంటారు? ఆ పెద్దోళ్ళను మాటాడనియ్యండి!"

ఈశ్రాజూ సత్తిరాజూ గౌరి ముఖంలోకి వొక్కసారిగా చూశారు. గౌరి తననే కోరుకుంటుందా?

"మల్లన్నా, అడవయ్యా మీరు కానీయండి!" ఆదేశించాడు శివయ్య.

మల్లన్న, అడవయ్య, జంగయ్య, పక్కయ్య ముఖ ముఖాలు చూసుకొన్నారు. సుప్రీంకోర్టు బెంచ్ జడ్జిమెంట్ ఒక జడ్జిద్వారా వెల్లడించినట్టు, ఆ నలుగురి ఉమ్మడితీర్పును ఎవరు తెలియచేయాలా అని మంతనాలాడుకొన్నారు. ఆ భారం అందరికంటే వయసులో పెద్ద అయిన పక్కయ్య మీద పడింది.

"ఊఁ; చెప్పు పక్కయ్యా. పచ్చపాతం ఒద్దు. భయం అసలే వద్దు, సంసయించొద్దు. కొబ్బరికాయ పగలేసినట్టు చెప్పు!" ప్రోత్సహించాడు శివయ్య.

ముసలాడు అందరికంటే ముందుకొచ్చి నిలబడ్డాడు. తలగుడ్డ విప్పతీసి ముఖం తుడుచుకొని మళ్ళీ కట్టుకున్నాడు. గొంతు సకిలించి, కళ్ళు చికిలించి ఇకిలించాడు. జనం ఉక్కిరిబిక్కిరయిపోతున్నారు సస్పెన్స్ భరించలేక. ముసలాడు జాగుచేస్తుంటే వాళ్ళకు పళ్ళు మండిపోతూంది. గౌరి ముఖం జేవురించి ఈశ్రాజూ సత్తిరాజు బిగిసిపోయి ఉన్నారు.

"పక్కయ్యా, సెప్పు. మీ తీర్పు!" శివయ్య హెచ్చరించాడు.

ఎట్టకేలకు పక్కయ్య గొంతు పలికింది.

"గంగమ్మ శివయ్యల కూతురైన గౌరమ్మను రచ్చించినోడు ఎవరయ్యా అంటే-" అని ఆగి ముసలాడు జనాన్ని ఓసారి కలయజూశాడు.

"చెప్పు. చెప్పళ." జనం అరిచారు.

"సత్తిరాజు" ఆగి గుటక మింగాడు. గుంపులో కలకలం, "ఈశ్రాజు" ఆగి దగ్గాడు పక్కయ్య. నోళ్ళు తెరచినవి తెరిచినట్టే ఉండిపోయాయి.

"ఒరే పక్కిరిగా సంపుతున్నావురా?" మందిలోనుంచి అరిచాడొకడు.

"ఇడి గీళ్ళిద్దరూ నదిలో దూకినారు. ఇద్దరూ మొసల్ని సంపినారు. ఇద్దరూ గౌరమ్మను రచ్చించినారు! ఇద్దరూ గౌరమ్మను ఒడ్డుకు చేర్చినారు. ఇందులో ఓరు తక్కువా ఓరు ఎక్కువా సెప్పడానికి ఈల్లేదని మా అందరి అభిప్రాయం. అందువల్ల మా నలుగురి తీర్పు ఏంటంటే ఈశ్రాజు సత్తిరాజు ఇద్దరూ శివయ్య కూతుర్ని రచ్చించినారు!" అక్కడ ఆగి శివయ్య ముఖంలోకి చూసి "ఇక నీ పెమాణం చెల్లించుకో శివయ్యా!" అన్నాడు పక్కయ్య. జనాన్ని మహా గొప్పగా చూసి చతికిలబడ్డాడు ఇసుక పర్ర మీద.

జనం బిగిసిపోయారు. అది తీర్పేదో ఎవడికీ అంతు చిక్కలేదు.

"ఒరే నీయవ్వ? ఏం తీర్పురా ఇది, పీకలమీద పీటముడి పెట్టారేందిరా? ఇసురోలలో ఇరుక్కుపోయినట్టు ఇదేం తీర్పురా?" పక్కయ్య ముఖంలో ముఖంపెట్టి చూస్తూ "ఇంతకీ గౌరిని ఎవుడికిచ్చి చేయమంటావురా?" బిగ్గరగా చిరాగ్గా అరిచాడు శివయ్య.

పక్కయ్య మిగతా ముగ్గురికేసి చూశాడు. మళ్ళీ తలలు కూడేసి గుసగుసలాడారు.

"శివన్నా! నీ కూతుర్ని గోదార్లో మొసలి నోట్లోంచి కాపాడినోడెవడో చెప్పమన్నావు. మేము చెప్పాము. ఇద్దరూ రచ్చించారని మా తీర్పు మరి! నీ పెమాణం నువ్వెట్టా సెల్లించుకుంటావో మాకేం ఎరిక? కూతుర్ని ఇద్దరికీ మనువాడిస్తావో వొదులుకుంటావో నీ ఇట్టం!" అని మళ్ళీ కూలబడ్డాడు పక్కయ్య.

"ఒరే ఇదేమన్నా సత్తెకాలమనుకొన్నారా? అర్జునుడు కుంతమ్మ దగ్గరకొచ్చి 'అమ్మా! అమ్మా ఓ పండు తెచ్చా' నంటే, మంచిది కొడకా అందరూ పంచుకొని తినమందట. ఆ మాటమీద నిలబడి ఐదుగురన్నదమ్ములు ద్రౌపదిని మనువాడారట. ఇదిగో అట్టుందిరా మీ తీర్పు." అన్నాడు శివయ్య,

అయితే నీ ఇట్టం. మా తీర్పిది. ఏం చేసుకుంటావో చేసుకో!" అని నలుగురు న్యాయమూర్తులు వెళ్ళడానికి సిద్దమయారు.

"ఒరే ఆగండిరా. నే చెప్పేదికూడా ఇనండి మరి!" అని బుర్రమీసాలు సద్దుకొన్నాడు శివయ్య.

"నా ఆస్తంతా ఒక వాటా. కొత్త పడవతో సహా. రెండో వాటా యీ గౌరి-"

"సాములోరి కొబ్బరికాయో?" జెల్లల పీతయ్య పళ్ళికిలించాడు.

అందరూ పక్కున నవ్వారు.

"అరే సీతామ్. దేవుడిచ్చిన కొబ్బరికాయ నా వాటా దిరా" అని సత్తిరాజును యీర్రాజుని దగ్గరిగా పిలిచాడు.

"ఒరే! ఇన్నారు గదరా. నా ఆస్తి కావాలో గౌరి కావాలో కోరుకోండి. నా మాటకు తిరుగులేదు. తెలిసిందా?" అన్నాడు శివయ్య.

ఇద్దరూ గౌరే కావాలన్నారు.

జనం చప్పట్లు కొట్టారు.

గౌరి సిగ్గుపడింది.

గంగమ్మ అయోమయంగా చూసింది.

శివయ్య వలలోపడ్డ బొచ్చె చేపలా గిలగిల్లాడు.

"ఇద్దర్నీ ఏట్టా మనువాడుద్దిరా గౌరి?" అందరిని కలయ జూచాడు.

"ఏందిరా దారి?"

"గోదారే?" చవలయ్య జనంలోనుంచి అరిచాడు. పకపకలు. వికవికలు!

"శివయ్య తాతా? నే చెప్పేదా?" అరిచాడు గుంపులో నుంచి ఒకడు. అందరూ పన్నెండేళ్ళ చిత్రాయిగాడికేసి చిత్రంగా చూశారు.

"చెప్పరా మనవడా?" మీ కిష్టమేనా అన్నట్టు ఈరాని సత్తిని చూశాడు శివయ్య.

"ఏ పుట్టలో ఏ పాముందో సెప్పనీయ్" అన్నాడు పక్కోయ్య; అందరూ తలలూపారు.

చిత్రాయిగాడు ఓ పుల్లను విరిచి తెచ్చి జనాన్ని తప్పుకోమని గుండ్రంగా ఓ పెద్ద గీత గీశాడు.

"ఇదిగో తాతా చూడు. ఇక్కడేమో సత్తిరాజు, అక్కడేమో ఈర్రాజు!" గీతమీద నిలబడి చిత్రాయిగాడు చెప్పుకుపోతున్నాడు.

"ఈళ్ళిద్దరూ యీ గిరి దాటకుండా యుద్దం చేయాలి! ఎవడు గెలిస్తే వాడిది గౌరి!" తేల్చి చెప్పేసి శివయ్య కళ్ళలోకి చూశాడు చిన్నోడు.

"ఓరి కుర్నాయాలా? బయస్కోపు బొమ్మలాట చూపిస్తావేటి?" జనంలోనుంచి అరిచాడొకడు.

"మీ ఇద్దరికీ ఇష్టమేరా?" ఈర్రాజును, సత్తిరాజును గుచ్చిగుచ్చి చూశాడు శివయ్య.

క్షణాలమీద రంగం సిద్ధమయిపోయింది. ఇద్దరూ బరిమీదకొచ్చారు. ఈరాపక్కన కొందరు సత్తిరాజు పక్షాన కొందరు చేరి గిరి బయట నిలబడ్డారు.

ఈరా, రాజూ బరిమీదకొచ్చి నిలబడ్డారు. బాణాకర్రలు, ఈటెలు, గొడ్డళ్ళు ఒకదాని తర్వాత ఒకటి తీసుకొని తలపడ్డారు. చివరకు గాలాలూ వలలూ తీసుకొని కలపడ్డారు. పోరు ఘోరంగా సాగిపోతోంది. ఎవడూ గిరి దాటలేదు. మల్లయుద్ధానికీ, ముష్టియుద్ధానికీ సిద్ధమయ్యారు. ఒకడి మెడ ఒకడు విరుస్తున్నాడు. ఒకడి చెయ్యి ఒకడు మెలిపెడుతున్నాడు. తలలు ఢీకొంటున్నాయి. కొబ్బరికాయలు పగిలిన మోతలు! అరుపులు. పెడబొబ్బలు-

ఇరుపక్షాలవాళ్ళు యీలలూ కేకలతో గంతులేస్తున్నారు.

"అది దొంగపట్టు! ఇదుప్?" ఈరాపక్షంవాడొకడు గిరిదాటి సత్తిరాజుమీద కొచ్చాడు.

"ఆడిదే దొంగదెబ్బ!" అంటూ సత్తిరాజు మనిషొకడు గిరిలోకి దూకాడు. ఇరుపక్షాలవాళ్ళు కేకలు వేసుకుంటూ తన్నులాటకు దిగారు.

గౌరి పరుగెత్తుకొచ్చి సత్తి ఈరాల మధ్యకొచ్చి నిలిచింది.

"ఆగండి!" శివయ్య రంకెవేశాడు. పెద్దలు ఇరుపక్షాల కుర్రాళ్ళని సర్ది దూరంగా నిలబెట్టారు.

"శివయ్యన్నా! ఇది పద్ధతి కాదు. పైగా అన్నిట్లోనూ సత్తి ఈర్రాజులు సమాన ఉజ్జీలనే రుజువయిపోయింది గదా!"

"ఇప్పుడేం చేయమంటావ్ చింతయ్యా?" ప్రాధేయపూర్వకంగా అడిగాడు శివయ్య.

"ఇక వదిలేయ్!"

"వా పెమాణమో?" దిగులుగా అన్నాడు శివయ్య.

"నీ పెమాణాన్ని వదులుకోమంటం లేదు. గంగమ్మ తల్లిమీద చేసిన పెమాణాన్ని వదులుకుంటే గంగపుత్రులకు పుట్టగతులుండవని నాకు తెలియనిదా శివయ్యన్నా!"

"బాగా చెప్పినావ్? ఇప్పుడా పెమాణాన్ని ఎట్టా నిలుపుకోను?"

"ఇను, మరి!"

"ఒరే. అందరూ ఇనండిరా. మన చింతయ్య సెప్పేది. మనందర్లో సదుకొన్నోడు ఆడేగందా!"

"ఔ.ఔ మరి! సదూకున్నోడు!" అందరూ చింతయ్యకేసి చూశారు మెప్పుకోలుగా.

"ఇంతవరకూ తేలిందేమిటంటే, ఈర్రాజూ, సత్తిరాజూ ధైర్యసాహసాల్లో సమానమయినోళ్ళు. అది గౌరిని రక్షించి

నప్పుడే తేలిపోయింది. భుజ బలపరాక్రమాల్లో ఇద్దరూ సమ ఉజ్జీలేనని ఇప్పుడే మీరందరూ కళ్ళారా చూశారు. ఇకపోతే మిగిలిపోయింది బుద్ధి పరీక్ష! వీళ్ళల్లో మగువ మనసెరిగి నోడెవడో తేల్చాలి?"

"అంటే?" ఐదారుగురు ఒక్కసారే అడిగారు.

"ఆడదాని మనసెరిగి మెప్పించే వాడెవడా అని!" ఆగాడు చింతయ్య.

"చెప్పు. చెప్పు. ఇవరంగా చెప్పు!" అన్నాడు శివయ్య.

"మనం యీళ్ళిద్దరి తెలివితేటల్ని పరీక్షించాలి. బుద్ధి కుశలతను పరీక్షించాలి. గౌరిని మెప్పించే మనసు, బుద్ధి ఎవరి కుందో పరీక్షించాలి!"

"భేష్! భేష్ చింతయ్యా! చదువుకొన్నోడి దారే వేరు. చెప్పుమరి. ఏం పరీక్ష పెడతావో పెట్టు చింతయ్యా!" అని శివయ్య రొప్పుతూ రోస్తూ నిలబడిఉన్న ఈశ్రాజుని సత్తిరాజుల్ని చూసి "మీ కిష్టమేనా?" అని అడిగాడు.

సై అంటే సై అన్నారిద్దరూ.

మంది తమ అమోదాన్ని తెలియచేసింది.

"అయితే మరి వినండి!" దగ్గర్లోఉన్న రాతి దిమ్మమీద నిలబడ్డాడు చింతయ్య.

"శివయన్న కొత్త పడవమీద ఒక నెలరోజులపాటు కలసి బ్రతకాలి. ఇద్దరూ కలసి పడవ నడపాలి. సంపాదించాలి. ఇది రాదారి పడవ కాబట్టి సరుకులు రవాణాచేసి సరిగ్గా ముప్పై రోజులకు ఐదువందల రూపాయలు సంపాదించాలి."

"ఐదువందలే?" నోరు తెరిచాడు శివయ్య. ఒక్కక్షణం బోటు కట్టేయకుండా నడిపినా అంత వస్తుందో లేదో చెప్పడం కష్టం!" ఆశ్చర్యపోయాడు శివయ్య.

"అదే మరి పరీక్ష! వీరి బుద్ధికుశలతకు శక్తికి పరీక్ష! అంత డబ్బు ఆర్జించితేనే వీళ్ళు పరీక్ష నెగ్గినట్టు! అదీ న్యాయంగా సంపాదించాలి. ఈ నెలరోజులు వాళ్ళ ఖర్చు అందులోనే. అది పోనే ఐదొందలు."

"ఉండుండు చింతన్నా?" ఒంగిడిబడ్డ గొడ్డులా అయిపోయాడు శివయ్య.

"అది సరే! ఇడిఇడిగా పోటీ పెడ్తేనే ఎటూ తేలక చస్తున్నాం గదా. ఇద్దరికీ కలిపి పరీక్షపెడుతున్నావ్. ఇద్దరూ కలిసే కదా సంపాయించేది. గెలుపైనా ఓటమయినా ఇద్దరిది కదా?"

"శివ్వయన్నా! ఆ సంగతి నాకు తెలియంది కాదు!" సాలోచనగా నవ్వి మళ్ళీ అన్నాడు.

"ఒరే పిల్లను ప్రేమించిన ఇద్దరు బద్ధశత్రువులు ఒకే పడవలో ముప్పైరోజులు కలిసి ఉండగలగడం, కలిసి శ్రమించడం, కలిసి సంపాదించడం నువ్వు అనుకొన్నంత తేలికకాదు. అందులోనూ నీతి న్యాయం తప్పకుండా ఉండాలి. ఇద్దరిదీ ఒకే కోరిక. ఆ కోర్కెను సాధించడానికి ఇద్దరూ భుజం భుజం కలిపి పనిచేయడం సామాన్యులకు సాధ్యపడేది కాదు. వాళ్ళకు తెలుసు ఇద్దరూ కలిసి శ్రమించి సాధించేదేమీ లేదని! అయితే ఈ పందెంలో నెగ్గాలంటే కలిసి శ్రమించక తప్పదు. ఇందులో ఒహడు పడవవొదిలి పారిపోక తప్పదు. కాకపోతే మనం పెట్టిన యీ షరతుల్ని ఉల్లంఘిస్తాడు—"

"సరే చింతయ్యా. చదువుకున్నోడివి నీకు ఎదురు చెప్ప లేను కాని—"

"ఆగు శివయన్నా! నీ సందేహమేమిటో నాకు తెలుసు—గౌరి ఈ ముప్పైరోజులూ పడవమీదే ఉంటుంది, వాళ్ళ ప్రవర్తన, నడవడిక గమనిస్తూ ఉంటుంది. ముప్పైఒకటో రోజున తన మనసు తెలుసుకొన్నవాడెవడో తను మెచ్చిన వాడెవడో మన అందరి సమక్షంలో తెలియజేస్తుంది!" అని చెప్పి చింతయ్య దిమ్మ దిగాడు.

"గౌరీ నీ కిది సమ్మతమేనా?" కూతురు తల నిమురుతూ అడిగాడు శివయ్య.

"స మ్మ త మే" అని చింతయ్యకేసి పక్కచూపులు చూసింది.

"సమ్మతంగాక ఏమవుతుంది. ఇది నీ పథకమే గదా పడతీ!" అనుకొన్నాడు చింతయ్య.

పొద్దువాలుతుంది. అందరూ ఇళ్ళకు బయలుదేరారు.

6

పున్నమిరోజున పూజచేసి గంగమ్మతల్లికి మొక్కి సత్తి, ఈశ్రాజు పడవెక్కారు, రేవుకాడ కొబ్బరికాయలు నింపుతున్నారు. శివయ్య, గంగమ్మ పాటెంజనం సాగనంపటానికొచ్చారు. నిండుగా సరుకుతో ఉన్న పడవను చూసి "ఏంద్రా ఇది? ఇంత బరువా? పడవ మునిగితే?" అడిగాడు శివయ్య.

"ఏందిమామా? నీ కూతురు పడవమీదుండగా పడవెట్టా మునుగుద్దీ?" తట్టనిండా కొబ్బరికాయలెత్తుకొని పడవమీద కాలుపెడుతూ అన్నాడు సత్తిరాజు.

"అదేంది మామా? ఇది వూరిపడవ? శివన్న పడవ మునగాలంటే శివుడాజ్ఞ కావాలి మరి!" మామను ఉబకేశాడు ఈశ్రాజు.

పోటాపోటీలుగా పడవకు సరుకెత్తుతూన్న అల్లుళ్ళను చూసి మురిసిపోయారు శివయ్య, గంగమ్మలు.



పొద్దువాలుతుందనగా పడవలు విడిచారు. అందరికంటే ముందుగా పోవాలని రాతిగుంజకు కట్టిన తాడును విడిచాడు ఈ(రాజు. చుక్కాని పట్టుకొని పడవను ప్రవాహంలోకి తిప్పుతూన్నాడు సత్తిరాజు. చెంగున పడవమీదకు దూకింది గౌరి- పరుగుపరుగున వచ్చి పడవమీదకు దూకేడు ఈ(రాజు. కాలవ మధ్య కొచ్చింది పడవ.

ఒడ్డునున్న శివయ్య, గంగమ్మలను చూసి చేతులూపారు ముగ్గురూ. గౌరి చుక్కాని పట్టగా సత్తి, ఈరాలు తెరచాప ఎత్తసాగారు.

దూరదూరంగా తెరచాప కనిపింపినంతవరకూ చూస్తూ నిలబడే ఉన్నారు శివయ్య. గంగమ్మలు.

"చూశావా గంగీ ఇద్దరు సమఉజ్జీలేనే?" ఏదో ఆలోచిస్తూ దూరతీరాలకేసి చూస్తూ అన్నాడు శివయ్య

"అట్టయితే నీ కూతురుకి పెళ్ళయినట్టే?" మూతి విరిసింది గంగమ్మ.

"ఏమిటోనే గంగీ మనసు బెంగగా ఉందే! ఎవరికి అన్నాయం జరిగిపోద్దోనని బయంబయంగా ఉందే?" దిగులుగా అన్నాడు శివయ్య!

తెరచాప కొస కూడా కనిపించేంతవరకు చూసి, అదీ కనుమరుగయేసరికి దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు శివయ్య. గంగమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకొంది.

"ఇదంతా నీవల్లే!" అంది.

"ఏందే నువ్వనేది. గంగమ్మ తల్లిమీద చేసిన పెమాణాన్ని పనులు కోమంటావా :"

"నేనెందుకంటానయ్యా! అల్లుళ్ళిద్దరూ నాబంగా తిరిగొచ్చి నా బిడ్డకు చేమంగా పెళ్ళిఅవాలని గంగమ్మతల్లిని కోరుకుంటున్నా. నూరు కొబ్బరికాయలు ఆంజనేయసామికి కొట్టానని మొక్కుకుంటున్నా, ఇన్నావుగా మరి!" మొగుడి డొక్కలో మోచేత్తో పొడిచింది గంగమ్మ.

"నీయవ్వ! మళ్ళా అదేం కోరికే? ఇప్పటికే పీక్కు సత్తుంటేను! ఇద్దరూ నాబంగా చేమంగా వత్తే ఓడికని ఇత్తావే నీ కూతుర్ని?"

"నువ్వూరుకో! అదంతా ఆ ఆంజనేయసామే చూసుకొంటాడ్లే!" భర్తను గదిమింది.

"మళ్ళీ ఆయన కెందుకు యీ తగూలాట? ఆయన అసలే బెమ్మచారి!"

"సరిసరి బేగి నడు. ఇంట్లో చాందుంపల కూరుంది!" కాలవకట్టమీద గబగబా నడవసాగింది.

చాందుంపల కూర తలుచుకున్న శివయ్యకు నోట్లో నీళ్ళు ఊరాయి. భార్యకంటే ముందే అంగలు పంగలేసుకుంటూ నడిచి ఇంటికి చేరాడు.

నిండుగా ఒడ్డుఒరుచుకొని ప్రవహిస్తున్న కాలవలో పడవ హంసలా వయ్యారంగా సాగిపోతోంది. తెరచాప తాళ్ళుపట్టుకొని గౌరినే చూస్తూ కూర్చున్నాడు సత్తిరాజు. చుక్కాని కొయ్య చక్కలో ఇరికించి అటుఇటూ తిప్పుతూ గౌరినే చూస్తున్నాడు ఈ(రాజు. వాళ్ళిద్దరిమధ్యగా పడవమీద నిలబడి అటు అస్తమిస్తోన్న సూర్యుడ్ని. ఇటు గాలికి రెపరెపలాడే తెరచాపనూ చూస్తూ ఉంది గౌరి.

తనకిదంతా కాశీమజిలీ కథలా ఉంది! సంతోషంగా ఉంది. ఆదుర్దాగా ఉంది. హాయిగా ఉంది, అలజడిగా ఉంది. ఆనందంగా ఉంది. బాధగానూ ఉంది. ఈరా-సత్తీ ఎవరు? ఎవరు? ఇద్దరూనా? యీ ఇద్దరితో కాపరం ఎట్లా! మెచ్చి మనసిచ్చినోడు ఒక్కడే. ఆ ఒక్కడే ఎవరు?

తూర్పుగాలి రయ్యిన వీస్తోంది. తెరచాప నిండుగా గాలి నింపుకొని పొట్టపగిలేట్టుగా ఉబ్బిఉన్నది. పడవ వేగం హెచ్చింది. నీటిని కోస్తూ సర్రున సాగిపోతోంది.

నిండు చంద్రుడు నిదురలేచి వస్తోన్నాడు—

గౌరి మేను పులకరించింది.

ఆకాశంలో చంద్రుడు. నీళ్ళల్లో చంద్రుడు. పైన చంద్రుడు. క్రింద చంద్రుడు. చుక్కాని దగ్గర చంద్రుడు. తెరచాపదగ్గర చంద్రుడు.

గౌరి మనసంతా వెన్నెల. నలుగురు చంద్రుళ్ళు కలిసి తుప్పలు తెప్పలుగా కురిపిస్తోన్న వెన్నెల! నీటి అలలమీద వెన్నెలాడుతూన్న సయ్యాటలకు మురిసి తుళ్ళితుళ్ళి పడుతోన్న చిరుచిరు మీనాల సోయగాలు చూసి గౌరి మధుర స్వప్నాలలో తేలిపోతూ ఉంది.

తెల్లటి మబ్బులను దాటుకొని పరుగులు తీస్తున్న చంద్రుడ్ని చూస్తూ తెరచాప కొయ్యకానుకొని వెన్నెల్లో

నిలబడింది. ఎంత సేపు నిలబడిందో ఏమో? ఈరీ, సత్తి రాజులు గౌరిని చూస్తూ ఆకలి మరిచిపోయారు.

కూనిరాగాలు తీస్తూ పడవంతా కలయతిరుగుతూన్న గౌరికి గుర్తొచ్చింది, అయ్యో పాపం వీళ్ళు కూడు తినలేదే అని.

"ఏమ్రా మీకు ఆకలవడంలేదా?" ఇద్దరి మధ్యా నిలబడి అడిగింది.

నిన్ను చూస్తుంటే ఆకలే అవడంలేదన్నాడు ఈరా.

నువ్వుంటే చాలు నీళ్ళు నిప్పులూ ఒద్దన్నాడు సత్తి.

నవ్వుకొన్నది గౌరి.

తనలో తనకే ఏదో ఇదిగా అదిగా అయిపోతూన్నది.

ఏమిటి వీళ్ళిద్దరూను? ఒకరిని మించి ఒకరు? గిన్నెలు తెచ్చి ముందుపెట్టింది.

అన్నం మూటవిప్పి అటూ ఇటూ పరుగులుతీస్తూ అన్నం చాందుంపల కూరా పెట్టింది.

వెన్నల్లో కూర్చుని ఆవురావురని తింటున్న వాళ్ళిద్దర్ని ఆప్యాయంగా చూసింది.

గిన్నెలు కాలవ నీళ్ళల్లో కడిగి ఓ మూల బోర్లించింది. చుక్కానికి తెరచాప కొయ్యకు మధ్యగా పడవమీద పక్క పరచుకొని పడుకొన్నది. చంద్రుడి ముఖంలో ముఖంపెట్టి 'హైలసా. హైలసా'. పాట అందుకొంది. ప్రేమికులిద్దరూ వంతపాడారు.

తెలతెలవారుతోంది. వెన్నెల వెలవెల బోతూన్నది. పడవ లాకు దగ్గరకొచ్చి ఆగింది!

పడవను పక్కకులాగి కట్టేశారు. ముగ్గురూ పడవని కాలవకట్టన దుబ్బల్లోకి వెళ్ళారు. ముఖాలు కడుక్కొని కాలవలో జలకాలాడారు.

పొద్దు కరకరా ఎక్కివస్తోంది.

ఇంకా లాకు లెత్తలేదు.

ఈరా ఆదుర్దాగా లాకులెత్తే కళాసికోసం వెతికాడు. సత్తి రాజు ముడిచిన తెరచాపను ఎత్తడానికి సిద్ధమౌతున్నాడు. ముందువచ్చిన పడవలూ, వెనకవచ్చిన పడవలూ అక్కడే ఆగి ఉన్నై. సాయంత్రానికి అడంగుకు చేరితే సరుకు దించి తిరిగి ప్రయాణం కట్టొచ్చు. కాని ఇప్పుడు బయలుదేరక పోతే అడంగుకు చేరేసరికి చీకటిబడుతుంది. చీకటిపడితే సరుకు దించుకోరు. రాత్రంతా అక్కడే పడి ఉండాలి. ఆరోజు వృధా అయిపోతుంది. ఇట్టా అయితే ముప్పై రోజుల్లో ఐదువందలు ఎలా సంపాదించాలి? ఈరా ఆదుర్దా పడిపోతున్నాడు. కాలుగాలిన పిల్లిలా లాక్‌దగ్గర కట్టమీద తిరుగుతున్నాడు.

"ఏంది య్యారాజు ఈడ సూత్తావుండావ్?

"ఇయ్యాల లాకులెత్తరంట!" వెనకవచ్చిన పడవ సరంగు చెప్పాడు.

"ఎందుకో?"

"ఈడ కామవదూరంలో తిరునాళ జరుగుతోందింట. కళాసీ ఓర్సీలు అడకె పోయారంట! ఇయ్యాల లాకులెత్తే పనే లేదంట."

"ఏందేంది? ఏం తిరునాళ? ఎక్కడా?" అప్పుడే సత్తి రాజుతో కలిసి లాకుదగ్గరకొచ్చిన గౌరి అడిగింది. ఈరా చెప్పాడు. వింటూ రాజు దిగులుపడిపోయాడు.

"ఏంద్రో? మొఖాలట్టపెట్టారూ? మనం కూడా తిరునాళ కెళ్లాం పదండి" అన్నది గౌరి ఉషారుగా.

"తిరునాళకా?" ఇద్దరూ వెర్రిమొఖాలేశారు.

"అవున్రా! తిరునాళకే? మీరు రాకపోతే పోండి. నె వెళ్తాను!" అంటూ బయలుదేరింది గౌరి.

"మరి పడవో?" అన్నాడు ఈరా!

"ఇక్కడే ఉంటది? పడవెక్కడన్నా తిరనాళ కొస్తాదా ఏంటి బావా?" ఎగతాళిచేసింది. ఈరా ముఖం ముడుచు కొన్నాడు.

"పడవలో సరుకో?" సత్తిరాజు సందేహాన్ని వెళ్ళ గక్కాడు.

"అయితే నువ్వుండు మావా! నేనూ ఈరా తిరనాళ కెళ్ళొస్తాం!" అన్నది గౌరి.

సత్తిరాజు చిత్తయిపోయాడు.

"అట్టా కుదరదు. నేనుకూడా వొస్తా!"

"సరుకో?" అన్నది గౌరి.

"నువ్వుండు కాపలా. మేమిద్దరం తిరనాళకెళ్ళొస్తాం!" అని నాలిక్కొరుక్కున్నాడు సత్తిరాజు.

గౌరి నవ్వుకొన్నది.

"ఓ పని చేద్దాం. ముందు ఈరా నేనూ వెళ్తాం. తిరిగొచ్చాక నువ్వెళ్ళు!"

"తాట్! అట్టా కుదర్దు. నేనొస్తాను ఆడ్నే ఉండమను!" మొండికెత్తాడు సత్తిరాజు.

"తమాషాకు అన్నాగాని ఏడవమాక! ఈరా నేను తిరనాళచూసి అన్నపేళకు తిరిగొస్తాం. అన్నం తిన్నాక మధ్యాన్నం మనిద్దరం పెళ్దాం. సరేనా?" ఈరా సత్తి ఇద్దరూ ఒప్పుకొన్నారు.

ఈరా గౌరీ బయలుదేరారు.

సగం దూరంలో ఉండగా సత్తిరాజు పరుగులు తీస్తూ వచ్చి వాళ్ళను కలుసుకొన్నాడు.

"ఏంటిటొచ్చావ్? పడవలో సరుకో?" గౌరి మంద లింపుగా అన్నది.

"పక్కెయ్య కొడుకు గండెయ్య పడవ మన పడవెనకే కట్టేశాడు. వాడు మన పడవ, సరకుకూడా కాపలా కాస్తా నన్నాడు!" రొప్పుకుంటూ చెప్పాడు.

ముగ్గురం చకచక నడిచి తిరునాళ జరిగే ఊరు చేరు కొన్నారు.

ఈరా, రాజూ మధ్యలో గౌరీ, తిరునాళ్ళల్లో తిరుగుతూ, వింతలు విశేషాలు చూసి తన్మయత్వం చెందుతున్నారు గౌరి కోరిందల్లా ఈరా, రాజు పోటీపడి కొని ఇచ్చారు. ఈరరాజు రిబ్బన్లు కొన్నాడు. సత్తిరాజు పిన్నీసులుకొన్నాడు. గోదారి పడవకు దారిబత్యం కింద ఇచ్చిన బయాణా ఖర్చుపెట్టున్నారు. సత్తిరాజు రంగులరాట్నం ఎక్కించాడు. ఈరరాజు ఉయ్యాల ఎక్కించాడు గౌరిని. పురి విప్పిన నెమలిలా ఆనందిస్తోంది.

జనాన్ని రాచుకొంటూ తోసుకొంటూ తిరుగుతోన్న వాళ్ళకు ఓ సన్యాసి ఎదురైనాడు. కాషాయి బట్టల సన్యాసి దాటిపోయాక ఉక్కులాంటి పళ్ళుగల భీకరాకారుదొకడూ వాడిపక్కనే సన్న గాలిపటంలా ఉన్నవాడొకడూ ఎదురైయ్యారు. వీళ్ళను దాదాపు కిందపడేట్టు తోసుకుంటూ పోయారు. ముగ్గురు తిరిగి వెనక్కి చూశారు. ముందు దాటి పోయిన కాషాయి బట్టల సన్యాసిని వెంబడిస్తోన్నట్టుగా తోచింది.

సత్తి, ఈరా, గౌరి గుడిదగ్గర కొచ్చారు. ప్రదక్షిణంచేసి గుడిలోకి వెళ్ళారు. గౌరి కొబ్బరికాయ కొట్టి చేతులు జోడించింది. ఏం కోరుకుంటుంది? ఈరానా? సత్తిరాజునా? ఇద్దరినా? గుడిలో అమ్మవారికి దణ్ణంపెట్టేసి బయటికొచ్చింది. గౌరితోపాటు ఈరా, సత్తిరాజు వచ్చి గుడిమెట్లమీద కూర్చున్నారు. వాళ్ళిద్దరిమధ్య కూర్చొని బడలిక తీర్చు కొంటూ ఉన్న గౌరికి గుడిలోనుంచి బయటికొస్తూన్న సన్యాసి కన్పించాడు.

"ఈరా చూడు చూడు. ఆ సన్యాసే!" అన్నది.

ఆ సన్యాసి చేతిలో ఓ సంచి. ఆ సంచిలో ఓ కొబ్బరి కాయ. అందులోనూ పీచు తీయనిది.

"చూసావా సత్తీ ఆ సన్యాసి సంచీలో కొబ్బరికాయ! గుళ్ళొకి వెళ్ళి కొబ్బరికాయ కొట్టకుండా తిరిగి వెళ్తున్నాడు. అయినా పీచు తీయకుండా కొబ్బరికాయ గుళ్ళోకెందుకు తీసుకెళ్ళినట్టూ?" బుగ్గమీద వేలేసుకొన్నది గౌరి.

"అదే గదా?" ఇద్దరూ వంత పలికారు.

"అదుగో వాళ్ళే!" హడావుడిగా లేచి నిలబడింది గౌరి. ఈరా సత్తి మెట్లమీదనుంచి గౌరితోపాటే ఒక్కసారి లేచి నిలబడ్డారు.

అంతకుముందు వీళ్ళను తోసుకుంటూ సన్యాసిని వెంబడిస్తూ పరుగెత్తిన ఉక్కుగాడూ చెక్కగాడూ గుడి వెనక నుంచి రావడం కన్పించింది.

"చూశారా! ఆ సన్యాసిని వీళ్ళిద్దరూ పట్టుకోవాలని పరుగులు తీస్తున్నారు. చూశారా!"

"ఆఁ చూశాం! చూశాం!" అన్నారిద్దరూ జంటకవుల్లా.

"ఎందుకంటా?"

"ఏమో మరి?" ఇద్దరూ కళ్ళు తేలేశారు.

"సన్నోసిగాడి దగ్గరేముంది?" పెదవి విరిచింది గౌరి.

"కొబ్బరికాయ ఉందిగా?" అన్నాడు ఈరా తెలివిగా.

"నీ బుర్ర ఒట్టి మట్టిబుర్రనే!" అంది గౌరి.

ఈరరాజు చిన్నబుచ్చుకొన్నాడు.

"నువ్వు చెప్పు సత్తీ!" అడిగింది

"కాషాయబట్టల కోసమా?" తడుముకుంటూ చెప్పాడు.

"నీ తల్లో ఇసుకుంది!"

సత్తిరాజు తల దించుకొన్నాడు.

"అయితే నువ్వు చెప్పు?" ఇద్దరూ ఒక్కసారే అడిగారు.

"బూడిద!" అన్నది గౌరి.

ఇద్దరూ ముఖాలు చూసుకొన్నారు.

"పదండి పోదాం!" గౌరి బయలుదేరింది. ఇద్దరూ ఆ సన్నాసోడి దగ్గరేముందా అని ఆలోచిస్తూ గౌరి వెనకే నడిచారు.

లాకుల దగ్గర కొచ్చేసరికి పొద్దువాటాలి పోయింది. అక్కడ ఒక్క పడవా లేదు. లాకులెత్తేశారులా ఉంది. పడవలన్నీ లాకులుదాటి వెళ్ళిపోయినై.

"మీ కోసమే ఆగా. నే పోతున్నా" అంటూ పక్కెయ్య కొడుకు తెరచాప ఎత్తాడు.

"తిరునాళ తిరునాళ అని లాక్కుపోయావు! చూశావా పడవలన్నీ ఎళ్ళిపోయినై!" సత్తిరాజు సణిగాడు.

"ఇప్పుడేమయిందరా?" గౌరి కసురుకొన్నది.

"ఐదొందలు. ఐదొందలు, నీ అబ్బ కావాలంటాడు. నువ్వేమో ఇట్టా చేత్తన్నావ్? ఎట్టా వత్తయ్యే?" ఈరరాజు గుర్రుగా అన్నాడు.

"ఓరే మీరట్టా మాట్టాడుతుంటే మీతో నేనసలు రానే రాను!" కాలవకట్టమీద చతికిలపడింది గౌరి.

"అమ్మమ్మ! ఊరికే అన్నామే! కోప్పడకే గౌరి!" అన్నాడు లబలబలాడుతూ సత్తిరాజు.



"తప్పు ఒప్పేసుకుంటున్నాంగా! లేమరి! పొద్దు కూకుతోంది!" ప్రాధేయపడ్డాడు ఈరాజు. చెరొకపక్కా చేరి గౌరిని ప్రాధేయపడుతున్నారు.

సంచి చేత్తోపట్టుకొని సన్యాసి కాలవకట్టమీద పరుగులు తీస్తున్నాడు. ఉక్కుమనిషి పటాకుల రత్తయ్యా, చెక్కగాడూ తేళ్ళ గురవయ్య వెంబడించడం గౌరిని బతిమిలాడటంలో నిమగ్నమయిన సత్తిరాజూ ఈరాజూ గమనించలేదు.

గౌరిని బతిమిలాడి బామాలి ఎట్టకేలకు ఒప్పించారు.

"నీ చెప్పినట్టు వింటారా?"

"వింటాం. వింటాం." చెంపలు వాయించుకొన్నారు.

గౌరి ఈరా పడవ ఎక్కారు. సత్తిరాజు తాడు విప్పి పడవలోకి దూకాడు. ఈరాజు చుక్కాని పట్టాడు. సత్తిరాజు, గౌరి తెరచాప నెత్తారు.

• పడవ లాకులు దాటింది.

పొద్దుకుంకింది.

గాలి వాలుకు పడవ వేగాన్ని పుంజుకొన్నది.

గౌరి పడవతొట్టికేసి వస్తూ హఠాత్తుగా ఆగిపోయింది.

"ఓరే! ఈరాజుమామా! ఈడ జూడు!" అని అరిచింది గౌరి.

ఈరాజు తెరచాపతాళ్ళు గుంజకు కట్టేసి పరుగెత్తుకు వచ్చాడు.

"ఏందిది? ఈ సన్నాశాయన చెప్పాపెట్టకుండా పడవెక్కాడు?" ఆశ్చర్యపోయాడు ఈరాజు.

కొబ్బరికాయల గుట్టమీద కాళ్ళు బార్లాగా చాపి పడుకొని ఉన్న సన్యాసిని చూసి "ఓ సాధువయ్యోయ్! లేలే! ఎక్కడికి పోతుండవ్?" గౌరి అడిగింది.

సన్యాసి ఉలకలేదు- పలకలేదు!

"ఏ య్యా? నిన్నే మాట్టాడవేం?" అంటూ వంగి సన్యాసి రెక్కపట్టుకొన్న ఈరాజు ఒక్క గావుకేక పెట్టాడు. సన్యాసి చెయ్యి విడిచిపెట్టి వెనక్కు ఒక్క దూకు దూకాడు. సన్యాసి చేతికి చుట్టుకొన్న సంచి జారిపడింది. ఆ సంచిలోనుంచి కొబ్బరికాయ బయటపడింది. దొర్లి మిగతా కొబ్బరికాయల్లో కలిసిపోయింది.

రెప్పవాల్చకుండా ఆకాశంకేసి చూస్తున్న సన్యాసిని చూసిన గౌరికి వణుకుపుట్టింది.

ఈరా కేకకు చుక్కాని వదిలేసి సత్తిరాజు పరుగెత్తుకొచ్చాడు.

"ఏందీ సన్యాసి మన పడవెక్కాడు?" అని "లేలే!" అంటూ కొబ్బరికాయల గుట్టమీద పడుకొనిఉన్న సన్యాసిని బలంగా గుంజాడు. ఒకటెరా కొబ్బరికాయలు జారినై. సన్యాసి తిరగబడ్డాడు.

వీపున కత్తి దిగబడి ఉంది. కింద రక్తంతో కొన్ని కొబ్బరికాయలు తడిసిపోయినాయి!

"ఏందిరా యీరా ఇది?" అడిగాడు సత్తిరాజు.

"అదే సత్తిరాజూ! నాకూ అర్థంకావడంలేదు!" అన్నాడు ఈరాజు.

"ఈణ్ని సంపినోళ్ళు వాళ్ళేనంటావా?"

"వాళ్ళుగాక మరెవరంటావ్?"

"సంపి మన పడవలో వేశారంటావా?"

"సంపాక మన పడవలో ఎందుకెయ్యాల? కాలవలోనే పారెయొచ్చుగా?"

"పడవమీదకొచ్చి చంపారంటావా?"

"అట్టయితే ఆళ్ళు మనకు కన్పించాలిగా?"

"మనమొచ్చేముందే చంపి పారిపోయి ఉంటేనో?"

"అట్టయితే పక్కెయ్య కొడుకు పీతయ్య మనకు చెప్పడా?"

"అయితే మనమొచ్చాకే జరిగిందంటావా?" అన్నాడు ఈరాజు.

"ఏమో మరి?" తల గోక్కున్నాడు సత్తిరాజు. "ఐతే నువ్వాడ ఉండావు గదా చూడలేదా?" రెట్టించాడు సత్తిరాజు.

"ఏందిర నీ యవ్వారం?" ఉద్రేకపడ్డాడు ఈరాజు.

"మీరుండర్రా. ఏం జరిగిందంటే-" అంటూ మొదలెట్టింది గౌరి.

"నువ్వు చూశావా?" ఇద్దరు ఒక్కసారిగా అన్నారు.

"చూడ్లేదు కాని చూసినట్టే చెప్తా వినండి!"

"ఓరే సత్తిరాజూ పడవొడ్డుకుపడ్తుంది చుక్కాని పట్టు!" హెచ్చరించాడు ఈరాజు, సత్తిరాజు వెళ్ళి చుక్కాని పట్టి పడవను కాలవ మధ్యలోకి తెచ్చాడు, గౌరి, ఈరాజు సత్తిరాజు దగ్గరకొచ్చి కూలబడ్డారు.

"మనం తిరునాళ్లో చూసిన సన్నాసి ఈయనే మరి గుర్తుందిగా! ఈయన్ని వెంటాడుతున్న ఇద్దర్నీ ఆ కర్రోడ్నీ, బక్కోడ్నీ కూడా చూశాం గద—మనం గుడి మెట్లమీద కూర్చునిఉండగా వీళ్లు పరుగెత్తుకుపోవడం కన్పించిందిగా మనకు. అట్టావొచ్చి అట్టావొచ్చి యీ సన్యాశాయన మన పడవలోకి వచ్చిపడ్డాడు. ఈయన్ని తరుముకొంటూ వొచ్చినోళ్ళు వచ్చేసరికి మనం పడవ ఇప్పిఉండాలి. వాళ్ళు కట్టమీద నుంచొని పడవెక్కుతున్న ఈయనపైకి కత్తిని విసురుంటారు. ఇప్పుడీ సన్నాసోడేమో చచ్చి మనపాలిట పడ్డాడు. ఏంచేద్దాం?" గౌరి దిగులుగా అన్నది.

"పడవ వెనక్కుతిప్పి లాకులదగ్గరకె త్తేనో?" అన్నాడు ఈర్రాజు.

"అద్ని మనమే చంపామంటేనో?"

"ఓరే మీరుండండిరా?" అన్నది గౌరి. ఇద్దరూ గౌరిని ఆత్రంగా చూశారు. ఆశగా చూశారు.

"మీ పందెం మాటో?"

"అవునవునే గౌరీ! ఇప్పటికే ఒక రోజు పోయింది!" అన్నాడు ఈర్రాజు.

"అయితే ఓ పని చేద్దాం?"

గౌరి, ఈర్రాజు సత్తిరాజును చూశారు.

"శవాన్ని కాలవలో తోసేసి మనపాటికి మనం ఏమీ తెలియనట్టే పోతే సరి!"

"అది తప్పుడుపని కాదా మామా?" అడిగింది గౌరి.

"బానానే గౌరి! మామచిక్కినమాట మరిచాను!"

"చెంపలు వాయించుకోరా సత్తిగా?" ఈసడింపుగా అన్నాడు ఈర్రాజు.

సత్తిరాజుకు ఎక్కడలేని పౌరుషం వచ్చేసింది.

"ఓరే ఈరిగా అసలు నువ్వే ఈడ్ని చంపేసుంటావ్‌రా!" అన్నాడు సత్తిరాజు.

"ఛ! నోరుమూయండి!" కసిరింది గౌరి. ఇద్దరూ మౌనంగా గౌరిని చూశారు.

"ఓ పని చేద్దాం. వచ్చే లాకులదగ్గర పడవాపి దగ్గర్లో ఉన్న పోలీసుస్టేషన్‌కు వెళ్ళి చెప్పుదాం!"

"అది బాగానే ఉంది గాని గౌరీ! మళ్ళా లాకులొచ్చేసరికి తెల్లవారుద్ది!" అన్నాడు సత్తిరాజు.

"అయితే ఏమైంది?"

"ఈ రాత్రంతా సచ్చినోడ్ని పడవలో పెట్టుకొని ఎట్టా ఉంటామే గౌరీ?" అన్నాడు ఈర్రాజు.

"తప్పదురా తప్పదు."

"సరే నువ్వంటే మాకు తప్పేదేముంది!" అన్నాడు సత్తిరాజు.

అర్థరాత్రి దాటింది పడవలో ముగ్గురూ బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. గాలివాటం బాగానే ఉంది. పడవ వేగంగా పోతూంది. ఈరా మధ్యమధ్య శవాన్ని చూసి తిరిగి చుక్కాని దగ్గరకొస్తూ ఉన్నాడు.

"ఏంటి మామా నీ అనుమానం!" గౌరి అడిగింది.

"సచ్చినోడు లేచి పారిపోయాడేమోనని!" సత్తిరాజు హేళనగా అన్నాడు

"అదికాదురా—" ఆగి, కాలవకట్టమీదకు చూశాడు ఈర్రాజు. గౌరీ, సత్తిరాజూ ఈర్రాజు ముఖంలోకి చూశారు

"అదుగో అక్కడ తుమ్మచెట్లచాటున చూడండి!" మెల్లగా గొంతు తగ్గించి అన్నాడు ఈర్రాజు.

కాలవకట్టమీద తుమ్మచెట్లనీడలో ఇద్దరు మనుషులు పరుగెత్తిరావడం కన్పించింది.

"వాళ్ళే. తిరునాళ్ళో కన్పించినోళ్ళు!"

"సన్యాసోడ్ని చంపినోళ్ళు!"

"ష్! మెల్లిగా. వాళ్లు పడవదగ్గిర కొస్తున్నారు!" గౌరి హెచ్చరించింది.

కాలవలో దిగారు.

ఈదుకొస్తున్నారు.

"రానియ్. కొడుకుల్ని కట్టిపడేద్దాం."

"వాళ్ళదగ్గర కత్తులుంటాయ్." గౌరి హెచ్చరించింది.

"మనదగ్గర తెడ్డుకర్రలున్నాయ్."

"తాళ్ళూ, వలలూ ఉన్నాయ్."

సత్తి, ఈరాలూ తెడ్లూ, తాళ్ళూ తీసుకొని సిద్ధమయారు.

పటాకుల రిత్తయ్య. తేళ్ళ గురవయ్య ఈదుకొంటూ పడవనుసమీపించారు ఈరా, సత్తి చెరొకడ్ని చూసుకొన్నారు. తెడ్లతోనూ, తాళ్ళతోనూ బాదారు. పడవ ఎక్కకుండా చేశారు, పారిపోయి కట్ట ఎక్కారు.

"ఈరా! మనం తొందరగా వెళ్ళిపోవాలిరా. వీళ్ళు ఎళ్ళి ఇంకా మందితో వస్తారేమో? వాళ్ళొచ్చేసరికి మనం రక్కసపాడు లాకు చేరాలి!"

"సత్తీ. చిన్నతెరచాప కూడా వదలమంటావా?"

"ఓరి మామలూ! పడవ బరువుమీదుంది ఒరిగిపోగలదు. జాగ్రత్త!" హెచ్చరించింది గౌరి.

వేగుచుక్క పొడిచింది.

పడవ రక్కసపాడు లాకులదగ్గ రాగింది.

తెల్లవారిందాకా సత్తిరాజు, ఈర్రాజు పడవకు కాపలా కాశారు. గౌరి కునుకుతీసి అప్పుడే లేచికూర్చుంది. రక్కసపాడు లాకుకు మూడుమైళ్ళ దూరంలో పోలీస్‌స్టేషనుంది.

గౌరిని, సత్తిరాజును పడవమీద ఉంచి ఈరా బయలుదేరాడు.

పొద్దు నెత్తిమీదకొస్తుండగా పోలీసులు ఈర్రాజును వెంటబెట్టుకొని పడవదగ్గరకొచ్చారు. పోలీసులు శవాన్ని దించి కట్టమీదుంచారు.

"ఊఁ! నడవండి!"

"మేమా? మాకేం తెలియదు!"

"అదంతా తర్వాత! ముందు నడవండి!" హెడ్డు దబాయించాడు.

"మేమాడ్ని చంపలేదు." గౌరి గొంతు కీచుమన్నది.

"ఏంపిల్లోవ్. కూతపెట్టన్నావ్! ముందు పడవ దిగు!" కానిస్టేబులొకడు గౌరి రెక్కపట్టుకొని గుంజాడు.

"ఆడకూతుర్ని పట్టుకొంటవ్. వదులోదులు. వస్తాం పద!" ఈరా అరిచాడు,

"పడవలో సరుకుంది! అందర్నీ రమ్మంటున్నారు!"

"మావాళ్ళుంటార్లే! మీ సరుకెక్కడికీ పోదులే! నడవండి!" అన్నాడు హెడ్డు.

"ఇంతకీ ఏ సరుకంటా?"

"కొబ్బరికాయలు!"

"ఓరినీయమ్మ! కొబ్బరికాయలే గద. ఎవడైనా దేవుడికి కొట్టేయేగా? నడునడువ్" హెడ్ ఎద్దేవగా అని లాఠీతో ముందుకుతోశాడు సత్తిరాజును.

సత్తిరాజు, గౌరీ, ఈర్రాజూ బెదురుబెదురుగా పోలీసుల వెంట నడిచారు.

పాపం వాళ్ళకు పొద్దుటనుంచీ తిండీతిప్పల్లేవు. ఆకలితో నకనకలాడిపోతున్నారు. ఎందుకొచ్చిన బాధ ఇది? సత్తిగాడ్నో, ఈరిగాడ్నో కట్టుకుంటే యీ తిప్పలన్నీ ఉండేయి కాదు గదా అని ఆలోచిస్తూ గౌరి పొద్దువాలుతుండగా మెలికలపాడు పోలీసుస్టేషన్‌కు చేరారు.

7

"కొండయ్యా! ఈళ్ళనోపట్టు పట్టావేంటి? అన్నీ కథలు చెప్తున్నారు కథలు!"! హెడ్డుతో అన్నాడు యస్సై.

"నిజం బాబయ్యా! సత్తెపమాణంగా గంగమ్మ తల్లిమీద ఒట్టేసి చెప్తున్నా. మాకేం తెలవదు. మేము చూసేసరికికల్లా ఆ సన్నాసోడు సచ్చిపడుంటాడు!" సత్తిరాజు ప్రాధేయపడి చెప్తున్నాడు.

"కొండయ్యా? ఇది ఇట్టా తేలేదికాదుగాని ఈళ్ళ ముగ్గురునీ లోపలేసేయ్!" యస్సై లాఠీకర్ర బల్లమీద టకటకలాడించాడు.

"బాబ్బాబూ! మా యిద్దర్నీ కొట్లో పెట్టండి. ఆడకూతుర్ని వదిలేయండి" ఈరా బ్రతిమిలాడాడు.

"ఒరే! ఆడకూతురంటే గుర్తొచ్చింది. అసలీ పిల్ల ఎవత్తిరా? మీరు చెప్పింది నిజమేనా? లేక యీ పిట్టను లేవదీసుకొస్తున్నారా?"

"ఏంది యస్సైబాబూ! మంచిగ మూట్లాడు. నేనెవర్నను కొంటున్నావ్. సర్దార్ శివయ్య కూతుర్ని. శివయ్యంటే జిల్లా మొత్తం ఎరికే. ఉప్పెనొచ్చినప్పుడు మూడొందల మంది ప్రాణాలు కాపాడాడు మా అయ్య శివయ్య!"

యస్సై గౌరిని ఎగాదిగా చూశాడు. మెత్తబడ్డాడు.

"ఆడకూతుర్ని వొగ్గేసి ఇది గీళ్ళిద్దరినీ లోపలేసేయమంటావా?" అన్నాడు హెడ్డు. జాలర్ల కుటుంబం నుంచి ఒచ్చిన హెడ్డు. శివయ్య పేరు ఎక్కడో విన్నట్టున్నాడు.

"ఆడకూతురొక్కతే ఎట్టా వెళ్తది? పడవెట్టా నడుపుతుంది హెడ్డూ? వీళ్ళిద్దర్లో ఒకర్నుంచి మిగతా ఇద్దరిని సొంత పూచికత్తులమీద వదిలేద్దాం?" అన్నాడు యస్సై.

"మీలో ఎవరు వుంటార్రా ఇక్కడ?"

నేనంటే నేనన్నారు ఇద్దరూ.

హెడ్డు తల గోక్కున్నాడు.

"నువ్వు చెప్పు శివయ్యకూతురా ఎవడ్ని కొట్లో వెయ్యమంటావ్. ఎవడ్ని విడిచిపెట్టమంటావ్?"

"ఇద్దర్నీ వదలండి!"

"ఇద్దర్నీ వొగ్గేసి–" ప్రశ్నార్థకంగా చూశాడు గౌరిని హెడ్డు.

"నేనుంటా?"

హెడ్డు తల తిరిగిపోయింది. ఇంకా నయం యస్సైబాబు ఇన్లేదు. హెడ్డు విశాఖపట్నం అగ్నికుల క్షత్రియుడైనా కోస్తాలో ఉన్న జాలర్లంటే అభిమానం జాస్తి. గోదావరి జిల్లా జాలర్లకు విశాఖపట్నం జాలర్ల కుటుంబాల మధ్య ఇచ్చిపుచ్చుకోటాలున్నాయి.

హెడ్డు గౌరిని పక్కకు తీసుకెళ్ళాడు.

"ఉంటానంటున్నావ్? ఇదేంది పోలీస్టేషన్. పెళ్ళి కావల్సిందానివి! శివయ్య కూతురని ఇంత సెపుతున్నా.

నేకపోతే యస్సైను బాబుదాకా ఎందుకు, యీపాటికి నేనే ఏసేద్దును కొట్లో. తెలిసిందా? నువ్వెల్లిపో. మీ అయ్యకు సెప్పు. వచ్చి ఇడుపించుకొంటాడు.-" యస్సైను పిలుపువిని "సార్, వచ్చీసా!" అంటూ గౌరిని వదలి యస్సైను దగ్గర కెళ్ళాడు కొండయ్య.

"ఏందోయ్ ఆలశ్యం! శవాన్ని పోస్టుమార్టంకు పంపాలి! పడవంతా సోదా చేయాలి!"

"ఒకడ్నుంచి రెండోవాడ్ని పిల్లను వదిలేద్దాం సార్!" వినయంగా విన్నవించుకొన్నాడు.

గౌరి చెవిపోగో ముక్కుపుడకో కొండయ్య చేతిలో పడిందనుకొన్నాడు యస్సైను.

"అట్టాగే! అట్టాగే! ఆడకూతురు ఒంటరిగా ఎట్లా పోతది. ఒకడ్నుంచి ఒకడ్ని వదిలెయ్!" అన్నాడు యస్సైను.

ముగ్గురూ తర్జనభర్జనలు పడ్డారు. సత్తిరాజు తనే ఉండిపోతానని పట్టుబట్టాడు. గౌరికి సత్తిరాజుమీద ప్రేమ పెరిగింది వాడి త్యాగబుద్ధికి కరిగిపోయింది. ఈశ్రాజుకూడా సత్తిగాడిని లోలోపల మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.

"హెడ్డూ ఏమాత్రం చేస్తదేంటి?"

"ఏంది సారు అదీ?" హెడ్డు తల గీరుకొన్నాడు.

"అన్నీ వివరాలు చెప్పాలేంటి?" గదమాయించారు యస్సైను.

"ఏం ఉచ్చుకోలేదు సార్?" హెడ్డు నసిగాడు.

"అయితే ఆళ్ళిద్దర్నికూడా లోపలెయ్!" గర్జించాడు. యస్సైను.

హెడ్డు బయటికి పరుగెత్తాడు. స్టేషన్ ఆవరణదాటిపోతూన్న ఈశ్రాను గౌరిని ఆపాడు.

ఐదు నిముషాల్లో తిరిగొచ్చి జత చెవిపోగులు యస్సైను బల్లమీద ఉంచాడు. అవితీసి జేబులో వేసుకొంటున్న యస్సైనువంక ఆశగా చూశాడు హెడ్డు.

"నాకు తెలుసులేవోయ్! ముక్కుపుడక ముందే సర్దేశావుగా!"

హెడ్ జేబులు తడుముకున్నాడు.

"బాబూ శవాన్ని సెర్చిచెయ్యొద్దా?" ఉత్సాహంగా అన్నాడు హెడ్డు.

"నీ తలకాయ! సచ్చినోడి దగ్గరేం ఉంటుంది బూడిద! శవాన్ని పోస్టుమార్టంకు పంపించే ఏర్పాట్లు చూడు." అంటూ యస్సైను లేచి నిలబడ్డాడు.

8

ఆ రాత్రంతా పోలీసు కాపలాతోనే ఈశ్రా, గౌరి పడవలోనే పడుకొన్నారు. ఉదయం బారెడు పొద్దెక్కాక పోలీసులు పడవను వదిలేశారు.

పగలంతా ప్రయాణంచేసి పొద్దుకూకుతుండగా పడవ రామాపురం రేవును చేరింది. పడవ రేవులోకి వస్తుండగానే కొబ్బరికాయల వ్యాపారి మురుగుల రంగయ్యశెట్టి కోసం వెతికాడు ఈశ్రాజు. ఈ సరకు ఆయనది. శెట్టిగారికి సరుకు ఒప్పచెప్పి రసీదు రాయించుకొని తిరిగివెళ్ళి సరుకు వేసిన వ్యాపారి బాతుల బసవయ్యకు చూపిస్తే, ముందిచ్చిన దారి భత్యం మినహాయించి మిగతా డబ్బిస్తాడు.

గౌరిని పడవమీదే ఉంచి ఈశ్రాజు దిగి రేవుకాడ మురుగుల రంగయ్యకోసం వెతికాడు. నిన్న సాయంకాలం రావాల్సిన పడవ యీరోజొచ్చింది. నిన్నంతా చూసి రంగయ్య వెళ్ళిపోయాడేమో? ఆయనొస్తేగాని సరుకు దించడానికి వీల్లేదు. రేవుకాడ కొబ్బరికాయిలు దించి ఎవరికి అప్పచెప్పేట్టు! బస్తీకెళ్ళి రంగయ్య శెట్టికి చెప్పిరావాలంటే ఏడేడు పధ్నాలుగు మైళ్ళుంది—ఏం చేయడానికి తోచక రేవంతా కాలుగాలిన పిల్లిలా తిరిగాడు ఈశ్రాజు. రంగయ్య శెట్టి మనుషులెవరన్నా కన్పిస్తారేమో అన్న ఆశతో బాగా చీకటి పడేదాకా చూశాడు. తిరిగి పడవదగ్గర కొస్తున్న ఈశ్రాజు ఎనకనుంచి ఎవరో పిలుస్తున్నట్టయి ఆగాడు.

"ఎవరికోసం చూస్తున్నావ్? మురుగుల రంగయ్యశెట్టి కోసమేనా చూస్తున్నావ్!"

"అవునాయనకోసమే? ఏరీ ఎక్కడా?" అపరిచిత వ్యక్తిని తేరిపారచూశాడు.

"రంగయ్యశెట్టికి ఏదో పనుండి ఆగిపోయాడు. నన్ను పంపించాడు సరుకెత్తుకొని రమ్మని!"

సన్నగా పొడుగ్గా ఉన్న అతడు తనపేరు సింగినాధం రామస్వామిగా పరిచయం చేసుకొన్నాడు, ఈశ్రాజు రామస్వామిని అనుమానంగా చూశాడు.

"ఏంటట్టా చూస్తావ్. లారీకూడా తెచ్చాను సరుకు దించు!" అన్నాడు ముందుకు నడుస్తూ.

"లారీ ఎక్కడా?"

"అదిగో అడితి పక్కన! పడవకాడికి తీసుకొస్తా పద!" అన్నాడు రామస్వామి.

"ఉండుండు! ఆ లారీ శెట్టిగారిది కాదేమో!"

"శెట్టిగారి సొంతలారీ చెడిపోతే అద్దెకు తెచ్చాం." నడువ్!" తొందరపెట్టాడు.

క్షణం ఆలోచించి "శెట్టిగారికే సరుకు వొప్పచెప్పమని బాతుల బసవయ్య చెప్పాడు. మరి మీ కెట్లా ఇచ్చేది?"



"ఇదిగో—నీపేరేందీ? ఈఽ్రాజా? శెట్టిగారు పంపించారయ్యా అంటే వినవేంది? ఎమైనా సరుకు దించి లారీకెత్తాల్పిందే! లేకపోతే మాకు లారీ కిరాయి దండగవుద్ది!" దూకుడుగా ఉన్నాడు రామస్వామి.

"నీకు కిరాయి దండగే. నాకు మాటపోద్ది! ఏమైనా మురుగుల రంగయ్య శెట్టి చెప్తేనే సరుకెత్తేది!"

"ఏందయ్యా పెద్ద నకరా జేత్తన్నావ్!"

"నువ్వెవడవయ్యా అసలు నన్ను సరుకు దించమంటానికి?"

మాటామాటా పెరిగి చెయ్యిచెయ్యి కలిసేదాకా వచ్చింది. రేవులో ఉన్న కళాసీలు సరంగులూ చుట్టూ మూగారు.

అదిచూసి రామస్వామి జారుకొన్నాడు. కాసేపటికి అతడి వెనక లారీకూడా కన్పించలేదు.

"దొంగనాయాల! నన్ను బురిడీ కొట్టించాలనుకొన్నాడు. ఏమాలితే ఇంకేమయినా ఉందా?" ఈఽ్రాజు పడవెక్కి జరిగిందంతా గౌరికి చెప్పాడు. ఈఽ్రాజు తెలివికి జాగ్రత్తలకు గౌరి మురిసిపోయింది.

ఈఽ్రాజు తిరిగొచ్చేసరికి కూడొండి సిద్ధంగా ఉంచింది. ఇద్దరూ ఎదురుబొదురుగా కూర్చొని రొయ్యల పులుసు కలుపుకొని తిన్నారు.

'పాపం! సత్తిరాజుమామకు ఆళ్ళు కూడెట్టారో లేదో? ఎట్టా ఉండాడో ఏందో మరి?' అనుకొన్నది గౌరి.

రాత్రి తొమ్మిది గంటలవుతుంది. సరంగులంతా పడవల మీద పడుకొని పాటలు పాడుకొంటున్నారు. గౌరి తనకూ ఈఽ్రాజుకు పక్కలు పరిచింది. తన పక్కమీద పడుకొని "యీరూ! వచ్చి పడుకో, రోజంతా కష్టపడ్డావ్!" అన్నది.

గౌరిమాట వింటూనే వీఽ్రాజుకు రక్తం ఉడుకెక్కిపోయింది. తన పక్క గౌరికి దగ్గరగా లాక్కున్నాడు.

"దూరం. దూరం. యిఽ్రాజు మామా! నువ్వు మాట తప్పుతున్నావ్. నీతి తప్పుతున్నావ్? ఇట్టయితే నువ్వు పందెంలో ఓడిపోయినట్టే మరి! నేను సత్తిరాజు మామకు పెళ్ళాన్నవుతాను. నీకు దక్కను గాక దక్కను. ఆలోచించుకో మరి!" ఈఽ్రాజు బారెడు దూరంగా పక్క లాక్కున్నాడు. "ఏందోనే గౌరి ఉడుకురక్తం. ఎన్నాల. కొఽ్రమీనులాంటి పిల్ల పక్కనుంటే అట్టా అనిపించింది. ఇదుగో చెవులుపట్టుకొని గుంజీళ్ళు తీస్తున్నా చూడూ!" నాలు పుంజీలు గుంజీళ్ళు తీసి పక్కమీద వెల్లికలా పడుకొన్నాడు.

కన్ను మూతపడిందో లేదో లారీరొద విని లేచి కూర్చున్నాడు ఈఽ్రాజు. లారీ హెడ్‌లైట్ కాంతికి కళ్ళు చిడతలారిపోతున్నాయి.

"ఎవఽటీ?" అంటూ ఈఽ్రాజు పడవ దిగొచ్చాడు. గౌరి లేచి పడవమీద నిలబడి చూస్తున్నది.

"ఈఽ్రాజువు నువ్వేనా?"

"అవున్నేనే ఏందంటా?" చిరాకుపడిపోయాడు. లోలోపల ఏదో తెలియని భయం తరుముతూ ఉంది!

"ఇదుగో. ఈరు ఉంగరాల బంగారయ్యగారు! పట్నం వ్యాపారి. కొబ్బరికాయల వ్యాపారం. టోకుగా కొంటారు. అమ్ముతారు. మురుగులశెట్టిక్కూడా యీయనే అమ్ముతాడు—" లావుగా పొట్టిగా ఉన్నవాడొకడు గుండ్రంగా పెద్ద బొజ్జతో ఉన్నాయన్ను చూపించి చెప్పుకుపోతున్నాడు.

"అయితే ఏందంటా?" కటాబిటిగా అన్నాడు ఈఽ్రాజు.

"కొబ్బరికాయల సరుకు కొంటానికొచ్చారు బంగారయ్యగారు."

"ఆ సరుకు శెట్టిగారిదయితే నేనెట్టా అమ్ముతాను?"

"శెట్టిగారికి కొబ్బరికాయలకు బదులు సరుకిచ్చేయొచ్చు చిల్లరధర కొబ్బరికాయ అణా! టోకుగా అయితే రూపాయికి ఇరవై. నీకు తెలుసుగా. ఐదుకు వంద ఏభై రూపాయలకు వెయ్యి కాయ. వంద తీసుకొని సరుకిచ్చేయ్. ఏభై శెట్టికిచ్చి ఏభై నీ లాభంగా ఉంచుకో—" అతడు చెప్పుకుపోతూంటే అయోమయంగా చూశాడు ఈఽ్రాజు.

"బంగారయ్య గారికి అర్జంటుగా కావాల్సి ఒచ్చింది. విదేశాలకు ఎగుమతి చేయాలి కొబ్బరికాయ. అందుకని ఇబ్బడిరేటుపెట్టి కొంటున్నారు."

ఈలోపల గౌరి పడవదిగి వచ్చింది. పక్క పడవలవాళ్ళు మెల్లమెల్లగా లేచి కళ్ళు నులుపుకొని వింతగా చూస్తున్నారు.

"ఆఖరిమాట ఇంకో వంద!" ఉంగరాల బంగారయ్య అన్నాడు.

"బంగారయ్యగారూ. ఈశ్రాజు మొహమాటం మనిషి! శెట్టిగారికెలా చెప్పాలని ఆలోచిస్తున్నాడు. ఇచ్చేయండి ఐదొందలు. శెట్టి కావాలంటే ఇంకో వంద ఇచ్చి నచ్చచెప్పుకొంటాడు ఈశ్రాజు."

బంగారయ్య మొలన ఉన్న కాయితం పొట్లం తీసి వందరూపాయల నోట్లు ఐదుతీసి ఈశ్రాజు చేతులో బలవంతంగా పెట్టాడు.

ఈశ్రాజు మంత్రముగ్ధుడయిపోయాడు.

వందరూపాయలనోటు జన్మలో ఒక్కసారే చూశాడు. అది మురుగులశెట్టే చూపించాడు. అదీ తన చిన్నతనంలో అయ్యవెంట సరుకేసుకొచ్చినప్పుడు.

ఇంతవరకూ వందరూపాయల స్పర్శ తెలియదు. చిన్నతనంలో ముట్టుకుచూడాలని ఆశపడ్డాడు. 'అది సాక్షాత్తు లచ్చిందేవిరా నీలాటోళ్ళు ముట్టుకుంటే మైలపడిపోతుం దన్నాడు.

ఇప్పుడు తన చేతుల్లో ఐదుగురు లచ్చిందేవులు! ఈ లచ్చిందేవుల్ని శివయ్యమామకిస్తే తనకు గౌరి దక్కుతుంది-

మెత్తపడిపోతున్నాడు ఈశ్రాజు. జావకారిపోతున్నాడు. చమటలుపట్టినై.

ఇందులో తనేం తప్పుచెయ్యడంలేదు. శెట్టి జేసేది యాపారమే! ఇప్పుడిదీ యాపారమే గద!

"ఓరేయ్ హమాలీలు. సరుకు దించండిరా!" ఉంగరాల బంగారయ్య కేక విని ఉలిక్కిపడ్డాడు.

కళ్ళముందు తారట్లాడుతున్న లచ్చిందేవమ్మలు మాయమయి గౌరమ్మ ఎదురుగా కళ్ళముందు కన్పించింది.

ఈశ్రాజు ఐదొందలూ ఉంగరాల బంగారయ్యమీదకు విసిరారు.

"నువ్వు నాయెత్తు బంగారమిచ్చినా సరుకమ్మను. ఈ సరకు మురుగుల రంగయ్యగారిది. ఆరే అమ్ముకోవాలి. అమ్ముకున్నా జోరుకున్నా ఆరే చేయాలి. మీ రెల్లండి!" గిర్రున తిరిగి పడవెక్కాడు. ఈశ్రాజును చూసి గౌరి గర్వపడింది. సరంగులూ రేవుపనివాళ్ళు ఆశ్చర్యపోయారు. ఇంత నీతిమంతులు ఇంకా ఉన్నారా? ఐదొందలు - ఏభై రూకల సరుక్కి ఐదుసార్లు? ముక్కులు నలుపుకొన్నారు.

With best compliments from

BATCHU LINGIAH & SONS

PAPER MERCHANTS

GENERAL BAZAR, SECUNDERABAD-500 003.

Grams: "NEWSPRINT"
Telex: 0155-6742

Phone Off: 72997
Res: : 74095

ఉంగరాల బంగారయ్యతోపాటు అతనివెంట వచ్చిన వాళ్ళంతా బిలబిలా లారీ ఎక్కారు. ఆ ఎక్కుతున్నవాళ్లల్లో ఒకడు ముఖంమీదగా తలగుడ్డ చుట్టుకొని ఉన్నాడు. వాడ్ని ఎక్కడో చూసినట్టుంది వీర్రాజుకు. వాడినే చూస్తూఉన్నాడు. వాడు లారీలోకి దూకేసరికి తలగుడ్డ ఊడి భుజానపడింది,

వాడే! వాడే. సింగినాథం రామసామిగాడు. ముందొచ్చి సరుకు శెట్టిగారు తెమ్మన్నారు అన్నాడు. ఇప్పుడీళ్ళతో వచ్చాడు?

ఏందీగొడవ?

ఏందీ అయోమయం?

వీర్రాజు బుర్ర చేపలపులుసులా కుతకుతా ఉడికి పోయింది

గౌరికి అల్లంతకూరంలో పక్కమీద పడుకొన్నాడు. ఆలోచనలు తెగడంలేదు. అసలీ పందెం ఏందీ? ఆడు పడవలో చావడమేమిటి? ఈడొచ్చి ఈ కొబ్బరికాయలు ఇంత బెట్టి కొంటానంటమేంటి? ఈ కొబ్బరికాయల్లో ఏముంది? మామూలు కొబ్బరికాయలే గందా? వీర్రాజుకు మెదడులో హఠాత్తుగా మెరుపు- ఆ మెరుపులో గుడిలోనుంచి కొబ్బరికాయ సంచి చేత్తోపట్టుకొని గుడి మెట్లమీద పరుగులు తీస్తున్న సన్యాసి కళ్ళముందు కదిలాడు.

అవును ఆ సన్యాసి తెచ్చిన కొబ్బరికాయ ఏమైంది?

దిగ్గున లేచి కొబ్బరికాయలు నింపిన తొట్టిలోకి దిగాడు! దీపంబుడ్డి వెలిగించి వెతుకుతున్నాడు. ఆ కొబ్బరికాయ, సచ్చిన సన్యాసి తెచ్చిన కాయ! వెయ్యికాయల్లో అదేది? కాయల్లో కలిసిపోయింది! పోలీసోళ్ళు కాయలన్నీ గెలికి తిరగేసి పడవంతా వెతికారు. అందులో కలిసిపోయింది. దానికోసమే సన్యాసిని వాళ్లు చంపింది! దానికోసమే ఉంగరాల బంగారయ్య వొచ్చింది.సింగినాథం రామస్వామి! అన్నీ దొంగపేర్లు. దొంగనాటకం. మోసం! ఆ కొబ్బరికాయలో ఏముంది? ఏదీ అది?

వెర్రిగా వెతుకుతున్నాడు. ఒక్కొక్కటి తీసుకొని మళ్ళీ విసిరేస్తున్నాడు. కొబ్బరికాయల బుట్టలో కాళ్ళు దిగబడి పోతూన్నాయి. జారిపోతున్నాడు. పైకెక్కుతున్నాడు.

"ఏంది మామా? ఎతుకుతున్నావ్?"

ఉలిక్కిపడ్డాడు. తల పైకెత్తి చూశాడు.

గౌరి పైన నిలబడి తొట్టిలోకి చూస్తూ కన్పించింది.

"ఏంలేదు?"

"ఏంది య్యీర్రాజూ, ఏదో వెతుకుతున్నావుగా? ఏమీ లేదంటావేం?"

"కొబ్బరికాయ!"

దక్షిణాది న్యూస్ పేపరు, పత్రికల ప్రచురణదార్లకు గమనిక

మీ న్యూస్‌ప్రింట్ వ్యవహారాలు మాకు అప్పగించండి

శ్రీ శ్రీనివాస పేపర్ కన్వర్టర్స్

(రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా, న్యూఢిల్లీవారిచే గుర్తింపబడినది)

7, మరుగేశ ముదలై స్ట్రీటు, మద్రాస్—600 079.

ఫోన్: 519358

దిగుమతి చేయబడిన బతర్ స్టాక్ రోల్సు గాను, షీట్లలో సప్లయి చేయగలము

"దాహమేస్తుందా? ఆకలేస్తుందా? అన్ని కాయలుంటే వెతుకుతావేంటి?"

'ఆ కొబ్బరికాయ!"

"ఏ కొబ్బరికాయా?" కళ్ళు చిట్లించింది గౌరి.

"సన్నాసి కొబ్బరికాయ!"

"సన్నాసి కొబ్బరికాయా!" గౌరి కనుబొమ్మలు ముడి పడ్డాయి.

"అదే!అదే!!"

"అందులో ఏముంది?"

"తెలియదు!"

"సర్లే! పైకిరా. నీకే చెప్పేది!"

"అది ఇక్కడే ఉంది! అది ఇందులోనే ఉంది? దాని కోసమే ఇంతమంది—"

"నీకేమన్నా పిచ్చా?"

"ఆఁ పిచ్చే. కొబ్బరికాయి పిచ్చి!"

"చాల్లే సంబడం! నోరుమూసుకొని పైకొచ్చేయ్!" గౌరి ఈశ్రాజు చెయ్యి పట్టుకొని పైకి గుంజింది.

వచ్చి పడుకొన్నాడు. నిద్రపట్టడంలేదు. టపాటపా పేలి పోతూన్నాయి వేయికొబ్బరికాయలు పగిలిపోయినై ఈశ్రాజు బుర్రలో-

అవన్నీ పగలగొట్టి చూస్తే? వెయ్యికొబ్బరికాయల పీచుతీయాలంటే ఒక్కడికి మూడురోజులు పడ్తుంది. ఈ రాత్రికి రాత్రి పడవను ఎక్కడికన్నా తీసుకెళ్తైనో—

"ఏంటిమామా? నిద్రపోలేదా?"

గౌరి గొంతు వింటూ ఈ లోకంలోకొచ్చాడు వీర్రాజు.

ఛఛ! ఛు. తనేంటి ఇలా అయిపోయాడు. గౌరిని మను వాడ్డానికి పందెం ఒప్పుకొన్నాడు. నీతిగా ఉండాలి. న్యాయంగా సంపాదించాలి. మురుగులశెట్టి సరుకు మురుగుల శెట్టికే అప్పగించాలి. ఆరు నూరయినా నూరు ఐదుమార్లయినా సరే!

"గౌరీ?"

"ఊఁ!"

"నన్ను మనువాడతావా?"

"ఆడతానో లేదో మరి! అదంతా నీమీదే ఉంది. పందెం గెలిచి నన్ను గెలువు!"

ఈశ్రాజు ఉబ్బిపోయాడు, పక్కకు తిరిగి వత్తిలిగి పడు కున్నాడు. మగతమగతగా మత్తుమత్తుగా నిద్రపట్టింది.

9

గుండెలమీద బరువు. ఏదో తొక్కుతున్నట్టుగా ఉంది. కళ్ళుతెరిచాడు ఈశ్రాజు.

పీకమీద పట్టాకత్తి!

వెన్నెల్లో వాడిముఖం స్పష్టంగానే కన్పిస్తోంది. వాడే! ఉక్కుగాడు-కర్రోడు. సన్యాసిని వెంటాడినవాడు!

"లే! తెరచాప ఎత్తి పడవను యీ రేవు దాటించు! అరి చావో మెడ తెగిపోతుంది!" యీర్రాజులు లేపి కూర్చో పెట్టాడు!

తెరచాప కొయ్యకు కట్టిపడేసి ఉన్న గౌరిని చూసి ఈశ్రాజు గిలగిల్లాడిపోయాడు.

"గౌరిని వదలండి మీరు చెప్పినట్టే చేస్తాను!"

"సరే! అల్లరి చేశారో పీకలు తెగిపోతాయి జాగ్రత్త!"

రెండోవాడు గౌరి నోట్లో కుక్కిన గుడ్డలు తీసి చేతికట్లు విప్పాడు. గౌరి వణుకుతూ వచ్చి చుక్కాని పట్టింది. యీర్రాజు తెరచాప ఎత్తాడు.

ఈశ్రాజు వెనక పటాకులరత్తయ్య, గౌరిపక్కన తేళ్ళ గురవయ్య కత్తులుదూసి కూర్చున్నారు.

పడవ రేవు దాటింది.

ఈదురుగాలిగా ఉంది. సముద్రంలో తుఫాన్ లేచిందను కొన్నాడు ఈశ్రాజు. గాలి ఎడాపెడా వీస్తోంది. తెరచాప తిరగ బడకుండా బలంకొద్దీ తాళ్ళు గుంజిపట్టుకొన్నాడు ఈశ్రాజు. చుక్కాని పట్టుకొని కాలవకు మధ్యగా పడవ నడిపిస్తూవుంది గౌరి.

చుక్కపొడిచింది.

ఇంకా ఓ జాముపొద్దుందనుకొన్నాడు ఈశ్రాజు. వీళ్ళు పడవను ఎక్కడకు తీసుకెళ్తున్నట్టు? ఎందుకు తీసుకెళ్తున్నట్టు? ఇంకెందుకు ఆ కొబ్బరికాయ కోసమే! అందుకోసమే ఆ సన్యాసిని చంపారు. ఎదురుతిరిగితే తమ పీకలు కోస్తారు— పక్కనే ఉన్న పటాకుల రత్తయ్యను చూస్తూ ఆలోచిస్తున్న ఈశ్రాజు కళ్ళు జిగేల్‌మన్నాయి. కాలవపక్క రోడ్డుమీద ఆగిఉన్న హెడ్‌లైట్స్ వెలుగు పడవమీద పడింది!

"ఏయ్! సిన్నోరా. సరిగా విను. లారి ఆగిందగ్గర పడవను ఒడ్డుకు పట్టించాలి. తెలిసిందా?" కత్తి వీపుకు ఆనించి చెవి పక్కన ఊదినట్టన్నాడు.

"అట్టాగా! తెరచేపల్ను దించాలంటే ఇంకో మనిషి ఉండాలి మరి!"

"చెప్పు. నే చేస్తా!"

"మీ చేతగాదు. అడ్డం తిరిగితే పడవ బొల్తాకొట్టుంది నువ్వు చుక్కాని పట్టుకొని గౌరిని ఇటు పంపించు!"

"ఓరినీయమ్మ ఇదొకటా! జాగ్రత్త పడవ బొల్తా పడిందో? మీ ఇద్దరు బతుకులు తిరగబడ్తాయి!" పటాకుల రత్తయ్య వెళ్ళి చుక్కాని పట్టుకొని గౌరిని పంపించాడు.

గౌరి చెవులో గుసగుసలాడాడు రాజు.

సరేసరే అన్నట్టు తలూపింది:

మరుక్షణంలో తెరచాపలు టపటప లాడాయి! వెనక్కు ముందుకూ కొట్టుకొన్నాయి!!

నిండు పడవ తిరగబడింది.

ఈరాజూ గౌరి కాలవలోకి దూకారు.

కాలవంతా కొబ్బరికాయలతో నిండింది.

నిండుగా ప్రవహిస్తున్న కాలవలో వెయ్యి కొబ్బరి కాయలు తేలి కొట్టుకుపోతూన్నాయ్.

ఈరాజు ఒడ్డెక్కి గౌరికోసం చూశాడు. ఖంగారుపడి కాలవలోకి చూశాడు. గౌరి జాడలేదు. ఆవలి ఒడ్డుకేసి చూశాడు. గౌరి కట్టదిగి చేలకు అడ్డంపడి పరుగెత్తడం వెన్నెల్లో కన్పించింది ఈరాజుకు. మళ్ళీ కాలవలోకి దిగి యీది అవతల ఒడ్డుకు చేరుకోవాలన్న ప్రయత్నంలో ఉన్న ఈరాజుకు కాలవలోనుంచి కట్టఎక్కి తనవైపే వస్తూన్న పటాకుల రత్తయ్య కన్పించాడు.

ఈరాజు తిరిగి చూడకుండా కట్టదిగి చేలకు అడ్డంపడి పరుగుతీశాడు.

10

రెండురాత్రిళ్ళూ రెండుపగుళ్ళూ ప్రయాణంచేసి ఈరాజు ఒక ఊరు చేరాడు. అంతవరకూ పటాకుల రత్తయ్య మనుషులు వెన్నాడుతూనే ఉన్నారు. వాళ్ళ బెడద తప్పి పోయిందన్న నమ్మకం కుదిరాక ఆ ఊళ్ళో రామమంది రంలో తలదాచుకొన్నాడు. ఉదయం రామమందిరం ముందున్న వేపచెట్టుకింద జనం గుమికూడి ఆనాటి పత్రికల్లో వార్తలు చదివి ఎవరికివాళ్ళు ఇళ్ళకు పరుగులు తీస్తున్నారు.

వేపచెట్టుకు ఆనుకొని పత్రిక తిరగవేస్తూ కూర్చున్న పూజారిని "ఏందిసామీ? అందులో ఏముంది? జనం అట్టా తొక్కిసలాడి పరుగులుతీస్తున్నారూ?" అని అడిగాడు.

ఈరాజును ఎగాదిగా చూసి "ఏమిటయ్యా? ఇంకా నువ్వు వినలేదా? అయితే విను!" మొదటిపేజీ తిప్పి చదవడం మొదలుపెట్టాడు.

'కొబ్బరికాయల యుద్ధం.'

'మా ప్రత్యేక విలేఖరి.'

పేరిస్‌లో ఉన్న ప్రదర్శనశాలనుంచి మాయమైన మూడు వజ్రాలు ఇండియా చేరినట్టు వార్త. విదేశీదొంగల ముఠాలు ఆ వజ్రాల వేటలో హోరాహోరి యుద్ధంచేస్తున్నాయని తెలియవచ్చింది. ఇండియాలో రెండు ముఠాలకు పెద్దఎత్తున ఏజెంట్లు ఉన్నట్టు తెలుస్తుంది. ఒక్కో వజ్రమూ కోటిరూపాయలు చేస్తుందని అంచనా. ఈ రెండు అంత ర్జాతీయ ముఠాలే కాకుండా మన దేశంలో ఉన్న వజ్రాల వర్తకులు మహారాణులు మహారాజులు ఆ వజ్రాలను చేజిక్కించుకోవాలని తమతమ మనుషులతో వజ్రాలవేట సాగిస్తున్నారని తెలియవస్తూన్నది. ఇకపోతే ఆనాడు పూజారి–"

"కొబ్బరికాయల యుద్ధం అని చదివారు. అదేంది సామీ? మరి?"

"ఆగు వస్తున్నా! పేజీ తిప్పనియ్యి." అంటూ పత్రిక పేజిలు తిప్పి చదివాడు పూజారి.

"ఐరోపాలో మాయమైన వజ్రాలు ఇండియాలో కొబ్బరి కాయలో ఉన్న వైనం!"

"కొబ్బరికాయలో వజ్రాలా సామీ?" ముఖమంతా కళ్లు చేసుకొన్నాడు ఈరా. గొంతు కీచ్‌మంది.

ఏందోయ్ సంగతీ అన్నట్టు పూజారి ఈరాజును చూశాడు.

"నువ్వు సదువు సామీ?" ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు ఈరాజు.

"పేరిస్‌నుంచి దొంగిలించి తెచ్చిన వజ్రాన్ని ఎండు కొబ్బరికాయలో దాచిపెట్టి పైన కొబ్బరిపీచు అంటించారని ఇంటిలిజెన్స్ సి.ఐ.డి వారి భోగట్టా! ఇప్పటికే యీ వార్త ఆనోటా ఈనోటా పడి ఊరూరు పాకిందని తెలుస్తున్నది. పులిమీద పుట్రన్నట్టు ఒక సన్యాసి వేషంలో ఉన్న వజ్రాల దొంగల తాలూకూ మనిషొకడు కొబ్బరికాయలు రవాణా చేస్తున్న పడవలో హత్య చేయబడ్డాడట! పోలీసులు శవాన్ని పడవ సరంగుని స్వాధీనం చేసుకొని విచారణ చేస్తున్నారని తెలియవస్తోంది.

"పడవ బోల్తా!"

మొన్న శుక్రవారం రాత్రి కొబ్బరికాయల పడవ పెద్ద కాలవలో తిరగబడి కొబ్బరికాయలన్నీ కాలవలోపడి కొట్టుకు పోయినై అని తెలుస్తూంది. అలా కాలవలోపడి కొట్టుకు వస్తోన్న కొబ్బరికాయలు కాలవపక్క పది పదిహేను ఊళ్ళ వాళ్ళు ఎవరికందినవి వాళ్ళు తెచ్చుకొన్నారట. ఆ తెల్లవారే పట్నాలనుంచి పెద్ద పెద్ద వ్యాపారులు ఊళ్ళమీదబడి ఒక్కొక్క కాయ ఐదేసి రూపాయలకు కొనుక్కువెళ్ళారట. ఆ తర్వాత కొబ్బరికాయలో వజ్రాలున్న వార్త పొక్కి అమాయకులైన పల్లెప్రజలు గుండెలు బాదుకున్నారని కూడా తెలుస్తున్నది. కొబ్బరికాయ వ్యాపారస్థుల దగ్గర నుంచి వజ్రాల వేటగాళ్ళు, అయినకాడికి కొబ్బరికాయలు కొనేశారని తెలుస్తుంది. ఇంకా కొంటున్నారని కూడా తెలుస్తుంది. అయితే యీ గుట్టుతెలిసిన ఏ వర్తకుడూ కొబ్బరికాయలు అమ్మడంలేదని కూడా తెలుస్తున్నది. అయితే చిల్లరకొట్లల్లో

ఉన్న కొబ్బరికాయలన్నీ ఇప్పటికే మాయమైనాయని తెలుస్తోంది.

'కొబ్బరికాయ దొంగతనాలు.'

గత రెండురోజులుగా కొబ్బరికాయల దొంగతనాలు దోపిళ్ళు విచ్చలవిడిగా జరుగుతున్నట్టు తెలుస్తోంది. కొబ్బరి కాయల గోదాములవద్ద ముష్టియుద్ధాలు, కత్తిపోట్లు జరుగుతున్నట్లు తెలియవస్తున్నది.

"అమ్మేవాడే లేడు!"

దేశం మొత్తంమీద యీరోజు కొబ్బరికాయ అమ్మేవాడే కనిపించటం లేదట. దేవుడిగుళ్ళో కొట్టడానిక్కూడా కొబ్బరి కాయ దొరకడంలేదని భక్తులు వాపోతున్నారు.

'కనిపించడం లేదు.'

బొల్తాపడిన పడవలో ఉన్న ఈర్రాజనే ఇరవై ఏళ్ళ కుర్రాడూ, గౌరి అనే పద్దెనిమిదేళ్ళ పడుచు కనిపించడం లేదని మెలికలపాడు పోలీసు అధికారులనుంచి వార్తలందుతున్నాయి. ఈ పడవకు సంబంధించిన మరొక పల్లెటూరి యువకుడు సత్తిరాజనేవాడు పోలీసుస్టేషన్నుంచి తప్పించుకు పోయాడని ఒక వార్త. కాదు. వాడ్ని వజ్రాల దొంగలముఠా ఎత్తుకుపోయిందని మరొక వార్త! ఇది ఇలా ఉండగా కనిపించకుండా పారిపోయిన ఈర్రాజు గౌరమ్మలదగ్గరే వజ్రాల కొబ్బరికాయ ఉంహొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

"మెలికలపాడు యస్సై. హెడ్డూ. సస్పెన్షన్."

సన్యాసి హత్యానేరంలో అనుమానితులైన గౌరిని, ఈర్రాజును వదిలేసినందుకూ, హత్యజరిగిన కొబ్బరికాయల పడవను వదిలేసినందుకూ పోలీస్‌కస్టడీలో ఉన్న సత్తిరాజు తప్పించుకుపోయినందుకూ విధినిర్వహణలో అజాగ్రత్తల కారణంగా మెలికలపాడు యస్సైని, హెడ్డుని జిల్లా పోలీసు అధికారి సస్పెండ్ చేసినట్టు ఇప్పుడే అందిన వార్త! ఏడవ పేజీలో-" అదికూడా పైకే చదివి, ఏడవపేజీ తెరిచి "ఏమోయ్! వింటున్నావా?" అంటూ పత్రికలోనుంచి తల బయటపెట్టాడు పూజారి.

"అరే! ఎమైపోయాడు!" అంటూ చుట్టూ చూశాడు. ఈర్రాజు. అప్పటికే రామమందిరం వెనక్కు తప్పుకొని కందిచేలకడ్డంగాపడి పోతున్నాడు.

వీడూ వజ్రాలదొంగ ముఠావాడేనేమో అనుమానం వచ్చి పూజారి రామమందిరంలోకి పరుగుతీశాడు. గర్భగుడిలో విగ్రహం చాటున దాచిపెట్టిన ఐదు కొబ్బరికాయలు ఇంకా అక్కడే ఉండటం చూసి తేలికపడ్డాడు. కొబ్బరికాయల పీచులీసి కొట్టి చూడాలని ఉంది పూజారికి. కాని భయం వేస్తోన్నది ఎవడన్నా చూస్తాడేమోనని! శ్రీరామచంద్రుడి అనుగ్రహం ఉంటే ఆ ఐదు కొబ్బరికాయల్లోనే ఒకదాన్లో ఆ వజ్రాలుండొచ్చు అనే ఆశతో ఉన్నాడు పూజారి.

కాని ఎలా? కొబ్బరికాయ పీచు కనిపిస్తేనే జనం అనుమానిస్తున్నారు! వజ్రాలు తనదగ్గరే ఉన్న కొబ్బరికాయలోనే దొరికితే ఇంకేమన్నా ఉందా? పోలీసులు, వజ్రాల దొంగల ముఠాలు, అందాకా ఎందుకు ఊరివాళ్ళే తన తలకాయ కొబ్బరికాయలా ఒక్క దెబ్బకు పగలేసి వజ్రాలు ఎత్తుకుపోరూ? మహాప్రభో రామచంద్రా! పాహిమాం పాహిమాం- పూజారి రామచంద్రమూర్తి ముందు సాష్టాంగం పడ్డాడు.

11

దేశం అల్లకల్లోలంగా ఉంది. ఎక్కడ చూసినా అలజడ్లు. అల్లర్లూను. వజ్రాలవేట సాగిపోతూంది. అనేక అంతర్జాతీయ ముఠాలు దిగాయి. అంతరాష్ట్ర ముఠాలు రంగంలోకి దిగాయి. కండపుష్టిగల ప్రతి గుండాగాడికి చేతినిండా పని. ఏదో ఒక ముఠాలో జేరిపోతున్నాడు. ఈ వజ్రాలవేటలో లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయి. కొబ్బరికాయలల్లే తలలు పగిలిపోతూన్నాయి. మనిషిని చూస్తే మనిషికి అనుమానం! ఇండియాలో జరుగుతున్న అల్లరంతా విక్టోరియా మహారాణిదాకా వొచ్చింది. పార్లమెంటును సమావేశపరచింది. ఇండియాకు ప్రత్యేక అధికారులను పంపించింది. వాళ్ళనే కొరిడీకాయి ఆఫీసర్లని ఇండియాలో పిలిచేవారు. వారు దేశమంతా తిరిగి రాణిగారికి ఒక నివేదికను అందజేసారు. దాని సారాంశం ఇది. వజ్రాల కొబ్బరికాయ దొరికేదాకా అల్లర్లు ఆగవని!

మహారాణిగారు బ్రిటిష్ పార్లమెంట్‌చేత ఒక శాసనం చేయించారు. దానికే కొబ్బరికాయ శాసనమని పేరొచ్చింది.

ఆ శాసనం ప్రకారం ఇండియాలో కొబ్బరికాయ అమ్మకూడదు. కొనకూడదు. కొబ్బరికాయ పీచు తియ్యకూడదు. కొట్టకూడదు. ఇందులో ఏది చేసినా మూడేళ్ళు కఠిన శిక్ష లేక ఆరేళ్ళు విడిఖైదు. రెండవ క్లాజులో ఇంకా ఇలా ఉంది. కొబ్బరికాయ దగ్గరగాని ఇంట్లోగాని ఉంచుకోవడం నేరం. ఈ శాసనం అమల్లోకి వచ్చిన మూడు రోజుల్లోపల ప్రజలు కొబ్బరికాయలు ప్రభుత్వ కొబ్బరికాయ గోదాముల్లో అప్పచెప్పి రశీదులు పొందాలి. ఇందుకు భిన్నంగా ప్రవర్తించిన వారికి ఆరేళ్ళ కఠినశిక్ష, మూడేళ్ళు విడిఖైదు.

ఈ శాసనంతో దేశం అట్టుడికిపోతున్నాది. అప్పుడికింకా గాంధీ పుట్టలేదు. లేకపోతే అప్పుడే కొబ్బరికాయ సత్యాగ్రహం చేసి ఉండేవారు.

అయినా జనం ఖాతరుచెయ్యలేదు. ఒక్క కొబ్బరికాయ కూడా ప్రభుత్వ గోదాములో జమకాలేదు. కొబ్బరికాయ శాసనోల్లంఘనం విరివిగా జరిగిపోతూన్నది.

ఇళ్ళల్లో కొబ్బరికాయల పీచు రహస్యంగా తీస్తున్నారు. కొబ్బరికాయలు పగలగొట్టి తమ అదృష్టాన్ని వెతుక్కుంటున్నారు. పొరుగువాడిక్కూడా తెలియకుండా నేరాన్ని కప్పిపుచ్చుచున్నారు. కొబ్బరి పీచు చిప్పల్ని పొయ్యిలో వేసి కాల్చివేస్తున్నారు. కట్టెపుల్లల అవసరం లేకుండానే అన్నం కూరా ఉడుకుతుంది. కొబ్బరి పిసరంతకూడా లేకుండా తినేస్తున్నారు. పెద్దఎత్తున నిలవచేసిన వాళ్ళు రాత్రిళ్ల రాత్రిళ్ల కొబ్బరికాయలు పీచుతీయించి, కాయలు పగలగొట్టిస్తున్నారు. చిప్పలూ పీచులూ తగలపెట్టించి తినగా మిగిలిన కొబ్బర్ని గొయ్యితీసి పాతేయించుతున్నారు.

సరిగ్గా ఏడువారాలు గడిచేసరికి దేశ ఆర్థిక విధానమే దెబ్బతిని పోయింది. పచ్చి కొబ్బరి తినీ తినీ ప్రజల ఆరోగ్యాలు దెబ్బతిన్నాయి. వంటచెరుకు కొట్టేవాళ్ళకు పని లేదు. ఎవాణా లేదు. కొత్తలారీలు కొత్తకారులూ రోడ్డు మీదకు రావడంలేదు. పూజచేసి కొబ్బరికాయ కొట్టిగాని డ్రైవర్లు కొత్త వాహనాల్ని బయటికి తీయరు. కొట్టాలంటే కొబ్బరికాయ లేదు. శాస్త్రానికి, మొక్కుబడికి కూడా కొబ్బరికాయ కన్పించడంలేదు. గుళ్ళ తలుపులు తెరవటం లేదు. పూజలు లేవు పునస్కారాలు లేవు. మూడువారాలుగా ఒక్క దేముడిముందు టెంకాయ పగల్లేదు. మూడుకోట్ల దేవతలూ లక్షమంది చిల్లరమల్లర దేవుళ్ళకూ ఒక్క పొద్దయిపోయింది! దాంతో దైవభక్తి దైవభీతి తగ్గిపోయింది. పూజారులూ, అర్చకులూ రోడ్డున పడ్డారు. ఆలిండియా అర్చక మహాసభ, ఆలిండియా భక్త సమాజము సభలు జరిపి విక్టోరియా రాణిగారికి విజ్ఞాపన చేసుకొన్నారు. ఏమని? వెయ్యి ఓడల కొబ్బరికాయలు పంపమని! అందుకామె కొబ్బరికాయలు మా దేశంలో దొరికేవికావు. అందుకోసం మలయా, సింగపూర్ సిలోన్లు కొల్లకొట్టాల్సి ఉంటుందని తెలియజేసింది.

కొత్త పరిశ్రమలు నేటికీ ప్రారంభోత్సవాలు జరగలేదు, నిర్మాణం పూర్తయిన మిల్లుల ప్రారంభోత్సవానికి కొబ్బరికాయల్లేక మూతపడి ఉన్నాయి. ఉత్పత్తి తగ్గిపోయింది. అభివృద్ధి కుంటుపడింది.

ఇహ ప్రజల బాధలు చెప్పితే తీరేవిగా లేవు, కొబ్బరి కలశాలు లేక పెళ్ళిళ్ళు ఆగిపోయాయి. పీచు పరిశ్రమలు దెబ్బతిని పనివాళ్ళు రోడ్లమీద పడ్డారు. ఆడవాళ్ళకు బట్టతలలొస్తున్నాయి. కొబ్బరినూనె కరువొచ్చిపడింది. తలకు రాసుకోవడానికి చిటికడంత నూనె దొరకడం లేదు. అడామగా పిల్లాజెల్లా జిడ్డు తలల్తో తిరుగుతున్నారు. జుట్టు జడలుకట్టి పేలు కుప్పలుకుప్పలుగా పెరిగిపోతున్నాయి-

జనం బాధలు ఇలా ఉండగా ఇహ ఆ దేవుళ్ళ బాధలు ఎలా ఉన్నాయంటే-ఆ దేవుడికే తెలియాలి.

ఆలిండియా భక్తసమాజం వాళ్ల 'ఆర్షధర్మ' అనే దైవ్వార పత్రికలో ఓ వార్త వచ్చినట్టు 'నాస్తికధర్మ' పత్రిక ప్రకటించింది.

ఏడేడు పధ్నాలుగు లోకాల దేవుళ్ళు వైకుంఠములో సమావేశమయారట. కైలాసము నుంచి ప్రతినిధులెవ్వరూ హాజరుగాలేదని తెలిసింది. సమావేశం కైలాసంలో జరగాలని కైలాసవాసులు పట్టుబట్టారట. కాని వైకుంఠవాసులు ససేమిరా కాదన్నారట. ఆ కారణంగా కైలాస ప్రతినిధులు తమ నిరసనను తెలియజేస్తూ సమావేశాన్ని బహిష్కరించారట. విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన సర్వదేవుల సమావేశంలో భూలోకంలో తమకు పూజలు పునస్కారాలు జరగడంలేదని మొరపెట్టుకొన్నారట; తీవ్ర వాదోపవాదాలు జరిగాక నేరమంతా విష్ణుమీదనే మోపారని త్రిలోకసంచారి నారదుడు ఆర్షధర్మ పత్రిక ఎక్రెడిటెడ్ కరస్పాండెంట్ హోదాలో తెలియచేశాడట.

విష్ణుమూర్తి రామావతారంలో ఉన్నప్పుడు హనుమంతుడికి కోనసీమలో కోతిగా తిరగమని వరం ప్రసాదించడం కారణంగానే ఇప్పుడు తిప్పలన్నీ వచ్చిపడ్డాయని సర్వదేవతల సభ తీర్మానించింది. హనుమంతుడు మామూలు వానరమై కోతిచేష్టలు చేస్తూ కొబ్బరికాయల్తో ఆడుకొంటూ యీ అనర్థాన్ని తెచ్చిపెట్టాడని నిర్ధారణ చేశారు. వజ్రాలు దాచిన కొబ్బరికాయ దొరికేంతవరకూ; నరమానవుడు దేవుడికి కొబ్బరికాయ కొట్టే అవకాశమే లేదని సభ అభిప్రాయపడింది. ఇదంతా రామభక్త హనుమాన్‌వల్ల వచ్చిన అనర్థమే కాబట్టి విష్ణుమూర్తి వెంటనే కల్పించుకొని హనుమంతుడికి వెంటనే ఆదేశాలు జారీచేయాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆ తీర్మానం ప్రకారం ఇక హనుమంతుడు కొబ్బరికాయల్తో ఆడుకోవడం మానేసి వజ్రాల కొబ్బరికాయ ఏక్కడుందో వెతికి (వజ్రాల కొబ్బరికాయ హనుమంతుడే శివయ్య అనే తన భక్తుడి దగ్గర దాచిపెట్టాడని భూలోకంలో శాశ్వతంగా నివాసమేర్పరచుకొన్న చిల్లరదేవుళ్ళు పెద్ద ఆరోపణ చేశారని అభిజ్ఞానవర్గాల భోగట్టా, ప్రభుత్వానిక, ప్రభుత్వంమీద నమ్మకంలేక ప్రజలకు అప్పగించాలి. తాజావార్త.

సర్వదేవతల సభ తీర్మానాన్ని సత్వరమే అమలు జరపమని కోనసీమలో ఉన్న వానరరూపధారి హనుమంతుల వారికి ఆదేశాలు విష్ణుమూర్తి నుంచి అందాయని ఇంతకు ముందే తెలిసింది. వివరాలకు 'నాస్తిక ధర్మ' వచ్చే సంచిక చూడండి. అంటూ నాస్తికధర్మ విలేఖరి కథనం ముగించేశాడు.

అయితే, అర్థధర్మ పత్రికవాళ్ళు ప్రివీకౌన్సిల్లో నాస్థిక ధర్మ పత్రికమీద పరువునష్టం దావా వేశారని తెలుస్తోంది. తమ పత్రిక ప్రకటించిన కొబ్బరికాయ కథనాన్ని వక్రించి నాస్థికధర్మ పత్రిక ప్రకటించిందని-

12

గూడెంలో గంగమ్మ శివయ్యమీద కారాలు మిరియాలు నూరుతూంది. ఇదంతా నీవల్లే వచ్చింది. ఏడు వారాలైంది బిడ్డ కన్పించక! ఈరాజు సత్తిరాజు మైపోయారో! గంగమ్మ ఊరూవాడా ఏకంచేసేస్తున్నది. పొంగిన గోదావరిలా ఆమె దుఖానికి అంతులేదు. ఇంత జరుగుతున్నా శివయ్య కొబ్బరిబొండాంలో నీళ్ళలా తొణక్కుండా బెణక్కుండా నింపాదిగా ఉన్నాడు. అంతా అంజనేయులోరి దయ అనుకొంటూ నిమ్మకునీరెత్తినట్టు కూర్చున్నాడు. గౌరి ఏమైందో అన్న దిగులుతో నిద్రపట్టక గంగమ్మ అర్థరాత్రిపూట లేచికూర్చుంది. ఇంటి పెరట్లో అలికిడైనట్టనిపించి బయటకొచ్చింది. కొబ్బరి ఆకుల నీడలో నిలబడ్డ ఇద్దరు మనుషులు గంగమ్మను చూసి గోడదూకి పారిపోయారు. గుర్రుపెట్టి నిద్రపోతున్న భర్తను లేపింది గంగమ్మ.

"మనింటిచుట్టూ మనుషులు తిరుగుతున్నారు? నాకు భయంగా ఉంది. ఏందీ గొడవ?" గంగమ్మ అడిగింది.

శివయ్య ఆవలిస్తూ లేచినవాడల్లా భార్యమాటలు వింటూనే ఉలిక్కిపడ్డాడు. చప్పునలేచి భోషాణం తెరిచి ముడుపుగట్టిన కొబ్బరికాయ ఉందో లేదో అని చూసుకొన్నాడు. గంగమ్మ ఆశ్చర్యంగా చూసి అదీ సంగతి అనుకొని తలాడించింది.

"ఏందయ్యా? ఈ కొబ్బరికాయలోనే అవి ఉండాయా?" అన్నది. అవేమిటో చెప్పే ధైర్యం చాలలేదు గంగమ్మకు.

"నోరుముయ్యేశ్! ఇది ఆంజనేయులోరి ప్రసాదం! కళ్ళుపోతాయ్. పాపం మాటలు మాట్టాడకు.

భర్త మాటల్లో ఏదో అంతరార్థం ఉన్నట్టనిపించింది గంకమ్మకు. ఏనాడు భర్త తనతో ఇలా మాట్టాడలేదు. ఉన్నదున్నట్టు కుండ పగలేసినట్లు మాట్టాడేవాడు.

"ఆ కోతి తెచ్చి పడేసిన కొబ్బరికాయేనా?" తెగించి అన్నది గంగమ్మ.

"నీయవ్వ! నీ బుద్ది పోనిచ్చేవుగాదే! ఆంజనేయస్వామిని బట్టుకొని కోతంటావా తప్పుడుముండకానా! కొత్తపడవ నీళ్ళల్లో వేసేటప్పుడు గౌరి చేతుల్లోంచి జారి గోదావరిలో పడింది యీ కొబ్బరికాయానే పిచ్చిముండా!"

"అని ఎట్టా చెప్తావయ్యా?" ఎడంచేతిలో కుడిచెయ్యి గుద్ది అన్నది గంగమ్మ.

"నువ్వూ చూశావుగందే! హనుమంతులోరు సొత్తంగా తెచ్చి పెజలందరూ చూస్తుండగా తెచ్చి నాముందు పడేసింది!"

"ఆకొబ్బరికాయే ఇదని ఎణ్ణ రుజువు?"

"నీయవ్వ! అంజనేయుడికి సాచ్చికం కావాలంటే? అట్టయితే రాములోరే దిగిరావాలి!"

"దిగిరమ్మను?"

శివయ్య కళ్ళెర్ర చేశాడు.

"నీయవ్వ! నీ యవహారం శానాదాకా వచ్చిందే?"

"నా యవ్వారంకేంగాని నీ ఇంటిచుట్టూ తిరుగుతున్నోళ్ళను చూసుకో!" అని చిరబురలాడుతూ గంగమ్మ వెళ్ళి మంగమెక్కి ముసుగుతన్నిపట్టింది.

అసలు సంగతి అప్పుడు బుర్రకెక్కింది శివయ్యకు.

ఈ బోషాణంలో దాచిన కొబ్బరికాయలోనే... శివయ్యకు వణుకుపుట్టింది. గుండెలు గుబగుబలాడాయి.

మూడుకోట్ల రూపాయల విలువైన వజ్రాలు - శివయ్య మెదడు బండపారిపోయింది.

ఇవి కాజేయడానికేనా తన ఇంటిచుట్టూ వీళ్ళు తిరుగుతుంది?

"గంగీ లేవే!" పెళ్ళాన్ని కొట్టి లేపాడు.

"వజ్జిరాలు! వజ్జిరాలు!" పలవరిస్తూ లేచికూర్చుంది గంగమ్మ.

"ఉష్! గోడకు చెవులుంటయ్!" హెచ్చరికగా అన్నాడు శివయ్య.

భోషాణం తెరిచి కొబ్బరికాయ తీసి తలగుడ్డ పరిచి మూటకట్టాడు శివయ్య.

"మనం ఈ కొబ్బరికాయ ఇంట్లో పెట్టుకొని ఇంకా ఇక్కడే ఉంటే పీకలమీదకొస్తుంది. ప్రాణాలకే ముప్పు. లేలే!"

"యీ అర్థరాత్రిపూట ఎక్కడికి పోతావయ్యా?" గంగమ్మ అయోమయంగా అన్నది.

"ముందు నువ్వు బయల్దేరవే గంగీ?" కసురుకొన్నాడు శివయ్య.

"గవర్నమెంటోళ్ళకిచ్చేస్తావా?"

"సాములోర్నడిగి ఆరెట్టా చేయమంటే అట్టా చేద్దాం!"

"ఏట్టెట్టా?" మొగుడికి మతేమన్నా పోయిందా అన్నట్టు. చూసింది గంగమ్మ.

"ఇంత రాత్రిపూట ఎక్కడకెళ్ళి దాక్కుంటావయ్యా?" గంగమ్మ శివయ్య చెవులో నోరుపెట్టి అడిగింది.

"ఇల్లికంటే గుడి పదిలం అన్నారే! రాములోరి గుళ్ళో తెల్లార్చుకుందాం పద." గుడ్డలో చుట్టిన కొబ్బరికాయ చంకలో పెట్టుకొని పెళ్ళాంతో బయలుదేరాడు శివయ్య. రహస్యంగా తాటితోపు తుమ్మలబీడు దాటుకొని గుడి వెనక్కొచ్చారు...ప్రహరీగోడల నీడల్లో నక్కినక్కి మెల్లి మెల్లగా గుడిలోకి చేరారు.

"ఈ కొబ్బరికాయలో ఉంది వజ్రాలేనంటావా!" రహస్యంగా అడిగింది గంగమ్మ, భర్త పక్కన చతికిలబడి కూర్చుంటూను.

"అది ఆ భగవంతుడికే ఎరుక?" గర్భగుడివైపు తిరిగి రెండుచేతులూ జోడించి చెప్పాడు శివయ్య,

"ఏందో? నువ్వొక్కటీ సరిగా చెప్పవుగందా?" నిట్టూర్చింది గంగమ్మ.

"ఓసెర్రిమొగమా? మన పడవ బయలుదేరిన రాత్రి గుర్తుందా? తెల్లవారుజామున లేచి బయటికెత్తుంటే ఎక్కడికని అడిగావు!"

"రాములోరి గుడిదగ్గర కెళ్తావన్నాని చెప్పావుగా!"

"ఇంత రాత్రిపూటేంపని అని అడిగావా?"

"అడిగాను. అయితే?"

"ఏమని చెప్పాను?"

ఓ క్షణం గుర్తుచేసుకొని గంగమ్మ చెప్పింది.

"నిద్దర పట్టటంలేదు. గౌరితల్లిమీదే మనసంతాను, గుడికెళ్ళి రాములోర్ని మేలుచెయ్యమని మొక్కుకొందామని గదా ఎళ్ళావు?"

శివయ్య గుబురుమీసాలకింద సన్నగా నవ్వుకొన్నాడు.

"ఏందయ్యా మాట్టాడవు. అంతేనా?"

"అసలు సంగతి అదికాదే! ఆడదాని నోట్లో నువ్వుగింజ నానదని నీకు చెప్పలేదు. ఆ రాత్రి ఆంజనేయసామి కలలో కన్పించి, రాములోరి గుళ్ళో పడుకొన్న సన్యాసి తలకింద ఒక కొబ్బరికాయ ఉందనీ దాన్ని తీసుకొని, నీ దగ్గరున్న కొబ్బరికాయ వాడి తలకింద పెట్టమని చెప్పాడు సామి. ఎళ్ళి సూత్తును గదా, నిజంగా సన్నాసి కొబ్బరికాయ తలకింద పెట్టుకొని గుడి ఎనకాల పడుకొని ఉన్నాడు. కొబ్బరికాయలు మార్చి సడీసప్పుడూ గాకుండా ఇంటికొచ్చేశాను."

"సిత్రంగా ఉందే? తలకాయలు మారుస్తారని ఇన్నాముగాని కొబ్బరికాయలు మారుస్తారని ఇన్లేదు!" బుగ్గ నొక్కుకుంది గంగమ్మ!

"ఓసి ఎర్రిపీనుగా! అది హనుమంతుడి ఆజ్ఞే!"

"సుగ్రీవాజ్ఞ అని ఇన్నానుగాని హనుమంతుడి ఆజ్ఞ అని నేను ఇన్లేదు?" కళ్ళు తిప్పింది గంగమ్మ!

"అయితే ఇప్పుడిన్నావుగా. ఇహ నోరు మూసుకో! సప్పుడు చెయ్యకుండా పడుకో!"

"ఇంకా ఆవేశం ఎందుకయ్యా? కొబ్బరికాయ పగలగొట్టి సూడు. వజ్రాలున్నాయేమో?" గొంతు తగ్గించి గుసగుసలాడింది.

"కళ్ళుపోతయ్యే గంగీ! ఆంజనేయసామే కల్లోకొచ్చి ఏం చేయాలో శలవిస్తారు. ఆ సామి చెప్పినట్టే చేయాలి. ఈ కొబ్బరికాయ వారిది. కాయ ఆంజనేయసామిదైతే అందులో కొబ్బరి ఆరిదే, నీళ్ళు ఆరివే, వజ్రాలు ఆరియ్యేనే ఎర్రిదానా?"

మొగుడివంక అనుమానంగా చూసింది గంగమ్మ! ముసలాడేదో తనను మాయజేస్తున్నాడు. ఆంజనేయసామి కలలోకి రావడమేమిటి? కాయలు మార్చడం ఏమిటి? విడ్డూరం గాకపోతే! ముసలాడేదో దాస్తున్నాడు! నిజంగా హనుమంతుడు కల్లోకొచ్చి యీ కొబ్బరికాయ గవర్నమెంటోళ్ళకు ఇయ్యమంటే? ముసలాడు చాధస్తుడు. అంతపనీ చేస్తాడు. మూడుకోట్ల రూపాయల విలువైన వజ్రాలని జనం గుంపులుపడి ఆగుబ్బుగా చెప్పుకోవడం తను విన్నది. అసలు ఇన్నిటికీ కాయలో వజ్రాలున్నాయా?

భర్త నిద్రపోయాక ఆ సంగతేదో తేల్చుకొందామని నిర్ణయించుకొన్న గంగమ్మ నిద్ర ముంచుకు వస్తోన్నట్టుగా వట్టొట్టి ఆవలింతలు చేసింది. కళ్ళు అరమూతలువేసి పక్కనే మేనువాల్చిన భర్తను దొంగచూపులు చూస్తూ పడుకొన్నది గంగమ్మ.

శివయ్య గురక మానేసి "వచ్చావా సామీ. దణ్ణం. దణ్ణం" అని కలవరిస్తున్నాడు. ఇదే అదననుకొని గంగమ్మ భర్త తలకింద ఉన్న కొబ్బరికాయను సంగ్రహించి అడుగులో అడుగులేస్తూ తిరిగి తిరిగి చూస్తూ గుడి వెనక్కి చేరింది,

గుడి వెనక గొంతుకూర్చుని కొబ్బరికాయ ముందేసుకొని పీచుతీయడానికి ఉపక్రమించిన గంగమ్మ ఎదురుగా నిలబడ్డ నిలువెత్తు మనిషిని చూసి అమాంతం వెనక్కిపడి గుడ్లు తేలవేసింది తెప్పరిల్లుకొని లేచి అరవడానికి ప్రయత్నిస్తున్న గంగమ్మ నోటికి చెయ్యి అడ్డంపెట్టి "నేనే సత్తిరాజును, అరవమాక!" అన్నాడు.

"ఒరే సత్తిగాడా! నువ్వా! గౌరేదిరా?" అని అడిగింది గంగమ్మ. పాపం తల్లి మనసు గదా!

"పటాకుల రత్తయ్యముతా చేతుల్లో ఉండిపోయిందే గంగమత్తా?"

"అయ్యో నా కూతురా!"

"ఉష్ ఉష్! ఊరుకో వింటారు. గుడిచుట్టూ రత్తయ్యముతా కాపేసి ఉంది. బయట కార్లో గౌరిని కట్టిపడేసి ఉంచారు. ఈ కొబ్బరికాయ వాళ్ళకప్పచెప్పితే గౌరిని వదిలేస్తారు. ఆ వొప్పందంమీదే ఆళ్ళను ఇక్కడికి తీసుకొచ్చా. ఇచ్చేయ్ ఆ కొబ్బరికాయ!

"ఇది దేముడిచ్చిన కొబ్బరికాయ మీ మామయ్య ఒప్పుకుంటాడా?" సత్తిరాజు ముఖంలో ముఖంపెట్టి మెల్లగా అన్నది.

"గౌరికంటే ఎక్కువంటావా ఇది? ఇది వాళ్ళ చేతుల కందకపోతే గౌరి మనకు దక్కదు. గొంతు పిసికి గుడి ముందు పారేస్తారు. నీకూ నాకూ మామయ్యకూ చావు తప్పదు."

"వజ్రాలు!"

"మూడొందలు వజ్రాలయితేమాత్రం మన గౌరికంటే ఎక్కువేందే? ముష్టి మూడొజ్రాలు! జాగుచేశావంటే రత్తయ్యముతా లోపలకొచ్చేస్తారు. ఆళ్ళను పోలీసులు వెంబడిస్తున్నారని తొందర్లో బయటనిలబడ్డారు. ఆలీసం చేశావంటే ఆళ్ళు తెగించి లోపలకొచ్చేస్తారు. ఆ తర్వాత మనం చేసేదేమీ ఉండదు. తే.తే," అంటూ సత్తిరాజు గంగమ్మ చేతుల్లోంచి కొబ్బరికాయ లాగేసుకొన్నాడు.

"ఏందిరా నీ యమ్మ ఇంత సేపు!" ఇద్దరు దృఢకాయులు గుడిప్రాకారపు గోడలు దూకి లోపలకొచ్చారు.

"ఇదిగో కొబ్బరికాయ! "సత్తిరాజు చూపించాడు. ఇద్దర్లో కోలముఖంగాడు చెయ్యి ముందుకు చాచాడు.

సత్తిరాజు చప్పున కొబ్బరికాయ ఉన్న చెయ్యి వెనక్కి తీసుకొన్నాడు.

"ముందు గౌరిని వదలండి! తర్వాతే కొబ్బరికాయ!" సత్తిరాజు వెనక్కు వెనక్కు నడిచాడు.

"అమ్మ కంత్రీ నాకొడకా! వదులుతాం. వదులుతాంరా!" అంటూనే మీదమీదకొచ్చారిద్దరూ.

"మీ ఒప్పందం ఏంటిరా? ఇప్పుడు మీరు మాట్లాడేంది?"

"రేయ్, మమ్మల్నే బిత్తరకొట్టాలని చూస్తున్నావా దాన్నొదిలేసి మేమిటు వెళ్ళగానే పోలీసోళ్ళను తీసుకురావాలని చూస్తున్నావు గదరా! కొబ్బరికాయ సముద్రం దాటి వెళ్ళేంతవరకూ గౌరి మా దగ్గరే ఉండాలి. ఈ సంగతి

Deepavali Greetings from

ROHINI ENTERPRISES

Printers' Providers, Stationers & General Suppliers

2-1-340/6, Nallakunta, University Road,
HYDERABAD-500 044.

Phone : 65813

Main Distributors for A.P.

"COATES" Priting Inks, Madras
and
"COATES" Champion Press Aids
(Roller wash, Blanket wash, Stop-oxy, Blanket Rejuvenator, Blanket Insta-Revive etc.)
&
"UNITED" Printing inks, Bombay

బయటికి పోక్కొందో పిల్లముండ ప్రాణాలు దక్కవ్. తెలిసిందా! తే. ఇటియ్యి," పొత్రంముఖమాడు ముందునుంచి సత్తిరాజుమీద పడ్డాడు. వెనకనుంచీ రోకలి మొఖంగాడు కమ్ముకొన్నాడు.

"సత్తిరాజూ! ఇచ్చావంటే గౌరి మనకు దక్కదు!" గుడి కుడిపక్కనుంచి కేక విన్పించింది.

"ఈరాజూ!" సంభ్రమాశ్చర్యాలతో అరిచాడు.

రెప్పపాటులో సత్తిరాజు చేతిలో ఉన్న కొబ్బరికాయ గాల్లోకి లేచి ఈరాజు చేతుల్లో వాలింది. సత్తిరాజును వదిలేసి ఈరాజుమీద పడ్డారు పొత్రంగాడు, రోకలిబండగాడు.

ఈరాజు, సత్తిరాజు చేతుల్లో బంతిలా ఎగురుతున్నది కొబ్బరికాయ.

తెలతెలవారుతోంది.

కొబ్బరికాయను ఒకరిచేతుల్లోంచి మరొకరి చేతుల్లోకి విసురుకొంటూ గుడిచుట్టూ తిరుగుతున్నారు సత్తిరాజు, ఈరాజు. లోపల జరుగుతున్న అల్లరి విని బయటఉన్న రత్తయ్య ముఠా - ఐదారుగురుదాకా ప్రహరి దూకి లోపలకొచ్చారు. శివయ్య లేచాడు. తలకింద కొబ్బరికాయ లేకపోవడం చూసి గాభరాపడ్డాడు. గాల్లో ఎగురుతున్న కొబ్బరికాయను, దానికోసం పరుగులుతీస్తున్న మనుషుల్ని చూసి తత్తరపోయాడు! గుడిమెట్లు దిగివచ్చిన శివయ్యకు సత్తిరాజు, ఈరాజు కన్పించారు.

"గంగమ్మత్తా!" ఈరాజు కొబ్బరికాయ విసిరాడు మీదబడ్డ ముగ్గురి మనుషులకు అందకుండా. ఈరాజును వదిలేసి గంగమ్మమీద పడ్డారు వాళ్ళు.

"గంగీ!" అరిచాడు శివయ్య.

మరుక్షణంలో కొబ్బరికాయొచ్చి శివయ్య చేతుల్లో వాలిపోయింది.

"సామీ! నీ కొబ్బరికాయ నీకే ఇస్తున్నా! అందుకో! ఆంజనేయా!" కొబ్బరికాయ గుడిమీదకు విసిరాడు శివయ్య.

గుడి గోపురంమీద నిద్రపోతున్న కోతి లేచి కూర్చున్నది. పళ్ళు బిగించి కిచకిచలాడింది. నోరు తెరిచి కవ్వింపుగా చూసింది. గుడిమీద చెక్కిన రాములోరిబొమ్మ కాళ్ళ దగ్గర ఇరుక్కుపోయిన కొబ్బరికాయను అందుకొన్నది.

రత్తయ్య మనుషులు గుడి ఎక్కి పాకుతున్నారు. ఈరాజూ. సత్తిరాజూ వాళ్ళ కాళ్ళు పట్టుకొని కిందకు గుంజుతున్నారు.

శివయ్య, గంగమ్మలను ఇద్దరు మనుషులు పెడరెక్కలు విరిచి పట్టుకొన్నారు.

With good wishes from

NORMAN & COMPANY

Printers' Providers & Manufacturers' Representatives

11-6-872/2, Baig Island, Lakdi-Ka-Pul,
HYDERABAD - 500 004.
Phone : 36125

Sole Selling Agents in Andhra Pradesh for

M/s. Norton & Co., Spartan Type Foundry, Madras-12

(The Largest Type Foundry in the World)

Printsuper Automatic Letter Press : Size : 18" × 24.2"
Commander Automatic Letter Press : Size : 18" × 27½".
Sond Printing, Heavy Duty Punching Machines & Cutting Machines
Balvant Art Treadle Machine : Size : 10¼×15¼" and 12¼×18¼"

Asian Single Colour Offset Machine

"Service after sales is our main motto".

కోతి కొబ్బరికాయ లంకించుకొని రాములోరి పెద్దగుడి మీదనుంచి సీతమ్మోరి చిన్న గుడిమీదకు, సీతమ్మోరి చిన్న గుడిమీదనుంచి లక్ష్మణస్వామి బుల్లి గుడిమీదకు అక్కడ్నుంచి ఆంజనేయుడి గుడిమీదకు దూకుతూ రత్తయ్యముఠాను మూడుచెరువులు నీళ్ళుతాగించి ముప్పతిప్పలు పెట్టి ముప్పందుల కోనసీమ జీళ్ళు తినిపించింది.

విసిరి వేసారిన రత్తయ్య కత్తితీసి విసిరాడు, అదిచూసి శివయ్య "సామీ. ఆంజనేయసామీ?" ఎలుగెత్తి అరిచాడు. ఆ కేకకు ఎగిరి గంతేసిన కోతి కత్తిదెబ్బ తప్పుకొన్నది। కత్తి గోపురానికి తగిలి గిరగిరా తిరిగొచ్చి అది విసిరిన రత్తయ్య మెడమీద పడింది। మెడ తెగి రక్తం బొలబొలా కారుతోంది. రత్తయ్య మనుషులు కోతిమీదకు విసురుతూన్న రాళ్ళు రప్పలు వదిలేసి, మెడతెగిన కోడిలా కిందబడి గిలగిలా కొట్టుకొంటున్న రత్తయ్యను భుజాన వేసుకొన్నారు.

ఇంతలో ప్రాకారం బయటనుంచి పోలీసు ఈలలు విన్పించాయి, భుజాలమీద కెత్తుకున్న రత్తయ్యను అక్కడే పారేసి రత్తయ్య మనుషులు ప్రాకారం పాకసాగారు.

పారిపోతున్న రత్తయ్యముఠాను తరిమితరిమి పట్టుకున్నారు పోలీసులు.

ఈశ్రరాజు, సత్తిరాజు వెళ్ళి కారు వెనకసీట్లో కట్టిపడేసి ఉన్న గౌరిని కట్లువిప్పి తీసుకొచ్చి శివయ్య దంపతుల ముందు నిలబెట్టారు.

గోపురంమీద కంచుశిఖరాల మధ్య కొబ్బరికాయ వళ్ళో పెట్టుకొని తాపీగా కూర్చున్న కోతి కిందఉన్న ఎర్రబట్టల్ని కొత్తగా చూసి వింతగా కిచకిచలు చేసింది.

రత్తయ్యముఠాను పట్టుకోవడానికి స్వయంగా వచ్చిన జిల్లా పోలీసు అధికారి యీశ్రరాజును, సత్తిరాజును అభినందించాడు.

ఆ కోతి దగ్గరున్న కొబ్బరికాయ తెచ్చిఇస్తే సర్కారుచేత పెద్ద ఈనాం ఇప్పిస్తానని ఆశపెట్టాడు. "దొరా। అది మావల్ల కాదు". అన్నారు ఈశ్రరాజు, సత్తిరాజు కూడబలుక్కున్నట్టు.

"దొంగలయితే దొరికారు - కాని అసల్ది కొబ్బరికాయ దొరక్కపోతే ముప్పైరోజులుగా దేశమంతా గాలించిన మా శ్రమ వృధాపోతుంది।" అని చుట్టూ నిలబడిఉన్న పటాలాన్ని చూశాడు.

"ఇక్కడ్నుంచి కోతి తప్పుకుందో మీ కొలువు ఊడిపోతాయ్। జాగ్రత్త! చుట్టూ కమ్మండి. కొంతమంది బయటికెళ్ళి చెట్టూపుట్టా దగ్గర నిలబడండి. ఈ కోతి ఎక్కడికెళుతుందో చూస్తా!" నడుము బిగించి యుద్ధానికి సన్నద్ధమౌ

With best compliments from

MADRAS ENAMEL WORKS LIMITED

158, Sydenhams Road, MADRAS-600 003

Manufacturers of :

Permanent Vitreous Enamel Publicity Signs, Hospital Wares, Utility Wares, Industrial Reflectors, Acid Resistant Vessels, specially designed for Chemical and Allied Industries.

Your enquiries solicited

Grams : "ENAMELSIGN" **Phone : 32346**

తున్న వీరుడిలా శిఖరాగ్రాన కూర్చున్న కోతివైపు చూశాడు. కోతి చంకలు గోక్కొని వెక్కిరించింది. అధికారికి వళ్ళు మండిపోయింది.

ఓ పదిమందిదాకా గోపురం ఎక్కసాగారు. సగంమంది మధ్యదాకా వెళ్ళి ఆగిపోయారు. ఓ నలుగురు మూడొంతులు ఎక్కి అటుపైకి వెళ్ళలేక, ఇటు కిందకు దిగలేక అక్కడే ఉండిపోయారు. ఎట్టకేలకు ఒకడు శిఖరాగ్రం చేరాడు. కింద నుంచి పటాలం అంతా హర్షధ్వానాలు చేసింది! ఆ జవానుకు డబుల్ ప్రమోషనా, త్రిబుల్ ప్రమోషనివ్వాలా అని అప్పుడే ఆలోచిస్తున్నాడు! అంగుళం అంగుళం పాకుతూ కలశాలను సమీపించాడు. ఒక కలశాన్ని ఆనుకొని రెండోకలశాన్ని తన్నిపట్టి కొబ్బరికాయ వళ్ళోపెట్టుకొని దర్జాగా ఠీవిగా కూర్చున్న కోతి ఒక్కసారి లేచి, కొబ్బరికాయతో పైకి వస్తున్న వాడి తలకాయమీద మొత్తింది.

గోపురంమీదనుంచి గిరగిరా దొర్లుకుంటూ కిందబడ్డాడు జవాను. నడుములు విరిగిపోయాయి. తల కొబ్బరికాయ పగిలి నట్టు మధ్యకు పగిలింది!

పోలీసు అధికారి రుద్రుడైపోయాడు. వళ్ళు తెలియని కోపంతో రివాల్వర్ తీసి 'ఎటన్‌షన్' అని అరిచాడు.

"టక్ టక్" పటాలం మొత్తం ఒక్కసారిగా చేసిన బూట్ల శబ్దంతో దేవాలయ ఆవరణంతా నిండిపోయి గోపురం ప్రతి ధ్వనించింది.

గుడిచుట్టూ వలయాకారంలో నిలబడి తుపాకులెక్కుపెట్టి ఆజ్ఞలకోసం ఎదురుచూస్తూ నిలబడ్డారు జవాన్లు.

"రడీ! షూ-"

"దొరా! ఆగు! అపరాధం. అపరాధం! ఆంజనేయసామి! సాచ్చాత్తూ హనుమంతులోరు ఆయన!" శివయ్య ఆక్రంద నకు గుడిలో ఉన్న రాములోరి రాతివిగ్రహం కరిగిపోయి ఉండాలి!

లబలబలాడుతూ తుపాకులకు అడ్డంపడ్డాడు. కోతిని చంపొద్దని అధికారి కాళ్ళుపట్టుకొన్నాడు శివయ్య.

"అయితే ముసలాడా! కోతిని చంపను గాని కోతిదగ్గ రున్న కొబ్బరికాయ తెచ్చిస్తావంటరా?" వెటకారంగా అన్నాడు పోలీసాయన.

"ఔ! దొరా- తెచ్చిస్తా!"

తుపాకిగుండు తగిలినట్లయిపోయాడు జిల్లా అధికారి.

"ఏంరా! ముసలోడా! నాటకమాడుతున్నావా? వళ్లు చీరేస్తా లే అడ్డంలే!" గర్జించాడు సూపరింటెండెంటు.

"సత్తెపెమాణంగా చెప్తున్నా దొరా—నే నడిగితే ఆంజనేయసామి తప్పకుండా ఇస్తాడు. ఆరోజు అడగందే ఇచ్చిన సామి ఇయ్యాల అడిగితే ఎందుకియ్యడు దొరా! నా మాట నమ్ము!" కాళ్ళావేళ్ళాపడి ప్రాధేయపడ్డాడు శివయ్య.

"అడగందే ఇచ్చాడా?" యస్పీ టోపీతీసి తల రుద్దు కొన్నాడు. శివయ్య ముఖాన్ని పరిశీలించి చూశాడు. కళ్ళల్లోకి అనుమానంగా చూశాడు.

ఈ కోతి వీడి పెంపుడుకోతే! సందేహంలేదు. ఈ కోతిని అడ్డంపెట్టుకొని ఎంత నాటకం ఆడాడు. దేశాన్ని అల్లి కల్లోలం చేసేశాడు. అంతర్జాతీయ వజ్రాల దొంగలముఠాకు ఆలిండియా ఏజెంటు వీడే! సందేహం లేదు. దొరికాడు నా కొడుకు. ముసలినక్క! ఈ దెబ్బతో డబుల్ ప్రమోషన్ ఐ.జి.పి...

"నా మాట నమ్మ దొరా!"

రాబోయే ప్రమోషన్ను ఊహించుకుంటూ ఏదోలోకంలో ఉన్న యస్పీ ఉలిక్కిపడ్డాడు.

"నీ మాటే నమ్ముతున్నాను. ఓరే ముసలోడా! మాట తప్పావో?"

"తుపాకే సేయ్ దొరా! నా తల కోసి నీ కళ్ళముందు పెడతా!" శివయ్య శబదం చేస్తున్నట్టన్నాడు.

"ఆరంమ్స్ డౌన్! ఎటీజ్!"

పటాలం మళ్ళా ఒక్కసారిగా తుపాకులు దించి కాళ్ళు ఎడంగా పెట్టి నిలబడ్డారు.

శివయ్య పైపంచతో ముఖం తుడుచుకొని నిట్టూర్పు విడిచాడు.

వీడే సన్యాసిని చంపించిందికూడా యీ ముసలాడే అయి ఉంటాడు. కూతుర్ని అడ్డంపెట్టి మేనళ్ళులిద్దరిని కొబ్బరి కాయ దాటేయడానికి ప్రయత్నించాడు. పందెం-పడవా అంతా హంబక్. ఈ తెలివితేటలన్నీ వీడి కెక్కడ్నుంచి వచ్చాయో! పేగియాస్ అన్న అంతర్జాతీయ ముఠావాళ్ళవే అయిఉండాలి. పర్‌ఫెక్ట్ క్రైం? రెండో ముఠా అడ్డం తగిలే సరికి పడవ ముంచేసి కొబ్బరికాయ కోతి కిచ్చాడా?-తన ఆలోచనలో మళ్ళీ ఇక్కడే ఏదో లింకుపోయినట్టయి, టోపీ చమట తుడిచి నెత్తిన పెట్టుకొన్నాడు యస్పీ. ఇంతకీ యీ వజ్రాల వేటలో ఉన్న ముఠాలు రెండా-మూడా? ఈ ముస లోడిని ఆ కుర్రనాకొడుకుల్ని బొక్కలో తోసి నాలుగు ఉతికితే అంతా వాళ్ళే చెప్తారు. ముందీ కొబ్బరికాయ దొరక నీయ్. మెయిన్ ఎక్జిబిట్ ఇదే! ఇది లేకపోతే అసలు కేసుకు ఆధారమే లేదు. అందుకే ముందీ కొబ్బరికాయ చేతిలో పడనీయ్-తనకు తనే చెప్పుకొన్నాడు యస్పీ.

"ఒరే ముసలోడా నీ పేరేంటన్నావ్?"

"శివయ్య."

"ఒరే శివన్నా! నీ పడవకథ నీ కూతురిపెళ్ళి కథా-నీ కథంతా మా సి.ఐ.డిలు ఎప్పుడో రిపోర్టు చేశార్రా. నాకంతా తెలుసు! పిచ్చిపిచ్చి వేషాలు వెయ్యకుండా కొబ్బరికాయతో పాటు కోతినికూడా అప్పచెప్పాలి. తెలిసిందా?"

"దొరా!" బాధతో శివన్న మెలికలు తిరిగిపోయాడు. "కొబ్బరికాయుంచుకొని..."

"హార్నీయమ్మ. కోతిని వదిలేయమంటావా? అది ఎక్స్యూజుడ్ నంబరు టూరా అది! కోతిని హాజరుపరచక పోతే కోర్టు కేసు కొట్టేస్తదిరా. అందుకని కోతి ముఖ్యం. అవసరమైతే నిన్ను అప్రూవర్‌గా తీసుకుంటామ్? ఏమంటావ్..."

యస్పీ మాట్లాడిందేమీ అర్థంకాలేదు శివయ్యకు. అయోమయంగా చూశాడు.

"దొరా. అది కోతిగాదు. ఆంజనేయసామి చూడు దొరా!" అంటూ శివయ్య తల పైకెత్తి రెండు చేతులు జోడించి "సామీ ఓ ఆంజనేయసామీ ఇక నావల్ల కాదు. నిన్ను నువ్వే కాపాడుకోవాలి!" అన్నాడు.

తల పైకెత్తి చూస్తున్న యస్పీని గోపురాగ్రాన కూర్చున్న కోతి గుర్రుగా చూసి 'ఊఁ ఊఁ?' అంటూ గూపులు చేసింది!

కోతికేసి కన్నార్పకుండా చూస్తోన్న యస్పీకి కళ్ళు బైర్లుకమ్మి తల తిరిగిపోయింది.

దయ్యంపట్టి చిందులు తొక్కుతున్న పెళ్ళాం కళ్ళ ముందు కదిలింది. 'శ్రీరామాంజనేయం ప్రసన్నాంజనేయం' అంటూ భూతవైద్యుడు పెళ్ళాన్ని వేపమండలతో చితక బాదే దృశ్యం- ఆ తర్వాత ఆవిడ సొమ్మసిల్లి, తేరుకొని ఆంజనేయుడి ఫొటోకి కొబ్బరికాయ కొట్టే దృశ్యం సురభి వాళ్ళ నాటకంలో వైరువర్కులా కన్పించింది. యస్పీగా పిలవబడుతూ యూనిఫాంలో ఉన్న అసలు మనిషి సుబ్బారాయ నామధేయుడు బయటికొచ్చాడు. చేయిఎత్తి దండం పెట్టడానికి నామోషీ అయి టోపీతీసి చేత్తోపట్టుకొని ఇన్ ఆనర్ ఆఫ్ మంకీ గాడ్ శాల్యూట్ చేశాడు.

నాలుగువేల సంవత్సరాల భారతీయ సంస్కృతి నూరేళ్ళ పాశ్చాత్య నాగరికం ఘర్షణపడ్డాయి ఆ క్షణంలో.

అది చూసిన జవాన్లు తుపాకిలెత్తి పట్టుకొని పటాపట్ కటాకట్ చేసి శాల్యూట్ కొట్టారు. కొబ్బరికాయ కాళ్ళ మధ్య ఇరికించుకొని రెండు చేతుల్తో చంకలు గోక్కుంటూ కోతి వందనస్వీకారం చేసింది.

తనను తాను తెలుసుకొని బిత్తరపోయాడు మనిషి. సుబ్బారాయుడ్ని యూనిఫారంలోకి తొక్కేసి యస్పీ బయటికొచ్చాడు.

"ఎటన్‌షన్!"

పటాపట్ కొట్టి నిలబడింది పటాలం మళ్ళీ.

"రేయ్! ముసలోడా! ఏందిరా మంత్రమేస్తున్నవా మంత్రం! డొక్క చీరేస్తా. ముందా కొబ్బరికాయ దించు. దించూ!" రంకెలువేశాడు యస్పీ.

"అట్టాగే దొరా! తవఁరొక్కరే ఈడుండి జవాన్లందరినీ బయటికి పంపించండి."

"అమ్మ కేటునాకొడకా! అందర్నీ బయటికి పంపించి నన్ను ఏమార్చుద్దామనుకొంటున్నావా?" సుబ్బారాయుడ్ని తొక్కేసి యస్పీ అన్నాడు.

"దొరా! నీ దగ్గర పిస్తోలుంది. నీకేటి భయం?" శివయ్య ముఖంలోకి అదోలా చూసి యస్పీ పటాలాన్ని ప్రాకారం బయటికి పొమ్మని అర్డరిచ్చేశాడు. పటాలం లెఫ్ట్‌రైట్ మార్చి చేస్తూ వెళ్తూంటే కలశాలమీద హనుమంతయ్య ఉయ్యాల లూగాడు.

"సామీ! ఆంజనేయసామీ. అంతా చూశావుగా!" రెండు చేతులూ జోడించి పైకెత్తి దణ్ణంపెట్టూ శివయ్య విన్నవించుకొన్నాడు. "నువ్వు రాములోరి బంటువు. నేను నీ బంటుని! దయుంచి ఆ కొబ్బరికాయ దయచేయి సామీ!"

'ఆకాశమునుండి శంబుని శిరంబు నుండి' అన్నట్టుగా దొర్లుకుంటూ పొర్లుకుంటూ గుడిగోపురాగ్రంనుంచి భూమ్మీదకు వస్తూన్న-

కొబ్బరికాయ

ను చూసినవాడై శివయ్య ఏమాటన్నాడయ్యా అంటే-

"శ్రీమద్ రమారమణ గోయిందో హరి!

రామభక్త హనుమాన్‌కు జై!

వాలి కేత సామికీ జై! "తన్మయుడైపోయిన శివయ్య రెండు చేతుల్తో కొబ్బరికాయను పట్టుకొని కళ్ళకు అద్దుకొన్నాడు.

13

సభాప్రాంగణం కిటకిటలాడిపోతూంది. దేశం నలుమూలల్నుంచీ జనం వచ్చారు. దేశవిదేశాల నుంచి ప్రతినిధులొచ్చారు. విక్టోరియా రాణిగారి ప్రత్యేకదూత వేదిక మీద ఆశీనులై యున్నారు ఆయన పక్కనే విదేశాంగ మంత్రి కూర్చున్నాడు ఐరోపా రాయబారులు, ఆఫ్రికా దేశాధిపతులూ, ఆసియా వాణిజ్య వ్యవహారాల మంత్రులూ, అమెరికా దేశీయాంగ మంత్రి సి ఐ.ఏ బాసూ. ప్రివీకౌన్సిల్ సభ్యులూ, న్యాయమూర్తులూ, ఇన్‌టర్‌పోల్ అధికారులూ

వేదికమీద కొలువుతీరి ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న ప్రముఖ పత్రికల ప్రత్యేక విలేఖరులూ, ఎక్కువగా కొనబడి చదవబడే పత్రికల ఎడిటర్లూ, కొనకుండా ఎక్కువగా చదవబడే పత్రికల యజమానులూ యజమానురాళ్ళూ వేదికకింద మూడు వరుసల్లో కూర్చున్నారు. ఐ.జీలు వేదికమీద డి.ఐ.జీలు వేదికచుట్టూ యస్పీలు యస్సైలు జనం మధ్య. పోలీసువాళ్లు జనం వెనక నిలబడి ఉన్నారు. కదిలితే నొక్కేసేట్టు మనిషికొక్క పోలీసోడు. కనీవినీ ఎరుగని బందోబస్తు.

ఠంచనుగా నిర్ణీత సమయానికి యస్పీ డబ్బారేకుల సుబ్బారాయుడు సీలువేసిన చిన్నసైజు భోషాణంలాంటి ఉక్కుపెట్టెను స్పెషల్ సెక్యూరిటీ కమాండోలు వెంట రాగా, వేదికమీదకొచ్చి రాణిగారి ప్రత్యేకదూత ఆనాటి ముఖ్య అతిథి అయిన సర్ లాంగ్‌కోట్ ముందుంచాడు. ఫొటోగ్రాఫర్లు తోసుకుతోసుకొని క్లిక్కులు కొట్టూంటే వేదిక మెరుపుల్తో ధగధగలాడిపోయింది!

సర్ లాంగ్‌కోటుగారు ఐదు నిముషాలపాటు పారిస్ మ్యూజియంలో మాయమైన వజ్రాల విశిష్టతను, ప్రాముఖ్యతను గురించి చెప్పి వజ్రాల దొంగలముఠాను పట్టుకోవడానికి దేశవిదేశాల పోలీసు అధికారుల కృషిని ప్రశంసించి జూలూడిపోయిన సింహంమల్లే సభను పర్యావలోకించారు.

ఒకమూల శివయ్య దంపతులు చేతులు కట్టుకొని పోలీసు బందోబస్తు మధ్య నిలబడి వున్నారు. వాళ్ళపక్కనే ఈశ్వరరాజు సత్తిరాజు వాళ్ళిద్దరి మధ్యన గౌరి వరుసగా నిలబడి ఉన్నారు!

సర్ లాంగ్‌కోట్ తల పంకించి భోషాణంపెట్టెను ఎత్తి వేదికమీద వాళ్ళకు, కిందవాళ్ళకూ కూడా చూపించి సీలు ఊడదీశాడు. పెట్టెతెరిచి కొబ్బరికాయ బయటికి తీశాడు. ఎత్తి పట్టుకొని మళ్ళీ అందరికీ తిప్పి తిప్పి చూపించాడు. అమెరికా నుంచి ప్రత్యేకంగా రప్పించబడిన బ్రేక్ టెంకాయ నిపుణుడు, రష్యానుండి పీస్ టెంకాయ నిపుణుడూ ముందుకు వచ్చి సర్ లాంగ్‌కోట్‌గారినుంచి కొబ్బరికాయను అందిపుచ్చుకొన్నారు. నిపుణులిద్దరూ విడివిడిగానూ, కలిసికట్టుగాను పరీక్షించి 'ఉసీజ్ నథింగ్ బట్ టెంకాయ, అండ్ ఓన్లీ టెంకాయ' అని విడివిడిగా తమ అభిప్రాయాల్ని తెలియజేశాడు. విడివిడిగా చెప్పినా కూడా అది ఏకగ్రీవమయిన అంగీకారం అవడం అందర్నీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచివేసింది. అందులోనుంచి తేరుకొన్నవాడు తేరుకొన్నట్టు హర్షధ్వానాలు చేస్తూ తమ ఆమోదాన్ని తెలియజేశారు!

నిపుణుల పరిశీలన అయాక సర్ మిస్టర్ లాంగ్‌కోట్ టెంకాయ ఇంటర్‌నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చీఫ్ ఇంజనీరు చేతికిచ్చాడు.

చీఫ్ ఇంజనీర్ సున్నితంగా కొబ్బరికాయను అటూ ఇటూ తిప్పి పీచును అతి లాఘవంగా ఒక్కసారి గుంజేశాడు.

బట్టతలవాడి నెత్తిమీద విగ్గు లాగేసినట్టు గుండ్రటి బోడి టెంకాయ బయటపడింది.

వెంటనే 'పీస్‌టెంకాయ' రష్యా నిపుణుడొచ్చి ఆ పీచు ఎలా అంటించబడిందీ వేదిక ముందున్నవాళ్ళందరికీ వివరించి చెప్పాడు,

టెంకాయ ఇంటర్‌నేషనల్ చీఫ్ ఇంజనీరు కొరిడికొబ్బరికాయను అతి నైపుణ్యంగా తిప్పి 'బ్రేక్ టెంకాయ' నిపుణుడైన అమెరికన్ చేతుల్లో పెట్టాడు. టెంకాయ మధ్యకు ఎలా అతికించబడిందో వివరించి అమెరికా నిపుణుడు కూర్చున్నాడు. వేదికమీద ఎత్తైనబల్ల, ఆ బల్లమీద మఖమల్ బట్టపరిచి ఉంది. టేబిల్‌మీద కొబ్బరికాయ పెట్టి చీఫ్ ఇంజనీర్ సర్ లాంగ్‌కోట్‌కేసి చూశాడు. లాంగ్‌కోటుగారి అనుమతి పొంది కొబ్బరికాయ పగులగొట్టడానికి కౌంట్‌డౌన్ మొదలపెట్టాడు

వేదికమీద ఉన్నవాళ్ళు సభలో ఉన్నవాళ్లు సముద్ర తరంగాల్లా లేచి నిలబడ్డారు. కెమెరాలు క్లిక్. ఫ్లాష్‌లైట్ల వెలుగుల్లో కళ్లు చిదతలారిపోతున్నాయి!

చీఫ్ ఇంజనీరు పదినుంచి అవరోహణ క్రమంలో చదువుతూ 'సూన్యం' (జీరో) అని ఆఖరి అంకె చదివాడు.

కొబ్బరికాయ రెండుగా విడిపోయింది.

మహెంజదారు హరప్పాలనాటి మూడు బుల్లిబుల్లి మట్టి కోతిబొమ్మలు బయటపడ్డాయి!!!

ఒక కోతి కళ్ళుమూసుకొని ఉంది!

రెండోది చెవులు మూసుకొని ఉంది.

మూడో కోతి నోరుమూసుకొని ఉంది!!

వేదికమీదున్నవాళ్లు దిగ్భ్రాంతి చెందారు. వేదిక కింద ఉన్నవాళ్ళు దిమ్మరపోయారు. భాషలో తేడా అంతే! జరిగింది మాత్రం ఒకటే!

అందరూ కళ్ళు నులుపుకొని తలలు విదిలించుకొంటుండగా ఫ్రెంచి దౌత్యోద్యోగి ఒకరు హడావుడిగా వేదిక మీదకు పరుగెత్తుకొచ్చారు.

ఫ్రెంచ్ విదేశాంగమంత్రి ముందు వంగి చెవులో చెప్పాడు.

పారిస్ మ్యూజియంలో మాయమైన వజ్రాలు ఎలిసీ ప్యాలెస్‌లో దొరకాయని, దేశాధ్యక్షుడే యీ దొంగతనం

చేయించి వేరే కొబ్బరికాయలో మూడు కోతిబొమ్మలు పెట్టాడనీ, వజ్రాలు అపహరించడానికి సహకరించిన ఫ్రెంచి ప్రధానిని, హోంమంత్రిని మభ్యపరచడానికి, నిజంగా కొబ్బరికాయలో వజ్రాలు దాచినట్టు, అది అంతర్జాతీయ దొంగలముఠా కాజేసికెళ్ళినట్టు ఒక కట్టుకథ సృష్టించి ప్రచారం చేయించాడనీ, కెజీబి, సిఐఎ గూఢచారి సంస్థల ద్వారా వెల్లడవంతో ఫ్రెంచి ప్రజలు తిరుగుబాటుచేసీ ప్రసిడెంట్ నివాసమైన ఎలిసీ ప్యాలెస్‌మీద దాడిచేసి ప్రెసిడెంటును చంపి వజ్రాలను స్వాధీనం చేసుకొన్నారనీ, ప్రధాని, హోంమంత్రి దేశాన్ని వదిలి పారిపోయారని పేరిస్‌నించి వర్తమానం ఇప్పుడే వచ్చిందని ఫ్రెంచ్ దౌత్యోగి విదేశాంగ మంత్రికి చెప్పాడు.

వెంటనే ఫ్రెంచ్ విదేశాంగమంత్రి మైక్ దగ్గరకొచ్చి జరిగింది చెప్పి ఫ్రెంచి ప్రజల తరుపున, ప్రభుత్వం తరపున భారత ప్రజలకు ముఖ్యంగా కోనసీమ వాసులకు. ప్రత్యేకించి శివయ్య దంపతులకు, ఈశ్వరాజుకీ, సత్తిరాజుకీ లాస్ట్ బట్ లీస్ట్‌గా-సారీ లాస్ట్ బట్ నాట్ లీస్టుగా గౌరికి క్షమాపణలు చెప్పుకొన్నాడు.

ఫ్రాన్సు దేశాధ్యక్షుడి దుశ్చర్య కారణంగా భారతీయులు అనుభవించిన కష్టాలకు, నష్టపరిహారంగా వందేళ్ళ తర్వాత ఒక డజను మిరేజ్ విమానాలను స్వల్ప వడ్డీతో వాయిదాలమీద తీర్చుకొనే పద్ధతిలో అప్పుగా ఇస్తానని, పడిపోయిన ఫ్రెంచ్ తరపున వాగ్దానం చేశాడు. అంతేగాదు. ఫ్రెంచి విదేశాంగమంత్రి శివయ్య నిజాయతీని మెచ్చుకొంటూ, ఒక వెయ్యిమాటపదహార్లు ఫ్రాంకులు పారితోషికంగా నిండుసభలో, వేదికమీద నిలబడి ప్రకటించేశాడు.

అందుకు శివయ్య ముందుగా కృతజ్ఞత తెలియచేసి తర్వాత అన్నాడు,

"దొరా నువ్వు బుడతకీచు దొరవో, పరాసు దొరవో నాకైతే తెలవదుగాని నువ్వు నా కిచ్చిన ప్రాంకులన్నీ ఎట్టి మీ ఎలిశమ్మ బంగళా ఎదురంగా మా ఆంజనేయసాములోరి గుడి కట్టించమని నా ఏడికోలు ఇన్నపాలు దొరా!" సభికులు చేసిన హర్షధ్వానాలు ఎలిసి ప్యాలెస్‌దాకా వినిపించాయి. వేదిక మీదవాళ్ళు కిందకూ వెనకవాళ్ళు ముందుకూ వచ్చి శివయ్యను అభినందించారు.

"మరి మా మాటో?"

ముక్కోటి దేవతలూ ఒక్కటై విలపించారు.

సమాప్తం.

ఎన్. బి. సశేషం లేదు.

14

జీప్ రాజమండ్రి స్టేషన్ ముందాగింది. కాయితాలను మడిచి కల్పన కిచ్చాను.

"ఎలావుంది మేడమ్?"

"బావుంది!"

"నిజం చెప్పండి మేడమ్?" కల్పన కళ్ళు మెరిశాయి.

"నిజంగా చాలా బాగుంది కల్పనా!" నా బుర్ర కదిలిపోయింది. కల్పన ఇంత బాగా ఎలా రాయగలిగిందా అని ఆలోచిస్తూ జీప్‌దిగి స్టేషన్లోకి నడిచాను.

గోదావరి ఎక్స్‌ప్రెస్ అరగంట లేటని చెప్పారు. ప్లాట్‌ఫారంమీద అటూఇటూ పచార్లుచేస్తుంటే కల్పన పక్కనే నడుస్తున్నది.

"ఏమిటి మేడమ్ ఆలోచిస్తున్నారు! నా కథను గురించే గదూ?" మనసుని చదివినట్టే అడిగింది. ఆశ్చర్యంగా చూశాను కల్పనను.

"అవును! నీ కథగురించే "

"ప్లీజ్! ప్లీజ్ చెప్పండి మేడమ్!" చిన్నపిల్లలు కాడ్‌బరీ చాక్‌లెట్స్‌కోసం అల్లరిచేసినట్టుగా ఉంది కల్పన ధోరణి.

"నీ కథకు ముగింపేది?"

"సమాప్తం అని రాసేనుగా మేడం. ఇట్లాంటి డౌట్ వస్తుందని యన్.బిలో సశేషం లేదనికూడా రాశాను."

కొంటెపిల్ల. నవ్వాగడంలేదు నాకు.

"ఇంతకీ గౌరి ఎవరిని వరించింది? ఈశ్వరాజునా? సత్తిరాజునా?

"అదే సస్పెన్స్! ముగింపు చెప్పేశానంటే సినిమావాళ్ళు కథ కొట్టేస్తారు మేడం—అందుకని-"

"సర్లే! నాకు చెప్పు. నేనేమీ సినిమాలు తియ్యబోవడం లేదు."

"ప్రొడ్యూసర్లెవరూ కథలు వెతుక్కుంటూ రైల్వే ప్లాట్‌ఫారాలమీద తిరగడంలేదు కాని చెప్పు!"

"అది సినిమా తీశాక పిక్చర్ ఫెయిలయితే చేసే పని! ఇప్పుడు మీరొకటి?..."

"ఏమిటీ?" ఆగి కల్పన ముఖంలోకి చూశాను.

"ప్రామిస్!"

"ఎవరికీ చెప్పనులే నీ ముగింపు. చెప్పు." కథకు ముగింపేమిటో తెలుసుకోవాలని ఆతృతగా ఉంది నాకు.

"మీకు కోపంరాకుండా ఉంటే?"

"నా కోపం ఎందుకూ?" తెల్లపోయాను. అయోమయంగా ఉంది.

కల్పన దగ్గరగా జరిగింది.

"ఈ రాజు, సత్తిరాజూ రామభక్త హనుమాన్ భక్తులయిపోయారు!"

"అంటే?"

"ఆజన్మబ్రహ్మచారులుగా ఉండిపోయారు?"

"మరి గౌరి?"

"ఆంజనేయస్వామి భక్తురాలయి ఆజన్మబ్రహ్మచారిణిగా ఉండిపోయింది!" ఆగి నా కళ్ళలోకి చూసింది.

"కోతి!" వచ్చే నవ్వును పెదవులకింద తొక్కిపట్టుకొన్నాను.

మరి "కొబ్బరికాయో?" అల్లరిగా చూసింది కల్పన. వీపుమీద చరిచాను.

"మేడమ్. సీరియస్‌గా అడుగుతున్నా- కథమీద మీ విమర్శ- విశ్లేషణ కావాలి నాకు. చెప్పండి."

ఆలోచనలో పడ్డాను- కథంతా గుర్తుచేసుకుంటూ నడుస్తున్నాను.

"మీరేమి ఆలోచిస్తున్నారో చెప్పమంటారా మేడమ్!" నన్ను రాసుకొని నడుస్తూ అన్నది కల్పన.

"ఊ! చెప్పు చూద్దాం?"

"ఈ కథకు సాంఘిక ప్రయోజనం ఉందా అని!" ఆగి చూసింది,

"ఊఁ. ఇంకా?"

"సమాజంలో స్త్రీకి జరుగుతున్న అన్యాయాన్ని గురించి ఏమయినా ఉందా?"

"ఇంకా?"

"ఆర్థికసిద్ధాంతాలు—మార్క్సిజం—శాస్త్రీయదృక్పథం-" నా ముఖంలోకి చూసి ఆగిపోయింది కల్పన.

నాకు నిజంగా కోపంవచ్చింది. ఆపుకోవడానికి నేను చేసిన ప్రయత్నం విఫలమైనట్టుంది- ముఖంచూసి గ్రహించింది కల్పన

లేని నవ్వు తెచ్చిపెట్టుకొన్నాను. అనవసరంగా రియాక్ట్ అయానేమో ననిపించింది ఒకోసారి అలా అయిపోతుంటుంది! స్పోర్టివ్‌గా కల్పనకేసి చూశాను.

"ఆగావేం? ఊఁ కానియ్?" ప్రోత్సహిస్తూ భుజం తట్టాను.

"కథలో పడవకు బదులు కాంటెసా కారో, వాయుదూతో పెడ్తే హీరో హీరోయిను ఎంచక్కా హాయిహాయిగా డ్యూయెట్లు పాడుకుంటూ శాంత గంభీర..."

"చాలుచాలు. అర్థమైంది. ఊఁ! తర్వాత?"

With best compliments from :

ENGRAVING HOUSE

6-1-91/27, Vasavi Nagar,
Meera Talkies Road, Khairatabad,
HYDERABAD - 500 004.

Manufacturers of :

Company Common Seals, Metalic Plates,
Stamping Tools. Precision Components,

"బాండెడ్ లేబర్ల విముక్తి పోరాటానికి ఈ కథలో ద్రోహం జరిగిపోయిందని-"

"ఆఁ ఆ!" నాకు నిజంగానే ఇది అర్థంకాలా!

"లక్షణస్వామి, హనుమంతుడూ రాముడి కట్టుబానిసలు. ఎదురుతిరిగిన వీళ్ళ పోరాట పటిమను నీరుకార్చేసింది రచయిత్రి. రివిజనిస్టు. అదే కోనసీమ కాకుండా శ్రీకాకుళం అయితే!"

"ఆగాగు. అర్థమైందిలే!"

"ఇంకా మీ రేమాలోచిస్తున్నారంటే- పడవలో చచ్చిపడి ఉన్న సన్యాసి శవం లేచి..."

"స్టాప్. స్టాప్." కల్పన వీపుమీద గట్టిగా చరిచాను. నవ్వాగడంలేదు. గబగబా ముందుకు నడిచాం.

గోదావరి ప్లాట్‌ఫారంమీదకొచ్చి ఆగింది

కల్పన సామాను కంపార్ట్‌మెంట్‌లో పెట్టించింది. డోర్ దగ్గర నిలబడి కల్పన కళ్ళల్లోకి సూటిగా చూశాను.

"నా అభిప్రాయాన్ని నువ్వు వినలేదే?"

"మీరు చెప్పలేదుగా!"

"నువ్వు చెప్పనిస్తేనా?"

"చెప్పండి!"

"విను!"

"యస్-మేడమ్!"

"ఒకటి- కథలో పౌరాణిక, జానపద, సాంఘిక ఇతివృత్తాలను కలిపి కిచిడీ కొట్టేశావు. రెండోది- భూత వర్తమాన కాలాలకు ఎల్లలు చెరిపేశావ్! మూడు-"

"ఒన్‌మినిట్ మేడమ్! మీరు రెండుగా చెప్తున్నది వాస్తవానికి ఒకటే. భూత భవిష్యత్ వర్తమానకాలాలు కలిసిపోతే పౌరాణిక జానపద సాంఘికాలంటూ విడివిడిగా ఇతిహాసాలూ, ఇతివృత్తాలూ ఎలా ఉంటాయి?"

దిమ్మరపోయాను. షి యీజ్ రియల్లీ ఎ జీనియస్!

"కల్పనా?" తర్వాత నోట మాట పెగల్లేదు.

రైలు కూతవేసింది.

"కల్పనా. కాలానికి గమనం లేదంటావా?"

మనసంతా తాత్త్వికచింతనమీద లగ్నమయింది.

"మేడమ్! ఈ కథను ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన ఒక సిద్ధాంతం ఆధారంగా చేసుకొని రాశాను!"

"సిద్ధాంతమా? ఏమిటది?"

"ఐన్‌స్టీన్ థియరీ ఆఫ్ రిలెటివిటీ!"

రైలు కదిలింది.

"బై-బై- కల్పనా థాంక్యూ వెరిమచ్!"

చెయ్యి ఊపుతూ ప్లాట్‌ఫారంమీద నిలబడిన కల్పనను చూపు అందినంతవరకూ చూస్తూ డోర్‌దగ్గర నిలబడ్డాను.

"థియరీ ఆఫ్ రిలెటివిటీ! సాపేక్ష సిద్ధాంతం బుర్రలో గిరగిరా తిరిగిపోతుంది.

కంపార్ట్‌మెంట్‌లో ప్రవేశించి బెర్త్‌మీద కూర్చున్నాను. తలెత్తి చూశాను.

ఎదురుగా ఆ మాజీమంత్రి!

గుండెలు కలుక్కుమన్నాయి.

వెంటనే కేబిన్‌లోనుంచి బయటికొచ్చాను! కూపే ఖాళీగా ఉంది. వెళ్ళి కూర్చున్నాను.

బయట గాలీ-వానా మొదలయింది!

బంగాళాఖాతంలో మళ్ళీ వాయుగుండమా

థియరీ ఆఫ్ రిలెటివిటీ- అదే బుర్రలో తిరుగుతోంది? కోతి, కొబ్బరికాయకు సాపేక్షసిద్ధాంతానికి ఉన్న సాపేక్షభావనేమిటి?

ఐన్‌స్టీన్ థియరీ ఆఫ్ రిలెటివిటి - ఏనాడో మస్తిష్కంలో మరుగుపడిన సాపేక్ష సిద్ధాంత సూత్రాలను జ్ఞప్తికి తెచ్చుకొంటున్నాను!

ఉలిక్కిపడ్డాను.

కూపే డోర్ తోసుకొని మాజీమంత్రి ఎదురుగా వచ్చి నిలబడ్డాడు! కూపే డోర్ లాక్‌చెయ్యడం మరిచినట్టు అప్పుడు గుర్తొచ్చింది.

"సీతాదేవిగారూ! తమాషాగా ఉంది కదూ?" ఆయన ముఖం చూస్తుంటే గుండెల్లో జెర్రులు పడుగెత్తాయి. రోగ్? అప్పట్నుంచి కాపుకాస్తున్నాడన్నమాట!

"తమాషా ఏమిటి?" ఎలా అన్నానో తెలియదు. అలాంటి స్థితిలో ధైర్యం దానంతట అదే వస్తుందేమో? ఇన్‌స్టింక్ట్ ఆఫ్ సెల్ఫ్ ప్రిజర్వేషన్.

"మళ్ళీ తిరుగుప్రయాణంలో కూడా కలుసుకొన్నాం!"

"అయితే?" ఎందుకైనా మంచిదని లేచి నిలబడ్డాను.

"ఇవ్వాళ్ళ పత్రిక చూశారా?"

"చూళ్ళేదు? ఏం?" బయటికి వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాను.

"అన్నగారి పార్టీలో చేరుతున్నట్టు వార్త వొచ్చింది!" పక్కకు తప్పుకొని అన్నాడు.

"ఎవరూ చేరుతుంది?"

"నేనే!"

"మీరు. మీరు అన్న పార్టీలో చేరుతున్నారా?"

"ఏమ్మా అంత ఆశ్చర్యపోతున్నారు? నాకంటే-"

'త్రాస్టులు చాలామంది ఉన్నార్లే!' మనసులోనే అనుకొన్నాను.

అతడు ఆనందంగా నవ్వాడు. నేను వొట్టివొట్టిగా బొలు బొలుగా నవ్వాను. ఏడవలేక నవ్వటం అంటారే అలా.

"మీ సామాను యీ కంపార్టుమెంటులోనే పెట్టుమంటారా?"

"థాంక్స్. మీకు శ్రమ!"

"శ్రమేమిటమ్మా. ఆడబడుచులకు ఆ మాత్రం సేవ చెయ్యలేమా?" అని సామాను తెచ్చి కుపేలో సర్దిపెట్టాడు.

"జాగ్రత్తమ్మా. ఒంటరిగా ఉన్నారు. తలుపు గడి వేసుకోండి!" అని హెచ్చరిక చేసి వెళ్ళిపోయాడు మాజీ మంత్రి.

ఏమిటి మార్పు ఇది నిజమైన మార్పేనా? సాపేక్షసిద్ధాంతం బుర్రలో కదిలింది.

ఇదేనా సాపేక్షిసిద్ధాంతమంటే? సిల్లీ. నాలో నేనే నవ్వుకొన్నాను.

బోల్టు బిగించి పక్క పరచుకొని పడుకొన్నాను. మస్తిష్కంలో కోతీ కొబ్బరికాయే తిరుగుతోంది. సాపేక్ష సిద్ధాంతాల సూత్రాలకు, ఈ కథకు ఎలాంటి పొత్తు? ఏమి అన్వయం ఉంది?

మాస్ అండ్ స్పేస్! టైం అండ్ వెలాసిటీ!! వేగాన్ని బట్టి వస్తువు పరిమాణం మారుతుంది. వేగం పెరిగినకొద్దీ వస్తువు పరిమాణం పెరగాలి యస్ యస్ క్లూ దొరికింది.

కోతి వేగానికి చిహ్నం!

కొబ్బరికాయ వస్తువు.

కోతి చేతిలో కొబ్బరికాయ!

కోతి స్పేస్‌కు వెలాసిటీకి సింబల్ అయితే కొబ్బరికాయ మాస్‌కూ సింబల్ అవుతుందా యీ కథలో?

కోతి చేతిలోవున్న కొబ్బరికాయ పరిమాణం పెరిగిందా? ఎలా? ఎలా అన్వయం?

ష్యూర్, ష్యూర్. కొబ్బరికాయ పరిమాణం పెరిగింది! ఇంతింతై విశ్వాంతరాళం అంత అయింది. కోనసీమలో పుట్టిన కొబ్బరికాయ కథ ఫ్రాన్స్ దేశాధ్యక్షుడి ఎలిసీప్యాలెస్ దాకా పెరిగింది.

వండర్‌ఫుల్ - మాస్టర్‌పీస్.

త్రీ చీర్స్ టు యూ కల్పన!

కల్పనను మనసారా దీవించి గుండెలకు హత్తుకోవాలన్పించింది. కల్పన రూపం నా కళ్ళల్లో నిల్చిపోయింది. కల్పన భావోద్రేకత, కల్పనాశక్తి నా మనసును చుట్టేశాయి

హాయిగా నిద్రపోయాను.

ఉదయం తొమ్మిదిన్నరకు గోదావరి ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరింది.

Specialists in :

LEPAKSHI
ORGANDI
KOTA
CHIFFON AND
FANCY PRINTED SAREES

PHONE: 61800

Suresh Textiles
EXCLUSIVE SAREE PARADISE

BESANT ROAD. GOVERNORPET. VIJAYAWADA-520 002.

సామాను కూలీ అందుకొన్నాడు. రైలు దిగి స్టేషన్ బయటికొచ్చి పోర్టికోలో నిలబడి మా డ్రైవర్ కృష్ణకోసం చూశాను.

"బండిక్కడుంది. ఇటు సార్!" వెధవ! వెనకే నిలబడి ఉన్నాడు. నోట్లో బెల్లంగడ్డ ఉన్నట్లు మాట్లాడతాడు. ఆడ మగ అందరాఫీసర్లు సార్లే వీడికి!

యథాలాపంగా కృష్ణ ముఖంలోకి చూశాను. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ముఖం ఉబ్బి ఉంది.

"ఏం? అట్లా ఉన్నావ్? రాత్రంతా తాగిచచ్చావా?"

"లేదుసార్!" కృష్ణ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎర్రటి జీరలపైన పొంగిన కన్నీరు రక్తం కన్పించింది!

"ఏమైంది కృష్ణా?" గాబరాపడ్డాను- ఆదుర్దాగా ఉంది.

"మా అదృష్టం!" కళ్ళనీళ్లు తుడుచుకొన్నాడు.

"అయితే ఎందుకేడుస్తావ్? అసలేమయింది?" చిరాగ్గా ఉంది.

"మీరు బతికొచ్చారు, అంతే సాలమ్మగారూ!"

"బతికిరావడం ఏమిటి?" జీప్‌లో ఎలా ఎక్కానో తెలియదు. "ఏమైంది కృష్ణా" నోరెండిపోతున్నది. ఏదో తెలియని అవేదన- ఆతృత!

"రాత్రి ఆఫీసుకు ఫోన్‌వచ్చింది." గుటక మింగాడు.

"ఆఁ! ఫోనొస్తే?"

"నిన్న రాత్రి మిమ్మల్ని రాజమండ్రి స్టేషన్లో దించి తిరిగివెళ్తున్నప్పుడు జీప్-" అక్కడాగి "మీరొచ్చేప్పుడు జరిగితే?" అని మళ్లా ఆగాడు.

నిస్సహాయంగా కృష్ణ మొఖంలోకి చూశాను. అతడే చెప్పాలి. నేనిక అడగలేను.

"తెల్లార్లూ వాచ్‌మెన్ యాదయ్యా నేను ఏడ్చాం. ఏడు గంటలకు మళ్ళా మాకు ఫోన్ దొరికింది. జీప్ తిరిగొచ్చేప్పుడు జరిగిందని!" జీప్ ఎక్కి స్టీరింగ్ పట్టుకొన్నాడు.

"ఏం జరిగిందీ?" నా అరుపుకు సికింద్రాబాదు స్టేషన్‌మీది గడియారం ఊడిపడాల్సింది- పడలేదు! ఆగిపోయింది జీప్ స్టార్టయి ఒక్క దూకు దూకింది,

"జీపు కాలవలో పడింది!"

ప్రాణాలు కదబడ్డాయి. తల మొద్దుబారిపోయింది.

"జీప్‌లో-"

"కల్పనమ్మా, డ్రైవరూ, అటెండరు హనుమంతూ ఉన్నారు."

డ్రైవరు పక్కకు తిరిగి నా ముఖంలోకి చూశాడు

"అటెండర్ హనుమంతు ఈదుకొని ఒడ్డుకు చేరాడు. డ్రైవర్ లక్ష్మయ్య శవం దొరికింది."

The greatest cooling power by far.



* Designed to withstand 45°C
* Available on concessional excise duty for special applications
* Unique oscillating louvres
* Choice of finishes in grills

AMTREX

Air conditioners
0.5, 1, 1.5, and 2 tonnes

Marketed by.
SPECTRUM ELECTRONICS
Opp. Urdu Hall, Himayatnagar.
Hyderabad Ph. 228106

"కల్పనా?" గుండెలు చీలిపోతున్నాయి! మెదడు ముక్కలు ముక్కలవుతున్నట్టుగా ఉంది.

"తెలియదు!"

"ఆఁ! నా ఊపిరిపోతూంది.

"ఇంకా వెతుకుతున్నారట!"

ఇంటికి చేరుతూనే అమలాపురం లైట్నింగ్‌కాల్ బుక్ చేశాను- రిసీవర్ చేతులో పట్టుకొనే ఉన్నాను.

"సారీ మేడమ్- లైన్స్ అవుటాఫ్ ఆర్డర్!" రిసీవర్ చేతుల్లోనుంచి జారిపోయింది.

కల్పనా- కల్పనతోపాటు ఆమె కోతి-కొబ్బరికాయ కథ- ఓ హనుమాన్!

రాజమండ్రి స్టేషన్లో ప్లాట్‌ఫారంమీద నిలబడి వీడ్కోలు ఇస్తున్న కల్పన ఇంకా నా కళ్ళల్లో- వో భగవాన్!

దుఃఖం పొర్లుకొస్తుంది.

గోదావరి పొంగులా.

15

"సెవన్ సిక్స్ ఫైవ్ ఎయిట్ త్రీ అండీ?"

"యస్ ప్లీజ్!"

"అమలాపురంనుండి ట్రంక్‌కాల్. మాట్లాడండి"

ఆపరేటర్ లైన్ ఇచ్చింది.

"హల్లో!"

"గుడ్ ఈవెనింగ్ మేడం?"

"ఎవరూ?" ఆనందంతో గొంతు పూడిపోయింది.

"నేను కల్పనను! క్షేమంగా చేరారా?"

"నా క్షేమం సరే! జీప్ కాలవలో..."

"పడింది. డ్రైవర్‌కు రేచీకటి అని మీకు చెప్పానేమో? ఎదురుగా లారీ వస్తుంటే బాగా పక్కకు తిప్పాడు. డ్రైవర్ వైపు పడటంతో నేను బతికి బయటపడ్డాను మేడం. కాలవలో కొంతదూరం వాలుకు కొట్టుకుపోయాను. లక్కీ.. కాలవలో వెళ్తున్న కొబ్బరికాయల పడవవాళ్ళు నన్ను సేవ్ చేశారు. హనుమంతూవాళ్ళు నా బాడీకోసం——"

"ఏమిటా మాటలు?"

"అదే మేడం. నాకోసం జీపు పడినచోట వెతికారట. శవం కన్పించకపోవడంతో మనిషే గల్లంతనుకున్నారు.

"థాంక్ గాడ్!"

"థాంక్ కొబ్బరికాయల పడవ!" ఫోన్లో కల్పన నవ్వు విన్పించి నాకూ నవ్వొచ్చింది.

"ఇంతకీ నీ కోతీ-కొబ్బరికాయ స్క్రిప్టు ఏమైంది? కాలవలో కొట్టుకుపోయిందా?"

"నో నో! మేడం. పర్స్‌లో పెట్టానుగా! పర్స్ భుజానికే ఉంది. అయితే మేడం పర్సులోకి నీళ్ళుపోయి కాయితాలు తడిసినై. ఎండబెట్టి చూస్తాను గదా ఒక్కొక్క అక్షరం తాటికాయలం - కాదుకాదు - కొబ్బరికాయలంత అయిపోయినై."

"సరేగాని, ఇది విను. రాత్రంతా ఆలోచించాను. నీ కథకు ఐన్‌స్టీన్ థియరీ ఆఫ్ రిలెటివిటీకి ఉన్న పొంత నేమిటో నాకు బోధపడలేదు."

కల్పన పకపక నవ్వడం స్పష్టంగా విన్పించింది.

"నా బొంద! ఐన్‌స్టీన్ థియరీకీ నా కథకూ సంబంధం ఏమిటి? ఉంటే అది బోడిగుండుకూ మోకాలికీ వున్న సంబంధం లాంటిదే!"

నాకు వొళ్ళు మండిపోయింది.

"మరెందుకలా చెప్పావ్? రాత్రంతా ఏదేదో ఊహించుకొంటూ బుర్రంతా చెడగొట్టుకొన్నాను,"

"ఇప్పుడు కొత్త టెక్నిక్ అదే కద! రచయితలూ, రచయిత్రులూ-అందరూ కాదనుకోండి-చాలామంది సిలికాన్ టెక్నాలజీ అడ్డంపెట్టుకొని తలాతోకా లేని కథలు వ్రాసి అదంతా ఓ పెద్ద టెక్నిక్, సైన్సూ అంటున్నారుగా మేడం. అందుకని కొండకి గాలంవేసినట్టు, ఐన్‌స్టీన్ థియరీ ఆఫ్ రిలెటివిటీయే నా కథకు మూలం అని కోసేశాను. క్షమించాలి గురూ! మేడమ్! నేను ఆర్ట్ స్టూడెంటును. నా కసలు ఐన్‌స్టీన్ థియరీ కాదుకదా, టీవీ స్క్రీన్‌మీద బొమ్మ ఎలా పడ్తుందోకూడా తెలియదు మేడమ్."

"సరే గానీ! నీకో గుడ్ న్యూస్!"

"చెప్పండి మేడమ్?" కల్పన కంఠం ఆశగా పల్కింది.

"ఇక్కడో సినిమా ప్రొడ్యూసర్‌కు నీ కొబ్బరికాయ కథ చెప్పాను. సినిమా రైట్సు కావాలంటున్నాడు, ఇస్తావా?"

"ఇస్తా మేడం ఇస్తాను." ఆ గొంతులో ఎంత సంతోషమో?

పెదవి నొక్కిపట్టుకొని "అయితే ఒక కండీషన్ పెడ్తున్నాడు" అన్నాను!

"ఏమిటి మేడమ్ అది. ఏం కండీషన్?"

"నీ కథలో కోతిలా చేసే కోతి దొరకడం కష్టం అంటున్నాడు. అందుకని..." వస్తున్న నవ్వును బిగబట్టుకొన్నాను.

"అందుకనీ?" దీర్ఘంతీసింది కల్పన.

"నువ్వా వేషం వేస్తే నీ కథ సినిమా తీస్తాడంటోయ్."

మౌత్‌పీస్‌కు చెయ్యిఅడ్డంపెట్టుకొని విరగబడి నవ్వుతూ వింటున్నా.

మాటా పలుకూ లేదు. కొద్ది క్షణాలపాటు నిశ్శబ్దం.

అమ్మాయిగారి తిక్క వదిలిపోయింది. లేకపోతే నన్ను ఆటలు పట్టిస్తుందా బోడి?

"మేడం ఒప్పుకొంటున్నా. అయితే ఒక కండీషన్!"

"ఏమిటో చెప్పు!" ఖుషీఖుషీగా అన్నాను.

"ఆ ప్రొడ్యూసర్ కొబ్బరికాయ వేషం వెయ్యాలి!"

"సిక్స్ మినిట్స్ ఓవర్"

టెలిఫోన్ గరల్ గొంతు విన్పించింది.

లైన్ కట్ అయింది.

Printed and Published by A. Chandra Seker Rao at 5-9-88, Public Garden Road, Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor: A. SUDHAKARA RAO